ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 161 పేజీలు: 10+4 వెల: 6.50


17 పార్లమెంట్లలో ప్రధాని మోడీ ప్రసంగాలు 3లో

ఆరెస్సెస్, బిజెపిలో '75' యేళ్ల దుమారం



అంతా టీమ్‌వర్క్‌గా పనిచేస్తున్నాం..

కెసిఆర్ అసెంబ్లీకే కాదు, జనంలోకి కూడా రావడంలేదు

రోహిత్ వేముల ఆత్మహత్యకు రాంచందర్‌రావే కారణం

ఢిల్లీలో మీడియాతో డి.సిఎం భట్టి

# పవర్ షేరింగ్ మాకెందుకు?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై11:** కర్ణాటక తరహాలో తెలంగాణ ప్రభుత్వంలో పవర్ షేరింగ్ ఏమి లేదని, అందరం కలిసి టీమ్ వర్క్‌గా చేస్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నేతలు మితిమీరి మాట్లాడుతున్నారని, కెసిఆర్ అసెంబ్లీకే కాదు... ప్రజల మధ్యకు కూడా రావడం లేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జనాల్లోకి వెళ్తున్నారని గుర్తు చేశారు. మేం తెచ్చిన సన్నబియ్యం పథకం సక్సెస్ అయిందని, గతంలా పక్కదారి పట్టడం లేదని, ఉచిత బస్సుకు మహిళల నుంచి మంచి స్పందన ఉందన్నారు. మరో 3వేల బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయని, మూసీ సుందరీకరణ పూర్తి చేస్తామని చెప్పారు. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ జరిగి తీరుతుందని, దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుందని పేర్కొన్నారు.

తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేది లేదని బిజెపిని ఉద్దేశించి జోస్యం చెప్పారు. పాశమైలారంలోని పారిశ్రామిక వాడలో చోటు చేసుకున్న సిగాచీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పిఎసి సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే,ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. రూ.2లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయకూ >>2



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న సిఎం రేవంత్. చిత్రంలో అమెరికా కాన్సొలేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తదితరులు

# అమెరికా-తెలంగాణ సంబంధాలు పటిష్టం

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 200 అమెరికన్ కంపెనీలు

అగ్రరాజ్యంలో నానాటికీ విస్తరిస్తున్న తెలుగు

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నాం

అమెరికా 249వ స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై11:** అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్రం సిద్ధించిన తర్వాత ప్రపంచం పూర్తిగా మారిపోయిందని, అమెరికా ప్రపంచం ముందు అనేక సానుకూల అంశాలను ఆవిష్కరించిందని సిఎం ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో 249వ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారత దేశం, అమెరికా మధ్య దౌత్య సంబంధాలు 1947లో ప్రారంభమై నేటి వరకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, సాంకేతిక రంగాల్లో మరింత దృఢంగా మారాయని అన్నారు.

ఈ వేడుకలో భారత్-అమెరికా స్నేహ సంబంధాలను గుర్తు చేస్తూ, రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతరం ఆవిష్కరణలను అందించడమనే రెండు అంశాల్లో అమెరికా ప్రపంచ దృక్కో >>2



గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కల్పించేందుకు ప్రణాళిక

యేడాదిన్నరలో రూ. 50 వేల కోట్ల పెట్టుబడులు

24-25లో రూ. 66 వేల కోట్ల ఉత్పత్తుల ఎగుమతి

రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

# లైఫ్‌సైన్స్ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు

**హైదరాబాద్, జులై 11 ప్రభాతవార్త:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, ఆ క్రమంలోనే కేవలం ఏడాదిన్నరలో రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫలితంగా కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో ఈటీ ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్ రెండో ఎడిషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 2024-25లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసిందని, ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ వ్యాక్సిన్ రాజధానిగా ప్రసిద్ధి చెందిందన్నారు.

దేశంలో అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్ నుంచి మేడ్ ఇన్ తెలంగాణ స్టెంట్లు, కేథెటర్లు యూఎస్, జపాన్‌తో సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి అని ఈసందర్భంగా వివరించారు. లైఫ్ సైన్సెస్‌లో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించాలని మా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం అని అన్నారు. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్‌లో ఫార్మా విలేజెస్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే లైఫ్‌సైన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. ఇక్కడ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవ శాస్త్ర దిగ్గజసంస్థల భాగస్వామ్యంతో అందించబోతునామని, ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ >>2



## ప్రభుత్వ నిర్ణయంపైనే ఫీజుల పెంపు

స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఫీజు పెంపుపై.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం పైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టంగా చేసింది. ఫీజులు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకి హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజులు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయా కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై తెలంగాణ అడ్మిషన్లు, ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి) నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. 6 వారాల్లో నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టంచెసింది. >>2



శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు స్వాగతం పలుకుతున్న సిఎస్ రామకృష్ణారావు 2లో

# ఘోష్ కమిషన్‌కు అన్ని డాక్యుమెంట్లు ఇచ్చాం

6 సార్లు కేబినెట్, 3 సార్లు అసెంబ్లీ ఆమోదంతోనే కాళేశ్వరం

కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్

ప్రాజెక్టులపై రేవంత్, ఉత్తమ్ చెప్పేవన్నీ అసత్యాలే: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై11:** కాళేశ్వరం మీద ఏర్పాటైన పిసి ఘోష్ కమిషన్‌ను తప్పుదోవ పట్టించేలా వివరాలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందనే అనుమానం మాకు ఉంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం పిసి ఘోష్ కమిషన్‌కు అదనపు సమాచారం అందించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కమిషన్‌ను కలిసి అదనపు సమాచారం అందించాం. కమిషన్ నిన్న సమయం ఇచ్చారు. నిన్న కెసిఆర్‌కు వైద్య పరీక్షలు ఉన్న నేపథ్యంలో రాలేకపోతున్నాను అని కమిషన్‌ను రిక్వెస్ట్ చేయగా అంగీకరించారు. వారిచ్చిన సమయం ప్రకారం, శుక్రవారం కమిషన్‌ను కలిసి మా వద్ద ఉన్న అదనపు సమాచారం అందించాం. మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను దృష్టిలో పెట్టుకొని మా వద్ద ఉన్నంత మేరకు కమిషన్‌కు స్పష్టమైన సమాచారం ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. మేం ఇప్పుడు ప్రభుత్వంలోలేము. డాక్యుమెంట్స్ అన్ని ప్రభుత్వం



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న హరీష్‌రావు

వద్ద ఉంటాయి. సమాచారం కోసం చీఫ్ సెక్రెటరీ, జిఎడి సెక్రెటరీ, ఇరిగేషన్ సెక్రెట్రరీ గారికి లేఖ రాశాను. ఆ రోజుల్లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాలు, క్యాబినెట్ నోట్ వంటి సమాచారం కావాలని లేఖల రూపంలో అడిగాను. కాని వారి నుంచి స్పందన రావడం లేదు. మా వద్ద అందుబాటులో ఉన్న సమాచారం క్రోడీకరించి నోట్ రూపంలోఇచ్చాం. మా సమాచారం అధా >>2



## 14న భూమిపైకి శుభాంశు శుక్లా

రెండు వారాల వ్యోమ యానం పూర్తి

**న్యూఢిల్లీ, జులై 11:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం ఈ నెల 14న భూమికి తిరిగి రానున్నారు. దాదాపు రెండు వారాలుగా శుభాంశు శుక్లా ఐఎస్ఎస్‌లో ఉన్నారు. ఇప్పటివరకు 230 సూర్యోదయాలు చూసిన శుభాంశు 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. జూన్ 25న ఐఎస్ఎస్‌లో ల్యాండ్ అయిన శుభాంశు అనేక పరిశోధనలు చేస్తున్నారు. నాసా నుంచి క్లియర్ డైరెక్షన్స్ వెళ్లిన తర్వాత త్వరలోనే భూమికి తిరిగిరానుది శుభాంశు బృందం. యాక్సియం 4 బృందం దాదాపు 230 సార్లు భూమిని చుట్టివచ్చింది. వారు ఆరు మిలియన్ మైళ్ల (96.5 లక్షలకి.మీ) కంటే ఎక్కువ ప్రయాణించారు. భూమికి 250 మైళ్ల ఎత్తులో ఉండి తీరిక సమయాల్లో ఫొటోలు, వీడియోలు తీస్తూ సరదాగా గడిపింది. భూమిపై ఉన్న తమ ప్రియమైన వారితో సంభాషించడంతో పాటు మన గ్రహాన్ని వారి కెమెరాల్లో బంధించారు. రోజూవారీ బిజీ షెడ్యూల్ నుంచి ఇవి కాస్త ఉపశమనం కలిగిస్తాయని యాక్సియం స్పేస్ ప్రకటించింది. >>2

# మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే



శుక్రవారం హైదరాబాద్‌లో రాజ్యభాష స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న ఎపి డిప్యూటీ సిఎం పవన్. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు

హిందీని నేర్చుకోవడం మరింత బలపడడానికే: ఎపి డిప్యూటీ సిఎం పవన్

జాతీయ భాషావిభాగానికి 50యేళ్లు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 11, ప్రభాతవార్త :** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాలకోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయేతరాలఅభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుం >>2




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు

రూ. 235 కోట్లతో కొత్త ప్రభుత్వాసుపత్రికి భూమిపూజ


పాల్గొన్న మంత్రులు దామోదర, కోమటిరెడ్డి, జూపల్లి

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు దవాఖానాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 11 ప్రభాతవార్త:** వైద్య సేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా ఉండేలా వసతులను కల్పించి, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ ప్రజల అవసరాలు, వైద్య సేవల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వైద్య విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి మంత్రులు పర్యాటక సంస్కృతిక శాఖ జూపల్లి కృష్ణారావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ దామోదర రాజనర్సింహ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వెల్దండనుండి సిర్సనగండ్ల వరకు రూ.40కోట్లతో నిర్మించే బిటి (డబుల్) రోడ్డునకు శంకుస్థాపన, కొట్రగేట్ నుండి తలకొండపల్లి వరకు సుమారు 22 కిలోమీటర్ల వరకు రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించే బిటి (డబుల్) రోడ్డుకు, కల్వకుర్తిపట్టణంలో రూ.45.50 కోట్లతో నిర్మించే 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన, నాగర్ కర్నూర్ జిల్లా కేంద్రంలోనూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవనాల ప్రారంభోత్సవం, నూతన >>2

## ద.మ రైల్వే జిఎంగా ఎస్.కె శ్రీవాత్సవ

పిసిఇగా డి ఆంజనేయులు రెడ్డి



**గుంతకల్లు రైల్వే, జూలై 11, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా డి ఆంజనేయులు రెడ్డిలను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే ఆదేశాలు జారీ చేశారు. భారతీయ రైల్వే 1988వ బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ ప్రస్తుతం అలహాబాద్‌లోని కేంద్ర రైల్వే విద్యుదీకరణ సంస్థ(కోర్) జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అలాగే దక్షిణ మధ్య >>2




యమునానది అభివృద్ధిపై శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్‌షా తదితరులు

# 5 లక్షల ఉద్యోగాలు

>> ద్వారా డాక్టర్ రెడ్డీస్, అరబిందో లాంటి సంస్థలతో కలిసి తెలంగాణ యువతకు శిక్షణ ఇస్తున్నాం అన్నారు. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ (సి4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లకు లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులను తీర్చి దిద్దుతున్నాం అని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రత్యేకంగా తెలంగాణ కాంప్రెహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. ఇది చివరి దశలో ఉంది.
ఈ రంగాన్ని కేవలం పరిశ్రమలు లేదా ఆర్ అండ్ డి సెంటర్లకే మేం పరిమితం చేయడం లేదు. టెక్నాలజీ మేళవింపుతో ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఇప్పటికే మూడు జిల్లాల్లో నోటి, రొమ్ము , గర్భాశయ క్యాన్సర్ల ను ముందే గుర్తించేందుకు ఎఐ ఆధారిత స్క్రీనింగ్ ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం అని వివరించారు. కార్యక్రమంలో పలు దిగ్గజ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



శుక్రవారం ఉజ్జయినిలో 'కావడియాత్ర'లో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ తదితరులు

# అమెరికా-తెలంగాణ సంబంధాలు పటిష్టం

>> ణాన్ని మార్చిందన్నారు. ఓటమిని ఎప్పుడూ అంగీకరించని స్ఫూర్తి అమెరికాది. ఎల్లప్పుడూ బలమైన దేశంగా, అనేక అంశాల్లో ఒక సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపగలిగిందన్నారు. తెలంగాణ స్ఫూర్తి కూడా అమెరికా స్ఫూర్తికి ఎంతో సారూప్యత ఉందని, స్నేహాన్ని కోరుకోవడం, బంధాన్ని మరింత పటిష్టపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని చెప్పారు. 2008 లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైందని చెప్పారు. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించిందని చెప్పారు. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహపూర్వకమైన బంధం ఎంతో బలమైందని, అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్ కాన్సూల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలను పటిష్టపరచడంలో ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారని చెప్పారు. ఐటి, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం పనిచేస్తున్నాయని చెప్పారు. ఎంతో మంది విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవడానికి ఇక్కడి నుంచి అమెరికా వెళుతున్నారని చెప్పారు. అమెరికా - తెలంగాణల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపరచడానికి మేం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణను 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ దార్శనికతకు కట్టుబడి మా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందుకు మాకు అమెరికన్ల మద్దతు కావాలని కోరారు. జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా - భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందన్నారు. వ్యాపార, వాణిజ్య రంగాలు, పెట్టుబడులు, ప్రజాస్వామ్యాన్ని విస్తృతం చేయడం, ప్రపంచ శాంతిని నెలకొల్పడం వంటి లక్ష్యాలతో స్నేహపూర్వక బలమైన సంబంధాలు కలిగి ఉండాలని ఇరు దేశాలు కోరుకుంటున్నాయని చెప్పారు. ముఖ్యంగా సైనిక విన్యాసాలు, అంతరిక్ష పరిశోధనలో సహకారం, సాంకేతిక రంగంలో పెట్టుబడులకు సంబంధించిన వాణిజ్యంలో ఇరు దేశాలు రికార్డు నెలకొల్పాయన్నారు. హైదరాబాద్‌లో మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికాలోని అత్యుత్తమైన వాటిని తెలంగాణకు తీసుకొస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు థీమ్‌గా నిర్ధేశించినట్టుగా చెప్పాలంటే. 'ఒక్కటిగా ఉంటే.. మరింత పటిష్టంగా' ఎదగగలమని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నారాయణ్‌పూర్‌లో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, జులై 11, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నారాయణపూర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళా మావోయిస్టులు ఉండగా .. లొంగిపోయిన వారిపై రూ.37లక్షల రివార్డు ఉందని ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన ఒక్కొక్కరికి రూ.50వేల నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అబూజ్‌మడ్ అడవుల్లో నిరంతరం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతుందని, ఈ యేడాదిలో ఇప్పటి వరకు 110 మంది మావోయిస్టులు లొంగిపోవడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు.

# ఎస్.కె శ్రీవాత్సవ

>> రైల్వే పిసిఇగా పనిచేసిన బ్రహ్మానందం జూన్ 30న పదవి విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం సిటిఇగా పనిచేస్తున్న డి ఆంజనేయులురెడ్డిని నియమిస్తూ రైల్వే బోర్డు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

# హైదరాబాద్‌లో సిజెఐ గవాయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై11:** రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు శుక్రవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌తో పాటు సుప్రీం కోర్ట్ జడ్జి జస్టిస్ పిఎస్ నర్సింహాలకు రాష్ట్ర హైకోర్టు ఆక్టింగ్ (తాత్కాలిక) చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డిజిపి డా. జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ సిపి అవినాశ్ మహంతి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తదితరులు ఘన స్వగతం పలికారు.

# హెచ్‌సిఎ గోల్‌మాల్‌పై రంగంలోకి ఇడి

## కేసు వివరాలు ఇవ్వాలని సిఐడికి లేఖ

### జగన్‌మోహన్ రావు తదితరుల కస్టడీ కోరుతూ కోర్టులో సిఐడి పిటిషన్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** సంచలనం రేపిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) గోల్‌మాల్ వ్యవహారాలపై కేంద్ర దర్యాప్తు సం స్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రంగంలో దిగింది. హెచ్‌సిఎ గోల్‌మాల్‌కు సంబంధించి సిఐడి నమోదు చేసిన కేసుతో పాటు రిమాండు రిపో ర్టు. నిందితుల వాంగ్మూలం తదితర వివరాలను తమకు ఇవ్వాలని ఇడి శుక్రవారం నాడు లేఖ రాసింది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో వి చారణ చేసేందుకు ఈడీ సన్నద్ధమవుతోంది. బిసిసిఐ నుంచి అందిన కోట్లాది రూపాయల నిధులను హెచ్‌సిఎ పక్కదారి పట్టించి, సొంత అవసరాల కు వాడుకుందని సిఐడి విచారణలో తేలడం తెలిసిందే. దీంతో పాటు గత ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టును టికెట్ల కోసం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చడం విదితమే. ఉప్పల్ స్టేడియంలో జరిగిన కోట్లాది రూపాయల పనులలో భారీగా అక్రమాలు జరిగిన ట్లు సిఐడి విచారణలో తేలింది. దీంతో పాటు హెచ్‌సిఎ అధ్యక్షుడుగా జగన్‌మోహన్ రావు ఎన్నికే అక్రమమని సిఐడి తేల్చింది. మాజీ మంత్రి కృష్ణా యాదవ్ నెలకొల్పిన గౌలిగుడ క్రికెట్ క్లబ్‌ను ఆయనకు తెలియకుండా సంతకం ఫోర్జరీ చేసి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరిట ఓ క్లబ్‌ను తన వారిచేత తప్పు డు పత్రాలతో జగన్‌మోహన్ రావు ఏర్పాటు చేసినట్లు సిఐడి తేల్చింది. దీని తరువాత ఇందులో తన వారినే నియమించి, తాను సభ్యుడుగా చేరి, ఆరు నెలలకే హెచ్‌సిఎ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడం అంతా డ్రామాగా వుందని సిఐడితేల్చింది. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ గోల్‌మాల్ వ్యవహా రాలపై లోతుగా విచారించేందుకు నిర్ణయించిన ఈడీ దీనిపై పూర్తి వివరాలు తమకు ఇవ్వాలని సిఐడికి లేఖ రాసింది. సిఐడి అందించే వివరాల ఆ ధారంగా ఈడీ హెచ్‌సిఎ పెద్దలపై ఈసిఐఆర్ నమోదు చేయనుంది. నిందితులు ప్రస్తుతం రిమాండులో వున్నందున అవసరం అయితే వీరిని కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఈడీ భావిస్తోంది.

**హెచ్‌సిఎ పెద్దలను పది రోజుల కస్టడీ కోరుతూ సిఐడి పిటిషన్**

ఇదిలావుండగా నిధుల గోల్‌మాల్ కేసులో అరెస్టయిన హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుతో పాటు కోశాధికారి శ్రీనివాసరావు, సీఈఓ సునీ ల్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్ యాదవ్, అధ్యక్షురాలు కవితలను పది రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని సిఐడి అధికారులు శుక్ర వారం నాడు మల్కాజిగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఐదుగురిని గురువారం నాడు రిమాండుకు తరలించడం తెలిసిందే. ఇందులో కవి తను చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించగా మిగతా నలుగురు చర్లపల్లి జైల్లో వున్నారు. సిఐడి అధికారుల పిటిషన్‌పై మల్కాజిగిరి కోర్టు శనివా రం నాడు విచారించనుంది. ఈ కేసులో పరారీలో వున్న మరో నిందితుడు హెచ్‌సిఎ జాయింట్ సెక్రటరీ దేవరాజ్ కోసం సిఐడి అధికారులు గాలిస్తున్నారు.

# సర్కారు దవాఖానాలు

>> ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణానికి, నూతనంగా నిర్మించే ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన మంత్రులు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ సమీపంలో 26 ఎకరాల్లో రూ.180 కోట్లతో ఖర్చుతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవనాల ప్రారంభోత్సవంతో పాటు, 235 కోట్ల రూపాయలతో 550 పడకల సామర్థ్యంతో అధునాతన వసతులతో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ శంకుస్థాపన పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ ఆసుపత్రులు మెడికల్ కళాశాలకు అవసరమైన అన్ని మౌళిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగానే అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించడంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీలో నిమ్స్, ఉస్మానియా స్థాయి వసతులు ఉండాలి, కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రులను తీర్చిదిద్దే ప్రయత్నం, ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేంద్రం, జిల్లాకు ఓ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనని తెలిపారు. తెలంగాణ 4 ప్రధాన నగరాల్లో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలకు అవసరమైన సదుపాయాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను, ఎక్విమెంట్స్ ఏర్పాటు చేయలేదని, రానున్న సంవత్సరం రోజుల్లో రాష్ట్రంలో ఉన్న అన్ని వైద్య కళాశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని మంత్రి తెలిపారు. వైద్యులకు, వైద్య రంగానికి ఏ సమస్య ఉన్నా నేను సహకరిస్తా, క్వార్టర్లు, హాస్టళ్లు, డిజిటల్ తరగతులు కల్పించేందుకు చర్యలు, ఉపకార వేతనాలు మంజూరు చేస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అత్యంత ప్రామాణికమైన, అత్యున్నతమైనదని అందుకు అనుగుణంగా వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**వైద్యులను దేవుడిగా భావించే నమ్మకాన్ని నిలబెట్టాలి:మంత్రి జూపల్లి**

వైద్యులను ప్రజలు దేవుడితో పోలుస్తారని, ఆ విధమైన నమ్మకాన్ని ప్రజలకు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు 50 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ విద్యార్థుల రవాణా సదుపాయానికి ఎలక్ట్రానిక్ బస్సును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. జూనియర్ వైద్యులు తమ సొంత గ్రామాలను మరువకూడదని, గ్రామీణ స్థాయి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కృత నిశ్చయంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు.

**ప్రజల అవసరాలకు పరితపించే నవ యువ ఎమ్మెల్యే: మంత్రి కోమటిరెడ్డి**

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే యువకుడు అని ప్రజల అవసరాలకు పరితపించే వ్యక్తి అని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు అవసరమైన ఏర్పాట్లను తన చారిటీ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నాగర్ కర్నూల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 235 కోట్ల రూపాయలతో ఆసుపత్రిని నిర్మించడం నాగర్ కర్నూల్ ప్రజలు అదృష్టవంతులని మంత్రి చెప్పారు. వనపర్తి-జడ్చర్ల రోడ్డు, మహబూబ్‌గర్-మన్ననూరు రోడ్డును విస్తీర్ణపర్చేందుకు 140 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

# 14న భూమిపైకి శుభాంశు శుక్లా

>>శుభాంశు టీమ్ అనేక ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోడీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటించింది. ఐఎస్ఎస్‌లో ఉంటూ ఇస్రో తరఫున ఏడు ప్రయోగాలు నిర్వహించింది శుభాంశు శుక్లా టీమ్. దీర్ఘకాల రోదసి యాత్రల సమయంలో పోషకాహారం, జీవనాధార వ్యవస్థల విషయంలో ముందడుగు వేయడానికి శుభాంశ్ వర్క్ ఉపయోగపడుతుంది. రోదసీలో ఎముకలు, కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావాన్ని అధ్యయనం చేశారు. దీంతో మున్ముందు ఐఎస్ఎస్‌లో వ్యోమగాముల మనుగడ సరళతరం కానుంది. నాసా నిర్వహించే ఐదు ఉమ్మడి అధ్యయనాల్లోనూ శుభాంశు పాల్గొన్నారు. మొత్తం మీద యాక్సియం4 వ్యోమగాములు 31 దేశాలకు చెందిన 60 శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించారు. ఐఎస్ఎస్‌లో ఒకే మిషన్‌లో ఇన్ని ప్రయోగాలు చేయడం ఒక రికార్డ్. భారత్ గగన్‌యాన్‌కు సైతం శుభాంశు మిషన్ ఉపయోగపడుతుంది. మధుమేహ నిర్వహణ, మెరుగైనక్యాన్సర్‌చికిత్సలు, మానవఆరోగ్యం పర్యవేక్షణపురోగతికి ఈపరిశోధనలు కీలకంగా మారనున్నాయి.

# పవర్ షేరింగ్ మాకెందుకు?

>> దదని ప్రభుత్వ విధానమని ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డ్ ఆధారంగానే కుటుంబంలో రుణమాఫీ జరుగుతుందని చెప్పారు.

**రోహిత్ వేముల ఆత్మహత్యకు రామచందర్ రావే కారణం: భట్టి ఫైర్**

తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సియు పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బిజెపి అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు.
రోహిత్ వేముల మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా పదవులు ఇస్తున్న బిజెపి.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని.. న్యాయశాఖ దీనిపై పనిచేస్తోందని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, ఎబివిపి నాయకుడు సుశీల్ కుమార్‌కు ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, రామచందర్ రావుకు తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. 2016లో యూనివర్శిటీ యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా యూనివర్శిటీ వద్ద రామచందర్‌రావు ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితులు భయపడేలా బిజెపి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులు, ఆదివాసీలకు దేశంలో గౌరవం లేకుండా బిజెపి ప్రవర్తిస్తోందని విమర్శించారు. దేశంలో దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి బిజెపి పదవులు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
బిజెపి వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమన్నారు ఉపముఖ్యమంత్రి. దేశంలో వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న ప్రతీ పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అలాగే రోహిత్ వేముల చనిపోతే కనీసం ఆ కుటుంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని వ్యాఖ్యలు చేశారు. ఏ రోజు కూడా యూనివర్శిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని భట్టి విక్రమార్క దుయ్యబట్టారు.

# అన్ని డాక్యుమెంట్లు ఇచ్చాం

>> రంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఆరు సార్లు క్యాబినెట్ నిర్ణయాలు జరిగాయి. ఆరు సార్లు క్యాబినెట్ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు కమిషన్‌కు అందించాం. అంతే కాదు మూడు సార్లు శాసన సభ ఆమోదం కూడా పొందింది. ఎప్పుడెప్పుడు జరిగాయి, జరిగిన చర్చ, ఇతర అంశాలను కమిషన్‌కు అందించాం. లెజిస్లేచర్ అప్రూవల్ క్యాబినెట్ కంటే కూడా ఉత్తమం అయినటువంటిది. ఆరు సార్లు క్యాబినెట్ అప్రూవల్ వివరాలను, మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం, చర్చ వివరాలను కమిషన్‌కు డాక్యుమెంట్లతో సహా అందించామని హరీశ్‌రావు తెలిపారు. కమిషన్ ఆన్ గోయింగ్ కనుక ఆ వివరాలు బయట పెట్టలేను. సందర్భం వచ్చినప్పుడు పూర్తిగా ఆ వివరాలు బయట పెడతాం.
ఇంతకు మించిన వివరాలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం మాకు అడిగినా ఇవ్వడం లేదు. ప్రజా భవన్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు 50 యేళ్లుగా చేసిన మోసాలకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తాత్కాలిక నీటి వినియోగం, నీటి పంపకానికి తేడా తెల్వకుండా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు. నీటి వినియోగం కెఆర్ఎంబి చేస్తుంది, నీటి పంపకం ట్రిబ్యునల్ చేస్తుంది. నీటి వినియోగం ఆ ఏడాదికి మాత్రమే పరిమితం, నీటి పంపకం శాశ్వతమైంది. శాశ్వతంగా పంపిణీకి సంతకాలు పెట్టామని చెప్పడం పచ్చి అబద్ధం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉమ్మడి ఎపిలో నాటి కాంగ్రెస్ పాలకులు ఇదే జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వంటి చేతగాని నాయకుల వల్ల, పెదవులు మూసుకోవడం వల్ల 299 మనకు కేటాయించడం జరిగింది. ఆనాడు కిరణ్ కుమార్ రెడ్డి శాసన సభలో ప్రవేశపెట్టారు, అది శాసన సభ రికార్డుల్లో కూడా ఉంది. ఆనాటి కాంగ్రెస్ జస్టిస్ శ్రీకృష్ణ కమిటికి ఇచ్చిన నివేదికలోనూ గోదావరిలో 968, కృష్ణాలో 299 టిఎంసిలు కేటాయించిన విషయం చెప్పారు. గోదావరిలో 968 టిఎంసిలు ఇచ్చింది కాంగ్రెస్ అని గొప్పలు చెబుతున్న రేవంత్ రెడ్డి, కృష్ణాలో 299 ఇచ్చి అన్యాయం చేసిన విషయం ఎందుకు దాచి పెడుతున్నావు. నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా కృష్ణా నదిలో పున: పంపిణీ చేయాలని ఎందుకు అడిగారు. రాష్ట్రం ఏర్పడిన 42వ రోజునే ఢిల్లీలో సెక్షన్ 3 కింద నీళ్ళు పంపిణీ చేయండి, 299 ఇచ్చి అన్యాయం చేసారు, 68శాతం నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా నీటి వాటా ఇవ్వాలని కేసీఆర్ అడిగారు. సెక్షన్ 3 కోసం కేసీఆర్ ఉమా భారతిని కలిసారు, నితిన్ గడ్కరి, షెకావత్ , ప్రధానిని కలిసారు. సుప్రీం కోర్టు గడప తొక్కి, నిర్విరామ పోరాటం చేసి సెక్షన్ 3 సాధించింది కెసిఆర్ అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

12-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
విదియ రా.1.45
ఉత్తరాషాఢ ఉ.6.35
వర్జ్యం : ఉ.10.38-12.15
దు.తె.5.42-7.22
శుభసమయం:ఉ.5.20-6.00, సా.6.30-7.10
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగులు ప్రమోషన్లు పొందుతారు. కళారంగాలవారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**వృషభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారు విదేశీ పర్యటనలు పొందుతారు. సోదరుల నుండి శుభవార్తలు వింటారు.

**మిథునం:** కొత్తమిత్రులు పరియమై సాయం అందిస్తారు. ఆరోగ్యంపట్ల చాలా జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుతుంది. కాంట్రాక్టులు చివరిలో దక్కించుకొంటారు.

**సింహం:** ఇంటిలో కొంత సౌఖ్యం, సంతోషం కలుగుతాయి. శక్తి సామర్థ్యాలకు, ప్రతిభా పాటవాలకు తగిన గుర్తింపు పొందుతారు.

**కన్య :** ఆర్థికంగా చికాకులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తిచేస్తారు.

**తుల :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. రుణవత్తిడులు పెరిగి చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** కుటుంబంలో ఏర్పడిన చిక్కులు తొలగిపోతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** ఆకస్మికంగా డబ్బు చేతి కందుతుంది. జీవితభాగస్వామి సలహాతో గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** ఓర్పు, పట్టుదలతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించు కోగలరు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఉద్యోగా లలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**మీనం :** అరుదైన ఆహ్వానాలు అందుతాయి. జీవిత భాగస్వామ్య నుండి ఆస్తి లాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే

>> దన్నారు. శుక్రవారం గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన రాజ్య భాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తో పాటు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశ ఐక్యతలో రాజ్యభాష హిందీ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. దేశ సమైక్యతలో భాగంగా ఒక బెంగాలీ గీతం జాతీయ గీతం అయ్యింది, ఒక పంజాబీ భగత్ సింగ్ దేశం కోసం పోరాడే విప్లవకారుడు అయ్యాడు, రాజస్థాన్‌కు చెందిన రాణాప్రతాప్ శౌర్యానికి చిహ్నం అయ్యారు. తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అయ్యారు. మద్రాస్ ప్రెసిడెన్సీ, ద్రవిడ ప్రాంతంలో ఉన్న ఒకరు చేసిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రతీ భాషా జీవ భాష, మాతృ భాష.. కానీ రాజ్య భాష మాత్రం హిందీ అని ఆయన స్పష్టం చేశారు. మనం ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృ భాష ఉంది. కానీ మన ఇంటి సరిహద్దులు దాటితే మన రాజ్య భాష హిందీ ఉందన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు దేశంలోని ఇతరత్రా అన్ని భాషల పౌరులకు మాతృ భాష మీద గౌరవం ఉంటుందని అన్నారు. విద్యా, వైద్యం, వ్యాపారం, ఉపాధి కోసం అన్ని భాషలు, మాండలికాలు అవధులను దాటుకుంటూ వెళ్లిపోతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో హిందీ వద్దు అనుకోవడం, వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేసినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోయినట్లు కాదని, మనం మరింత బలపడటం అన్నారు. ఇంకొక భాషని అంగీకరించడం అంటే మనం ఓడిపోవడం కాదు, కలిసి ప్రయాణం చెయ్యడం అని తెలిపారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్లనే ఐటీ రంగంలో ముందున్నామని, అలాంటిది దేశం మొత్తం మీద ఎక్కువ శాతం జనాభా మాట్లాడే హిందీ భాష నేర్చుకోవడం వల్ల ప్రయోజనమే కానీ నష్టం ఉండదన్నారు. సౌత్ ఇండియన్ సినిమాలలో 31 శాతం సినిమాలు హిందీలో డబ్ అయ్యి ఆదాయం పొందుతున్నాయని, ఇలా వ్యాపారాలకు హిందీ కావాలి, నేర్చుకోవడానికి మాత్రం హిందీతో ఇబ్బందేంటి అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు.

**భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటేననడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో హిందీ, ఇతర భారతీయ భాషల ద్వారా ప్రజలతో సమన్వయం చేసుకుంటూ వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు మనమంతా కలిసి ప్రయత్నించాలన్నారు. మన దేశంలోని ప్రజలందరిని తమ తమ మాతృభాషల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధానించడం చాలా అవసరమన్నారు. అప్పుడే ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని తెలిపారు. జాతీయభాషా విభాగం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ స్వర్ణ జయంతి వేడుకల్లో భాగంగా మొదటి కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించగా, రెండో కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఏ సంస్థకైనా 50 ఏళ్ల ప్రయాణం చాలా ప్రత్యేకమైనదని, ఈ 50 ఏళ్లలో సాధించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకోవడం, సంబరాలు చేసుకోవడం ఒక ఎత్తయితే, భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకోవడం మరో కీలకమైన అంశమని అన్నారు. మాతృభాష స్థానాన్ని ఎలాంటి ఇతర భాషా తీసుకోలేదని మహాత్మాగాంధీ, హిందీభాషాభివృద్ధి అవసరమని మహర్షి దయానంద సరస్వతి, భౌతికశాస్త్రాన్ని మాతృభాషలో నేర్పాలని ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్, తాను శాస్త్రవేత్తగా ఎదిగేందుకు కారణం మాతృభాషలో విద్యాబోధనే అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పడం, మాతృభాషలో విద్యను ప్రోత్సహించాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పడం ఇవన్నీ ప్రాంతీయభాషలకు గౌరవాన్ని ఇస్తూనే.. ఒక జాతీయ భాష ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతున్నాయన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించి మన భాషకు అంతర్జాతీయ తీసుకొచ్చారని, మన దేశంలో అనేక భిన్న భాషలు ఉన్నప్పటికీ, అందులోని భావన మాత్రం ఒకటేనని, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో వందేమాతరం, భారత మాతాకీ జై నినాదాలు దేశమంతా ప్రతిధ్వనించాయన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం 11 భారతీయ భాషలకు ప్రాచీన భాష హోదాను కల్పించిందన్నారు. ఈ భాషలన్నింటికీ కనీసం 1500 -2000 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. 2020లో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానంలోనూ ప్రాంతీయ భాషలకు పెద్దపీట వేసిందని, ప్రధానమంత్రి మోడీ కూడా విదేశీ పర్యటనల్లో హిందీలోనే మాట్లాడటం, వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నప్పుడు అక్కడి భాషలో మాట్లాడటం ఇవన్నీ భారతీయ భాషల గౌరవాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయాలే అని తెలిపారు. ఈ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా మన మాతృభాషల్లో మాట్లాడటం, మన దేశ భాషలను గౌరవించుకోవడం చాలా అవసరమని అన్నారు.

# ప్రభుత్వ నిర్ణయంపైనే ఫీజుల పెంపు

>> ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టిఎఎఫ్ఆర్‌సి తీరుపై విచారణ సందర్భంగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏటా కాలేజీలు ఫీజుల పెంపునకు ప్రతిపాదనలు చేయడం, కౌన్సెలింగ్ పూర్తయి అడ్మిషన్‌లు చేపట్టేదాకా దానిపై టిఎఎఫ్ఆర్‌సి సిఫారసులు చేయకపోవడం, కాలేజీలు కోర్టును ఆశ్రయించడం అన్నది ప్రతి ఏటా కొనసాగుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో గత బ్లాక్ పీరియడ్ ఫీజులే ఈ విద్యాసంవత్సరానికి వర్తిస్తాయంటూ జారీ చేసిన జిఓఎంఎస్ నంబర్ 26ను సవాల్ చేస్తూ గురునానక్, గోకరాజు రంగరాజు కాలేజీలతో పాటు సుమారు 11 కళాశాలలు గురువారం లంచ్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె లక్ష్మణ్ విచారణ చేపట్టి.. ప్రతి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి, పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదన్నారు. డిసెంబరులో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. 15 మంది సభ్యులదాకా ఉన్న కమిటీ నిర్ణయంలో జాప్యమెందుకని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. టిఎఎఫ్ఆర్‌సిపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని, కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్‌లు వేయడం ఏంటని కాలేజీలను న్యాయమూర్తి ప్రశ్నించారు.
కళాశాలల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. గత డిసెంబరులో ప్రతిపాదనలు సమర్పించామని.. మార్చిలో కమిటీ సమావేశమైందని తెలిపారు. అందులో తమ ప్రతిపాదనలు ఆమోదించిందని, దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే నిదర్శనమని పేర్కొన్నారు. టిఎఎఫ్ఆర్‌సి తరపున సీనియర్ న్యాయవాది పి శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ .. కాలేజీలు 5000 పేజీలతో ప్రతిపాదనలు సమర్పించాయని .. వాటిని పరిశీలించడానికి సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే గత బ్లాక్ పీరియడ్‌లో వసూలు చేసిన ఫీజునే ఈ ఏడాదికి సిఫారసు చేసిందని కోర్టుకి తెలిపారు. ప్రభుత్వం తరఫున రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం ఫీజు పెంపును అడుగుతున్నాయని అన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



## హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతున్న వరద ఉధృతి

### 91కి పెరిగిన మృతుల సంఖ్య

**సిమ్లా, జూలై 11:** హిమాలయ రాష్ట్రంలో వరద ఉధృతి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించినవారి సంఖ్య 91కి చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం, మెరుపువరదలు, కుంభవృష్టితోపరిస్థితి దారుణంగా ఉంది. వరద ఉధృతి కారణంగా కొట్టుకుపోయిన మృతదేహాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వరదనీటిలో కొట్టుకుపోయిన మృతదేహాలు రహదారులపై పదులసంఖ్యలోపడి ఉన్నాయని అధికారులు తెలిపారు. హిమాచల్‌లోని పంగ్లుయెడ్‌గ్రామంలో ఇటీవల రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారిలోనలుగురి మృతదేహాలు సుమారు 150 కిలోమీటర్లదూరంలో ఉన్న జ్వాలాపూర్‌లో లభించగా మరో ఐదుగురి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో గాలింపుచర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలు చాలాదూరం కొట్టుకుపోతుండటంతో వాటిని గుర్తించి వారికుటుంబాలకు అప్పగించడం కూడా సవాలుగా మారిందని అధికారులు తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లోభారీ వర్షాలు వరదల కారణంగా ఇప్పటివరకూ 91 మంది మరణించగా 34 మంది గల్లంతయినట్లు అధికారులు పేర్కొన్నారు. సుమారు 130మంది క్షతగాత్రులు ఆసుపత్రుల్లోనే ఉన్నారు. వరదలకారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 207 రోడ్డుమార్గాలను మూసివేసారని, పలుప్రాంతాల్లో చీకట్లు అలుముకున్నాయని తెలిపారు. వందలసంఖ్యలోప్రజలు నిరాశ్రయులయ్యారు. వరదప్రభావితప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ రాష్ట్రవిపత్తు ప్రతిస్పందన బృందాలు, బోర్డర్‌రోడ్స్ ఆర్గనైజేషన్ దళాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్‌కొనసాగుతోంది. అనేకచోట్ల కొండచరియలు విరిగిపడేప్రమాదం ఉండటంతో బలహీనపడిన ఇళ్లలోను, కట్టడాల్లోను ఎవ్వరూ ఉండవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు.

## ముగిసిన ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్

### వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ.. 95,256 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు

### రేపు మాక్ సీట్ కేటాయింపు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 94,059 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. మంగళవారంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగియగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ముగిసే నాటికి 95,256 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరైనట్టు అధికారులు ప్రకటించారు. సోమవారం (ఈనెల 7)తోనే స్లాట్‌బుక్ చేసుకునే గడువు ముగియడంతో.. గడువు లోపుగా 97,533 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి రేపు(ఆదివారం) మాక్ సీట్ అలకేషన్ చేయనున్నారు.

జూన్ 28 నుంచే ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగింది. కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టగా... రేపు (ఆదివారం-జులై 13న) మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదిల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయ నున్నారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

### 108 కిలోల గంజాయి స్వాధీనం

### వివరాలు వెల్లడించిన డిసిపి శ్రీనివాస్




స్వాధీనం చేసుకున్న 108 కిలోల గంజాయి ప్యాకెట్ల దృశ్యం

**హైదరాబాద్ (అత్తాపూర్) జూలై 11, ప్రభాతవార్త :** అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా గుట్టును రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్ఓటి పోలీసులు రట్టు చేశారు. ఓఆర్ఆర్‌పై ముఠా ప్రయాణిస్తున్న కార్లను తనిఖీ చేసి భారీ ఎత్తున్న గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో డిసిపి సిహెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం నుండి పుణెకు హైదరబాద్ మీదగా గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో అప్రమత్తమైన ఎస్ఓటి పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా ఒఆర్ఆర్‌పై చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీ మొదలుపెట్టారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో రెండు కార్లు రాగ వాటిన్ని తనిఖీ చేయగా భారీ ఎత్తున్న గంజాయి లభించినట్లు తెలిపారు. 108 కిలోల 797 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితులు ఎ1 ప్రశాంత్ గణేష్, ఎ2 లతా గణేష్ జాదవ్, ఎ3 సచిన్ దిలిప్ రణవారే, ఎ4 రోహన్ పాండురంగ్ పవార్, ఎ5 రాహుల్ బాబు రావు ధవ్రే, ఎ6 గౌరవ్ నటేకర్, ఎ7 పవన్ దీప్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారు అని అయితే గంజాయి డిల్లర్ పవన్ దీప్ ,జీవన్ వద్ద ఒరిస్సాలో కిలో గంజాయి రూ. 2500 కొనుగోలు చేసి పుణేలో రూ. 25000లకు అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నట్లు విచారణలో తెలిందని వెల్లడించారు. గంజాయి తరలిస్తున్న నిందితులు ఇప్పటికే పలు కేసులో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితుల నుండి 108కిలోల 797 గ్రామాల గంజాయితోపాటు ఆరు సెల్‌ఫోన్‌లు, రూ. 9700లు, స్విఫ్ట్ కారు, ఇగ్నిస్ కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**మాదకద్రవ్యాలపై అనుమానం ఉంటే సమాచారం ఇవ్వాలి : డిసిపి సిహెచ్ శ్రీనివాస్**

అసాంఘిక వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మాదకద్రవ్యాలు అమ్ముతున్నట్లు కాని ఎవ్వరైన సేవిస్తున్నట్లు కాని అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని డిసిపి సిహెచ్ శ్రీనివాస్ సూచించారు. టోల్ ఫ్రి నెంబర్ 1908 లేదా 871267111కు కాల్ చేయాలని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి రహిత రాష్ట్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 11 యేళ్లలో 17 పార్లమెంట్లలో ప్రధాని ప్రసంగాలు!

### సరికొత్త రికార్డు సృష్టించిన మోడీ

**న్యూఢిల్లీ, జూలై 11:** ప్రధాని నరేంద్ర మోడీ నమీబియా పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం ఓ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించింది. నమీబియా పార్లమెంట్‌లో మోదీ చేసిన ప్రసంగం గత 11 యేళ్లలో ప్రధాని హోదాలో 17వది కావడం విశేషం. ఇది స్వతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన మంత్రులు చేసిన ప్రసంగాలతో సమానం కావడం గమనార్హం. ఈ నెల మొదటి వారంలో ఐదు దేశాల పర్యటన సందర్భంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, నమీబియా పార్లమెంట్‌లో ఇచ్చిన తాజా ప్రసంగాలతో మోడీఈ ఘనతను సాధించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విదేశీ పార్లమెంట్‌లలో అత్యధికంగా ఏడుసార్లు ప్రసంగించారు. ఆయన తర్వాత ఇందిరా గాంధీ నాలుగుసార్లు విదేశీ పార్లమెంట్లను ఉద్దేశించి ప్రసంగించారు. అదే సమయంలో నెహ్రూ మూడుసార్లు, రాజీవ్ గాంధీ రెండుసార్లు, పీవీ నరసింహారావు ఒకసారి ప్రసంగిం చారు. 42014లో ప్రధాని ఆస్ట్రేలియా, ఫిజి, భూటాన్, నేపాల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. 2015లో బ్రిటన్, శ్రీలంక, మంగోలియా, అఫ్గానిస్థాన్, మారిషస్ పార్లమెంట్‌లో మట్లాడారు. అమెరికా హౌస్‌లో మోడీరెండుసార్లు ప్రసంగించారు.

మొదటిసారి 2016లో, రెండోసారి 2023లో ప్రసంగించారు. 2018లో ఉగాండాలో 2019లో మాల్దీవులు, 2024లో గయానా పార్లమెంట్‌లలో ప్రధానిమోడీ ఉపన్యసించారు. మోదీ 17సార్లు విదేశీ పార్లమెంట్లలో ప్రసంగించిన విషయాన్ని బీజేపీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. తక్కువ కాలంలోనే విదేశీ



పార్లమెంట్లలో 17 ప్రసంగాలు చేశారు. గత ప్రధానులందరూ కలిసి చేసిన ప్రసంగాన్ని మోడీ సమం చేశారు. ఆయన నాయకత్వానికి గ్లోబల్ స్థాయిలో గౌరవం దక్కుతోంది అని బీజేపీ ట్వీట్ చేసింది. భారత్ ఆఫ్రికా సంబంధాలపై నమీబియా పార్లమెంట్‌లో మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము ఆఫ్రికాతో సహకారాన్ని కోరుకుంటున్నామన్నారు. కలసి ఎదగాలన్నదే తమ లక్ష్యమని మోడీ చెప్పారు. తమ భాగస్వామ్యం విలువ ఇప్పటికే 12 బిలియన్ డాలర్లు దాటిందన్నారు. జీ20లో తన అధ్యక్షత కాలంలో ఆఫ్రికా యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. అలాగే, కరోనా సమయంలో వ్యాక్సిన్లు, ఔషధాలు అందించినందున ఆఫ్రికా దేశాలు భారతావనికి కృతజ్ఞత చూపిస్తున్నాయని చెప్పారు. ఆరోగ్య మైత్రీ కార్యక్రమం ద్వారా ఆసుపత్రులు, మెడికల్ కిట్‌లు, శిక్షణ కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ యాత్రతో మోడీ తన ఐదు దేశాల పర్యటనను విజయవంతంగా పూర్తిచేసి భారత్‌కు తిరిగిచేరుకున్నారు.

## 23 నుంచి పిఇసెట్-2025 కౌన్సెలింగ్

### 14న నోటిఫికేషన్ జారీ

### ఆగస్టు 4న సీట్ల కేటాయింపు

### ఆగస్టు 11 నుంచి క్లాసులు ప్రారంభం

### అడ్మిషన్ల కన్వీనర్ పాండురంగారెడ్డి

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిపిఈడి, డిపిఈడి కాలేజీల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్(పిఈ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పిఈ సెట్-2025 కౌన్సెలింగ్ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 14న జారీ చేయనున్నారు. ఎడ్ సెట్, పిఈ సెట్‌ల అడ్మిషన్ల కమిటీ సమావేశం శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాల కిష్టా రెడ్డి, వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డితోపాటు అడ్మిషన్ల కమిటీ సభ్యులు హాజరయ్యారు.

**పిఇ సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు..**

పిఇ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 14న నోటిఫికేషన్‌ను జారీ చేయ నున్నారు. అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి 23 నుంచి 29 వరకు అవకాశం కల్పిం చారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 25, 26 తేదిల్లో నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌కి అర్హుల వారి జాబితాను 30న ప్రకటిస్తారు. ఈ నెల 31, ఆగస్టు 1 తేదీల్లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 2న వెబ్‌ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. మొదటివిడత సీట్ల కేటాయింపు ఆగస్టు 4న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఆగస్టు 5 నుంచి 8 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. 11 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

## ఆర్ఎస్ఎస్, బిజెపిలో '75' యేళ్ల దుమారం

### భగవత్, మోడీలకు నిండనున్న వయోపరిమితి

**న్యూఢిల్లీ, జూలై 11:** రాజకీయ నాయకులు ఎవరైనా సరే 75 ఏళ్లు నిండగానే రిటైర్మెంట్ తీసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. మోదీకి ఈ ఏడాది 75 ఏళ్లు నిండనున్నాయి. కనుక మోదీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ, రిటైర్మెంట్‌పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. 75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే, మనం ఒక నిర్దిష్ట వయస్సుకు



చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం కాస్త పక్కకు జరిగి, వేరే వాళ్ల పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి అని పింగ్లే చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఇది కాస్తా రాజకీయ దుమారానికి కారణమైంది. ఈ ఏడాది (2025) సెప్టెంబరుతో ప్రధాని నరేంద్ర మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే మోహన్ భగవత్ రిటైర్మెంట్ ప్రస్తావన చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తవుతాయనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ గుర్తుచేస్తున్నారు. అలాగే భగవత్‌కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అందులో 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ సందర్శించిన సంగతి తెలిసిందే. అప్పుడే మోదీ రిటైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ స్పందిస్తూ పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి రాలేదు. అయితే దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని భావిస్తోందని ఆనాడు సంజయ్‌రౌత్ వ్యాఖ్యానించారు. అయితే రౌత్ వ్యాఖ్యలను బీజేపీ కొట్టిపారేసింది. కానీ తాజా భగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

## మహిళా స్వయం సహాయక కేంద్రాలకు రూ.344 కోట్లు వడ్డీలేని రుణాలు విడుదల

### నేటి నుంచే అక్కౌంట్లలో జమ: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** మహిళా స్వయం సహాయక సంఘాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శుభవార్త చెప్పింది. ప్రభుత్వం చెప్పిన మేరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది. ఈ మేరకు సెర్ప్‌కు ఆర్థిక శాఖ శుక్రవారం నిధులు విడుదల చేసింది. దీనిలో రూ.300 కోట్లు గ్రామీణ మహిళ సంఘాలకు, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు కేటాయించింది. శనివారం నుంచి ఈ నెల 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ జమ అవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు చెక్కులు పంపిణీ చేస్తారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాద బీమా, లోన్ బీమా చెక్కులు సైతం ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారని వివరించారు. బిఆర్ఎస్ హయంలో వడ్డీలేని రుణాలు నిలిచిపోయాయని తెలిపారు. రూ.3000 కోట్లకు పైగా బిఆర్ఎస్ సర్కార్ బకాయిలు పెట్టిందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సకాలంలో వడ్డీలేని రుణాల చెల్లింపు జరుగుతోందని తెలిపారు. దీంతో మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాల్లో అనూహ్య వృద్ధి జరుగుతుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

## కల్తీ కల్లు బాధితుల చికిత్సపై వైద్య మంత్రి ఆరా

### నిమ్స్, గాంధీ హాస్పిటల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి దామోదర

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** కల్తీ కల్లు తాగి నిమ్స్, గాంధీ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆరా తీశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి.. నిమ్స్, గాంధీ డాక్టర్లు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పేషెంట్ల కండీషన్‌ను డాక్టర్లు మంత్రికి వివరించారు.

ప్రస్తుతం నిమ్స్‌లో 35 మంది, గాంధీలో 18 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి తెలిపారు. నిమ్స్‌లో ఉన్న 35 మందిలో ఐదుగురిని శుక్రవారమే డిశ్చార్జ్ చేస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన 30 మందికి చికిత్స కొనసాగిస్తున్నామని తెలిపారు. గాంధీలో ఉన్న 18 మందిలో నలుగురు డయాలసిస్‌పై ఉన్నారని.. మిగిలిన 14 మంది పేషెంట్ల కండిషన్ స్టేబుల్‌గా ఉందని వైద్యులు మంత్రికి వివరించారు. పేషెంట్లందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు, డాక్టర్లకు మంత్రి సూచించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకూ హాస్పిటల్స్ లోనే ఉంచాలని, ఆ తర్వాతే డిశ్చార్జ్ చేయాలని మంత్రి వైద్యాధికారులను ఆదేశించారు.


## కల్తీ కల్లు ఘటనలో 9కి పెరిగిన మృతులు

### బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ సస్పెన్షన్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై తెలంగాణ సర్కార్ సీరియస్ అయింది. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సంబంధిత శాఖ అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగా బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్ సస్పెన్షన్ మరో నలుగురు అధికారుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో కూకట్‌పల్లి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మొత్తం బాధితుల సంఖ్య 51 కాగా.. గాంధీ ఆస్పత్రిలో 14మంది బాధితులకు చికిత్స కొనసాగుతోంది. అలాగే నిమ్స్‌లో 34 మంది కల్తీ కల్లు బాధితులకు చికిత్స అందిస్తున్నారు. నిమ్స్‌లో ఆరుగురికి వైద్యులు డయాలసిస్ చేస్తున్నారు. ఈఎస్ఐలో ఒకరు, ప్రైవేట్ ఆస్పత్రిలో మరొకరికి చికిత్స కొనసాగుతోంది. కాగా, గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గంగారాం(70) అనే వ్యక్తి మృతిచెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. అయితే, కల్తీ కల్లు ఘటనలో తెలంగాణ సర్కార్ సీరియస్ అయింది. ఈ మేరకు పోలీసులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో కూకట్‌పల్లి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు ఉన్నారు. మరోవైపు బాలానగర్ ఎక్సైజ్ పీఎస్‌లో ఐదు కేసులు నమోదు చేశారు. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి పీఎస్‌లలో మూడు కేసులు నమోదయ్యాయి. కాగా ఐదు కల్లు కాంపౌండ్‌ల నుంచి అధికారులు శాంపిల్స్ సేకరించారు. వాటిని నారాయణగూడ ఎక్సైజ్ ల్యాబ్‌కు అధికారులు పంపించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి బాధితులను పరామర్శించారు. ఎప్పటికప్పుడు అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, తమకు వెంటనే సమాచారం అందజేయాలని ఆదేశించారు.

**బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్ సస్పెన్షన్**

కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు ప్రారంభించింది. శుక్రవారం బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ వేణుకుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఈ మేరకు ఉత్తర్వుల జారీ చేసింది. మరో నలుగురు అధికారులు పాత్రపైనా దర్యాప్తు చేస్తోంది. మొత్తం ఐదు బృందాలుగా ఏర్పడి హైదర్‌నగర్, హెచ్‌ఎంటీ కాలనీ, సర్దార్ పటేల్‌నగర్, భాగ్యనగర్ ప్రాంతాల్లో కల్లుకంపౌండ్ నుంచి ఇప్పటికే శాంపిల్స్ సేకరించారు. పలుదుకాణాల్లో మత్తు మందుల కలయికతో కల్లుతయారీ జరిగినట్లు తేలింది. నివేదిక ఆధారంగా నల్గురుకల్లు వ్యాపారులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కల్లు దుకాణాల లైసెన్సులు రద్దు చేశారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య ఇప్పటికే 44కి చేరింది. ఈ ఘటనలో ఇంతవరకు నల్గురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నిమ్స్ లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో అద్దురు చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.



బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ వేణుకుమార్

## సనాతన ధర్మం కోసం పోరాడుతా

### రాజీనామా అమోదించడంపై స్పందించిన రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), జూలై 11, ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యుడు రాజాసింగ్ రాజీనామాను ఎట్టకేలకు బిజెపి హైకమాండ్ అమోదించారు. తన రాజీనామాను బిజెపి అమోదించడంపై ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ సరిగా 11 సంవత్సరాల క్రితం భారతీయ జనతాపార్టీ సభ్యత్వం తీసుకున్నా ప్రజలకు సేవ చేయడం దేశానికి సేవ చేయడం హిందూత్వాన్ని రక్షించడం కోసం నేను బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్న బిజెపి నన్ను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గోషామహల్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. నాపై నమ్మకం ఉంచినందుకు బిజెపి కేంద్ర పార్టీకి, పార్టీ నాయకులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. నా రాజీనామాను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను అమోదించారు. తెలంగాణలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే కలతో రాత్రింబళ్లు పని చేస్తున్న లక్షలాది మంది బిజెపి కార్యకర్తల బాధను అధిష్ఠానానికి తెలుపలేకపోయానన్నారు. నా నిర్ణయం ఏదైనా పదవి, అధికారం లేదా వ్యక్తిగతంగా తీసుకోలేదని స్పష్టం చేయాలనుకుంటున్నా, నేను హిందుత్వానికి సేవ చేయడానికి పుట్టాను చివరిశ్వాస వరకు హిందుత్వానికే పని చేస్తూనే ఉంటాను, హిందుత్వం జాతీయత సనాతన ధర్మాన్ని రక్షించడానికి నేను ఎల్లప్పుడు భక్తి నిజాయితీతో పని చేస్తా, సమాజ సేవ కోసం, హిందూ సమాజ హక్కుల కోసం నా చివరి శ్వాస వరకు నా గొంతుకను వినిపిస్తా అని రాజాసింగ్ ట్వీట్ చేశారు. భవిష్యత్తు కార్యచరణ ఎంటో వేచి చూడాల్సిందే.

## 21 నుంచి ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్

### 14న నోటిఫికేషన్ జారీ.. ఆగస్టు 9న సీట్ల కేటాయింపు

### ఆగస్టు 18 నుంచి క్లాసులు ప్రారంభం

### అడ్మిషన్ల కన్వీనర్ పాండురంగారెడ్డి

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 14న జారీ చేయనున్నారు. ఎడ్ సెట్, పీఈ సెట్‌ల అడ్మిషన్ల కమిటీ సమావేశం శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డితోపాటు కమిటీ సభ్యులు హాజరయ్యారు.

**ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు..**

ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 14న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి ఈ నెల 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌కి అర్హుల వారి జాబితాను ఆగస్టు 2న ప్రకటిస్తారు. ఆగస్టు 4, 5 తేదిల్లో వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. 6న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. మొదటి విడత సీట్ల కేటాయింపు ఆగస్టు 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 18 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

## అందరూ దొంగలే.. జగన్మోహన్‌రావును ఎలా హెచ్‌సిఎ అధ్యక్షుని చేశారు?

### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురవారెడ్డి

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాలపై చాలాకాలంగా పోరాడుతున్న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురవారెడ్డి మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ హెచ్‌సిఎలో అంద రు దొంగలేనని కుండబద్దలు కొట్టారు. ఫోర్జరీ పత్రాలతో కొత్తగా కొత్తగా ఒక క్లబ్‌ను ఏర్పాటు చేసుకుని, అందులో తాను సభ్యుడుగా చేరిన జగన్ మోహన్ రావు నిబంధనలకు విరుద్దంగా ఆరు నెలల కాలంలోనే హెచ్‌సిఎ అధ్యక్ష పదవికి ఎలా పోటీ చేస్తారని గురువా రెడ్డి ప్రశ్నించారు. హెచ్‌సిఎ అధ్యక్ష పదవికి జగన్‌మోహన్ రావును ఎన్నికల సంఘం అధికారి సంపత్ కుమార్ ఎలా పోటీకి అనుమతించారని ఆయన ప్రశ్నించారు. హెచ్‌సిఎలో అక్రమాలపై తాను మొదటి నుంచి పోరాడుతున్నా ఎవరూ స్పందించడం లేదని ఆయన ఆవేదన చెందారు. హెచ్‌సిఎలో ఎవరు అధ్యక్షుడుగా వున్న అవినీతి ఆగడం లేదని ఆయన తెలిపారు.

ఐపిఎల్ నిర్వహణ కోసం బిసిసిఐ ప్రతీ సంవత్సరం హెచ్‌సిఎకు వంద కోట్ల రూపాయలను ఇస్తుందని, ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని గురువారెడ్డి ఆరోపించారు. తప్పుడు పత్రాలతో క్లబ్‌ను సృష్టించిన జగన్ మోహన్ రావు విషయంలో సిఐడి కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఏకంగా మాజీ మంత్రి కృష్ణా యాదవ్ సంతకాన్ని ఆయన ఫోర్జరీ చేశారని, ఇది తీవ్రమైన నేర మని గురువారెడ్డి తెలిపారు. బిసిసిఐ ప్రతీయేటా హెచ్‌సిఎకు ఇస్తున్న గ్రాంట్లు ఆయా ప్రాంతాలలో క్రికెట్ అభివృద్ధికి, ఆటగాళ్లకు అలవెన్సులు, సౌ కర్యాలు కల్పించేందుకు వాడాల్సి వుండగా హెచ్‌సిఎ పెద్దలు మాత్రం అంతా స్వాహా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

జస్టిస్ నాగేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం హెచ్‌సిఎలో అందరిని విచారించాలని, గతంలో నేర చరిత్ర కలిగిన వారిని కూడా విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశా రు. హెచ్‌సిఎలో వున్న 217 మంది దొంగలేనని, వీరి వెనుక వున్న నేతల పేర్లు కూడా బయటకు రావాలని ఆయన కోరారు. హెచ్‌సిఎ తెలంగాణ అంతటికి పనిచేయాల్సి వుండగా కేవలం ఒక్క హైదరాబా ద్‌కే పరిమితం అయ్యిందని ఆయన అన్నారు. హెచ్‌సిఎ సరిగ్గా పనిచేసి వుంటే తెలంగాణ నుంచి ప్రతీయేటా ఒక క్రికెటర్ దేశానికి ప్రాతినిధ్యం వహించేవాడని ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
నగరపాలక సంస్థ కార్యాలయం : నిజాంపేట్, జిల్లా: మేడ్చల్ మల్కాజ్‌గిరి
ఆసక్తి వ్యక్తీకరణ (Expression of Interest)
Notice No.A1/206/2025-26/KNR, తేది: 10.07.2025
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, కమిషనర్, నగరపాలక సంస్థ నిజాంపేట వారు ఇట్టి మున్సిపల్ కార్పొరేషన్‌లో గల 1) కేసీఆర్ కాలనీ యందు గల కొలను నారాయణ రెడ్డి పార్క్‌ను మరియు 2) కేసీఆర్ కాలనీ యందు గల ప్రభుత్వ స్థలము నందు గల వాణిజ్య సముదాయములను లీజుకు ఇవ్వడము కొరకు "ఆసక్తి వ్యక్తీకరణ (EOI)" ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల వారు తేది: 17.07.2025. సాయంత్రం 5.00 గంటల లోపు EOI-RFP పొందుటకు దరఖాస్తు చేసుకోగలరు. దరఖాస్తు వెంట. 1. కమిషనర్ నగరపాలక సంస్థ నిజాంపేట్‌గారి పేరున రూ.5000/- డిడి. 2. వ్యక్తిగత వివరాలు/ఏజెన్సీ యొక్క వివరములు. 3. వ్యక్తిగత/ఏజెన్సీ యొక్క బ్యాంక్ ఖాతా వివరములు మొ.నవి జతపరచవలెను. ఇతర వివరములకు కార్యాలయ వేళలలో నగర పాలక సంస్థ నిజాంపేట్ నందు సంప్రదించగలరు.
సం/-. కమిషనర్, నగర పాలక సంస్థ, నిజాంపేట్.
DIPR.NO. 4884-PP/CL/ADVT/1/2025-26 తేది: 11.07.2025

వార్త

మన ప్రవర్తనలో ముందుగా మార్పువస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.

-షేక్స్పియర్

# ఔచిత్య పరీక్ష!

బీహారు వంటి బీమారు రాష్ట్రాలకు సమయోచిత వాగ్దానాలు చేయాలంటే ఏలినవారికి ఎన్నికలప్పుడే దయ కలుగుతుందని కొన్ని కొన్ని సందర్భాలు ఎరుకపరుస్తున్నాయి. బీహారులో ఇరవై ఏళ్ల తర్వాత తాజాగా ఉన్నట్టుండి నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో విస్తృత ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారంటే ఎన్నో రాజకీయ పార్టీలు, ఎన్నో వర్గాలు సందేహం వ్యక్తం చేశాయి. అనుమానాలు కలుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారం యధావిధిగా రాజకీయ పార్టీల వారు సుప్రీంకోర్టుకు తీసుకెళ్లగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి రాజ్యాంగ బద్ధ అధికారులున్నాయని తీర్పు చెప్పింది. కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవన్నీ రాజకీయ పక్షాల అభ్యంతరాల్లో ఉన్నవే. ఎక్కడ ఎలాంటి పేచీ వచ్చినాకానీ మూడో పక్షంగా న్యాయస్థానాలే న్యాయం చేస్తాయని నమ్మే దేశం మనది. రాజ్యాంగ అంశాల్లో మీమాంసలు కలిగినప్పుడు ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులు, పరిష్కారాలే శిరోధార్యం. ప్రత్యేక సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టే విషయంలో ఎన్నికల సంఘం దోషమేమీలేదని, అందుకే ఈ అంశంపై నిలుపుదల ఉత్తర్వుల (స్టే)ఇవ్వలేమని తీర్మానించింది. మరికొన్ని కీలక సూచనలూ ఇచ్చింది.ఓటరును నిర్ధారించే పత్రాలు సమగ్రంగా లేవనీ, ఆధార, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులను సైతం పరిశీలనలోకి తీసుకురావాలని సూచించింది. కాగా ఓటరు జాబితాల సమగ్ర సవరణ అధికారం ఎన్నికల సంఘానికి ఉన్నప్పటికీ అందుకోసం ఎంచుకున్న సమయం సరైనదికాదని, సరిగ్గా ఎన్నికల తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం సమర్థించలేమని జస్టిస్ సుధాంశుధూలియా, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. త్వరలో ఎన్నిలకు జరగనున్న తరుణంలో ఎన్నికల సంఘం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' అని ప్రకటించగానే విపక్ష రాజకీయ పార్టీలన్నీ ఉలిక్కిపడ్డాయి. ఈ ప్రక్రియ ద్వారా దాదాపురెండు కోట్ల మందికిపైగా కీలక ప్రాంతాల్లో ఓటర్లను తొలగించేందుకేననే అపోహపడేందుకు ఆస్కారమిచ్చింది. ఆధార్ వంటి కార్డుల సంగతి పక్కనపెట్టి ఏవేవో 11 పత్రాలను పేర్కొని వాటి ద్వారా ఇంటెన్సివ్ జాబితాను తయారు చేయాలని చూడడంలో ఔచిత్యం లేదని భావించే పరిస్థితి తయారైంది. బీహారు ప్రజలంటేనే వలస జీవులు, పనిపాటలకు, శ్రమజీవనానికి, ఉపాధి కోసం దేశాంతరాలు విడిచి వెళ్లడం పరిపాటి. దేశం యావత్తు ఏ రాష్ట్రానికి వెళ్లినా, ప్రాంతానికి వెళ్లినా భవన నిర్మాణ రంగంలో బీహారు కార్మికులు కోకొల్లలుగా కనిపిస్తుంటారు. అలా వచ్చిపోయే వాళ్ల పేర్లు తొలగింపుతోపాటు కొత్తగా ఓటు హక్కు కలిగిన యువత పేర్లను చేర్చుకొని ఓటరు జాబితాలో కలుపుకోవచ్చని ఎన్నికల సంఘం నిర్దేశించింది. విదేశీ చట్ట విరుద్ధ వలసదారుల పేర్లను తొలగించడానికే ఈ 'ఇంటెన్సివ్' జాబితా సవరణ అవసరమైందని ఎన్నికల సంఘం పేర్కొనడాన్ని బట్టి రాజకీయ పక్షాల నుంచి అభ్యంతరం వెలువడింది. సమర్పించాల్సినపత్రాల జాబితా, సమయం తగినంత లేకపోవడంతో ఇ.సి ప్రతిపాదన ఆక్షేపణకు గురైంది. ఇదంతా ఓటర్లను తొలగించే ఎత్తుగడలాగే అనిపిస్తోంది. ఇదే మాట సర్వజనులదీ. ఎందుకంటే ఓటరు జాబితాలో చేర్పుకోసం సమర్పించాల్సిన పత్రాల్లో తల్లి, తండ్రి జనన తేదీలు, వారు పుట్టిన ప్రదేశాలు, అక్కడ నివాసం ఉన్నారన్న రుజువులు సమర్పించాలి. ఇలాంటి పత్రాల జారీ, సమర్పణ ఎంతో కష్టతరం.గతంలో బీహార్‌లో ఉండి వలసవెళ్లి ఉంటే అప్పట్లో బీహార్‌లోనే ఉన్నట్లు అదనపు ధృవీకరణ పత్రాలను సమర్పించాలని షరతు పెట్టింది. వలస కార్మికులకు ఇటువంటివి తీసుకురావడం జరిగే పనికాదు. ఏ రాష్ట్రంలోనూ ఇన్ని రకాల సంక్లిష్ట సమాచారాన్ని అడిగి ఉండరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం కేవలం భారతీయుడై ఉంటే చాలు ఈ దేశంలో ఓటరుగా నమోదవుతారు. అంతెందుకు ఎవరి పుణ్యమోకానీ, వైఫల్యమోకానీ చాలా మంది ఓటర్లకు రెండు,మూడు పట్టణాల్లోనూ, రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లోనూ ఓటింగ్ హక్కు ఉన్నా అంశాలు మనకు తెలిసినవే. ఇన్ని అభ్యంతరాల మధ్య ఎన్నికలసంఘం తీసుకున్న యూటర్న్‌లను బట్టి ముందుగా సరైన యోచన చేయకుండా ప్రజలకు ఓటరు కార్డుల పేరిట వారి పౌరసత్వాన్ని అనుమానించే ప్రయత్నాలను ఆపేయాలని విపక్ష పార్టీలు సూచించాయి. ఇసి నిర్ణయం మంచిదే, కానీ సరైన తరుణం కాదు. సరైన ఆధారిత పత్రాల విషయమై రూపొందించిన జాబితా వివాదాస్పదమైందని సుప్రీంకోర్టు గమనించింది. ఎన్నికలకు ముందు ఇలాంటి సవరణల కార్యక్రమం దేనికని ధర్మాసనం ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. పైగా పౌరసత్వాన్ని ధృవీకరించే అధికారం కేంద్ర హోమ్ శాకే తప్ప ఎన్నికల సంఘానికి లేదని జస్టిస్ సుధాంశుధూలియా తప్పుపట్టారు. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరిట ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపిస్తూనే మరికొన్ని అనుమానాలు వ్యక్తం చేశారు. బీహార్‌లో మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా ఇదేతంతు జరిగే అవకాశం లేకపోదని, ఇదంతా బిజెపి పన్నాగమేనంటూ ఆందోళన వెలిబుచ్చారు. కాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎన్నికల కమిషన్ ఇకపై ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్యానికి తలవంపులు తీసుకురాబోదని అనుకోవచ్చు.

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.



ఆస్కార్‌వైల్డ్

బంగారం నాణ్యత అగ్నిలో తెలుస్తుంది. మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది.



జార్జి ఇలియట్

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండీ' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి బాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు.**

దామెర్ల సాయిబాబ

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటిది ఒంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికి పాల్పడడం ధర్మంకాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టప్రకారం నేరం కూడా. కానీ దేశంలో అవినీతికి పాల్పడేవారి సంఖ్య కోట్లల్లో ఉన్నది. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నం జరుగుతున్నా ఏమాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా ఉన్నతస్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డు లేకుండాపోతున్నది. ఆ స్థాయిలో అరికట్టేందుకు గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా నిలువరించలేకపోతున్నారు. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టేముందు ఉన్నతస్థాయిలో ముఖ్యంగా రాజకీయ అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా లంచం ఇచ్చి ఒక మంత్రినే ఇంటికి పంపారు. అప్పట్లో అది రాజకీయంగా సంచలనం రేపింది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడులు ఆలోచించడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణాలలో వేలాది కోట్లరూపాయలు పక్కదారిపడుతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు అంతకు ముందున్న ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు వహించినవారిపై విచారణలు చేయించడం సర్వసాధారమైపోయింది. వాటిల్లో కూడా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి తిరుగులేని రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబెట్ట లేకపోతున్నారు. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లో కానీ, రేషన్ కార్డుల్లో కానీ, వృద్ధాప్యపింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు ఏమి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులు ఈ అవినీతి అధికారులు చేయి కలిపి ప్రజాసొమ్మును ఎలా భోంచేస్తున్నారో తెలియని విషయాలు ఏమీ కాదు.ప్రాజెక్టుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు,ఏకంగాపర్సెంటేజీలు నిర్ణయించి తీసుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో అవినీతి నిరోధక శాఖ, కేంద్ర స్థాయిలో సిబిఐతోపాటు ఈడి, నిఘా విభాగాలు మరెన్నో పనిచేస్తున్నాయి. ఎన్నో చట్టాలు చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. వేలాది మంది అధికారులను వల పన్ని పట్టుకున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినందుకు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపారు, పంపుతున్నారు. ఎంత మందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నారు. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని లక్షల కోట్లు భారత్ కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతికి ఆరోప్రాణమైన కొందరు నేతలే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయట పడ్డాయి. పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామకాల కుంభకోణంలో కోట్లరూపాయలను దిగమింగి తన ఆప్తమిత్రురాలి ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచి

ఒక్క మాట

పెట్టిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకి కారణమని రాసి ఆ మధ్య ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తప్పని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభై లక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఆ శాసనసభ్యుని ఇంట్లో జరిపిన సోదాల్లో ఎనిమిది కోట్ల రూపాయలకుపైగా అధికారులు పట్టుకున్నారు. అంతే కాదు సాక్షాత్తు ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడ నుండి వచ్చింది? ఎవరు, ఎందుకోసం ఇచ్చారు! తదితర ప్రశ్నలకు జవాబు దొరకదు. మొన్న ఒడిశాలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదాలు చేస్తే నలభై లక్షలకుపైగా నగదు అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా అనుమతిలేక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషనర్ రాంచంద్రసమాల్ బయటపెట్టిన విషయాలు అద్దంపడుతున్నాయి. ఇవేకాదు కొందరు సీనియర్ రాజకీయ నాయకులు కూడా ఈ అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఉన్నత స్థాయిలోజరుగుతున్న అవినీతిలో పట్టుబడుతున్నది ఒక శాతం కూడా ఉండకపోవచ్చు. హర్యానా ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా కాలంలో ఉపాధ్యాయులనియామకంలో మెరిట్ లిస్టును మార్చి నకిలీ పత్రాలను సృష్టించి వాటి స్థానంలో మూడువేల మందికిపైగా టీచర్లను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో న్యాయప్రక్రియకు దాదాపు పదమూడేళ్లకుపైగా సమయం పట్టింది. 2013 జనవరిలో న్యాయస్థానం చౌతాలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అప్పటికి ఆయనకు 78ఏళ్లు వచ్చాయి. జైలులో ఎనిమిదేళ్లు శిక్ష అనుభవించి 2021లో విడుదలయ్యారు. అలాగే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పద్దెనిమిదేళ్ల విచారణ తర్వాత దిగువ న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్ష, భారీగా జరిమానా విధించింది. 2015లో కర్ణాటక హైకోర్టు జయలలితను నిర్దోషిగా విడుదల చేసింది. నిర్దోషిగా విడుదల కావడంపై సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టులో తీర్పు ఇవ్వడానికి ముందే జయలలిత మృతి చెందారు. దేశంలో తీవ్ర చర్చనీయాంశమైన దాణా కుంభకోణంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై 1996 నుంచి 2018 వరకు న్యాయస్థానాల్లో విచారణలు జరిగాయి. 2013లో ఐదేళ్ల శిక్షపడిన తొలి తీర్పు వచ్చే సమయానికి ఆయనకు 65ఏళ్లు. ఆయన జైలులో గడిపింది మూడున్నరేళ్లే. అక్రమ మైనింగ్ ఒప్పందాలపై ఏళ్లపాటు సాగిన విచారణలో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడకు 2017లో మూడేళ్ల జైలు శిక్షపడింది. శిక్షలు పడుతున్నది అతికొద్ది శాతమే. ముంబాయిలోని బార్‌లు, పబ్‌ల నుండి తనకు నెలకు వంద కోట్ల రూపాయలు వసూలు చేసి ఇవ్వాలని హోంమంత్రి ఒకరు అప్పట్లో పోలీసులకు లక్ష్యం నిర్దేశించారని ఆ నగర మాజీ పోలీసు కమిషనర్ పరమ్‌వీర్‌సింగ్ స్వయంగా వెల్లడించారు. ఇక మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని పట్టుకోవడం కష్టమైనా వాటిని వలపన్ని పట్టుకుంటున్నారు. కనుక బాహాటంగా నిర్లజ్జగా జరుగుతున్న అవినీతిని పసికట్టకపోవడమనే ప్రశ్న ఉదయించదు. గతవారంలో తెలంగాణ రాష్ట్రంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఏసిబి అధికారులు జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండీ' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి భాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు. •

# నైపుణ్యాల మెరుగుదలకు విద్యే ప్రధానం

తరిగోపుల నారాయణస్వామి

విద్య మన సమాజ అభివృద్ధికి నాంది పలుకుతుంది. మన దేశ భవిష్యత్తు నిర్మాణానికి విద్యావ్యవస్థ కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగంలో గత దశాబ్దంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ మార్పులు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్త విద్యావిధానం (2020) అమలు పరంపరలో రాష్ట్రం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నా, వాటి అమలులో స్పష్టత కొరవడినట్టు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఆంగ్ల మాధ్యమ పాఠశాలల స్థాపన, పదవ తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమం తప్పనిసరి చేయడం వంటి చర్యలు నగరాల్లో ఉపయుక్తంగా కనిపించినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అవి విద్యా నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. విద్యార్థులపై డిజిటల్ ఆధారిత బోధన పెరుగుతోంది. కానీ ఇంకా చాలా మందికి ఇంటర్నెట్ సౌకర్యం, ట్యాబ్లెట్‌లు,స్మార్ట్‌ఫోన్లు లభించకపోవడం వల్ల నూతన విధానాలు పూర్తిగా ఫలప్రదంగా మారలేకపోతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి కనిపించినా, అధ్యాపకుల పోస్టుల భర్తీ విషయంలో మాత్రం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. గ్రామీణ పాఠశాలల్లో బోధనా భాష, బోధనా నైపుణ్యాలు, పాఠశాలలో ఉపాధ్యాయుల లభ్యత వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి.ఒకవైపు విద్యా ప్రమాణాలు పెరిగినట్టుగా సూచనలు ఉన్నా, పరీక్షల ప్రాతిపదికన మాత్రమే విద్యను అంచనా వేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, అభినవ ఆలోచనలు, అభ్యాస నైపుణ్యాలు వెనుకబడుతున్నాయి. ఇటీవల ప్రారంభించిన మానవ వనరుల అభివృద్ధి స్కూళ్లు, నాడునేడు కార్యక్రమం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర వంటి పథకాలు వంటి చర్యలు విద్యా రంగాన్ని పునర్నిర్మించడానికి వేసిన అడుగులు. అయినా, ఈ కార్యక్రమాల సమర్థవంతత ఉపాధ్యాయుల శిక్షణ,మానవ వనరుల అందుబాటుపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థుల మధ్య పఠన ఆసక్తి తగ్గిపోవడం, పుస్తకరహిత విద్యావిధానం ఎక్కువగా విస్తరించడంవల్ల విద్యార్థుల నైపుణ్యం స్థిరంగా ఉండడం లేదు. ముఖ్యంగా గత కొద్ది సంవత్సరాలలో విద్యా ప్రైవేటీకరణ ఎక్కువవడంతో సామాన్య కుటుంబాలకు విద్య ఖర్చుగా మారింది. ఉన్నత విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల రేషియో తగ్గిపోవడం, విజ్ఞాన కేంద్రాల కొరత,రిసెర్చ్ నిధుల లోపం వంటి అంశాలు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే వొకేషనల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, స్టార్టప్ ప్రోత్సాహం వంటి అంశాలపై మరింత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయిలో పరీక్షల అట్టహాసం, గ్రేడులపైనే ఆధారపడే తీరు, విద్యార్థులపై ఒత్తిడి పెంచుతోంది. మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టేవిధంగా సైకాలజికల్ కౌన్సిలింగ్,లైఫ్ స్కిల్స్ బోధనను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. మరోవైపు, విద్యారంగంలో సాంకేతికత వినియోగం, ఎడుటెక్ సంస్థలద్వారా విద్య అందుబాటులోకి రావడం, గణాంకాల ఆధారంగా విద్యా విధానాలను రూపకల్పన చేయడం వంటి నూతన ప్రయోగాలు సాధించాల్సిన ముందడుగులుగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేసినప్పటికీ వాటి అమలు స్థాయిలో నిర్లక్ష్యం, నాణ్యత కంటే ప్రదర్శనకే ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల విద్యావ్యవస్థ ఆవశ్యకమైన మార్పులను పొందలేకపోతోంది. విద్యను కేవలం ఉత్తీర్ణత లక్ష్యంగా కాకుండా, జీవిత నైపుణ్యాల అభివృద్ధి సాధించేందుకు ఉపయోగించాలి. •

# పునరుత్పాదక ఇంధనంతోనే ఆర్థిక స్వావలంబన

డి జె మోహన రావు

పునరుత్పాదక ఇంధనం అంటే ప్రకృతిలో నిరంతరం లభించే, తరగని వనరులైన సూర్యరశ్మి, గాలి, నీరు, జీవపదార్థాల నుంచి ఉత్పత్తి అయ్యే శక్తి. బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల మాదిరిగా కాకుండా, ఇవి వాతావరణంలోకి తక్కువ కాలుష్య వాయువులను విడుదల చేస్తాయి. సౌరశక్తి, పవనశక్తి, జల విద్యుత్, బయోఎనర్జీ ఇవన్నీ పునరుత్పాదక వనరులే. పర్యావరణానికి తక్కువ హాని కలిగించడమే కాకుండా, ఇవి సుస్థిరమైన శక్తి పరిష్కారాలను అందిస్తాయి. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద విద్యుత్ వినియోగ దేశంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నందున, శక్తి అవసరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మనం ఎక్కువగా బొగ్గు, దిగుమతి చేసుకున్న ముడి చమురుపై ఆధారపడుతున్నాం. మన ముడి చమురులో దాదాపు 85శాతం విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం మోపడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు మనల్ని గురిచేస్తుంది. పునరుత్పాదక ఇంధనం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశానికి శక్తి స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. పర్యావరణ పరంగా, వాతావరణ మార్పుల వల్ల భారత్ తీవ్ర ప్రభావానికి గురవుతున్న దేశాల్లో ఒకటి. అకాల వర్షాలు, వరదలు, కరవులు, వేడిగాలులు మన వ్యవసాయం, నీటి వనరులు, ప్రజల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. నగరాల్లోని వాయు కాలుష్యం శ్వాసకోశ, గుండె జబ్బులకు కారణమవుతోంది. పునరుత్పాదక ఇంధనానికి మారడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా, ప్రజల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచవచ్చు. ఆర్థికంగా, పునరుత్పాదక ఇంధన రంగం అపారమైన అవకాశాలను సృష్టిస్తోంది. ఈ రంగం 2028 నాటికి 70లక్షలు, 2047 నాటికి 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తుంది. ఇది దేశీయ ఉత్పత్తిని పెంచుతుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. భారత్‌ను గ్లోబల్ గ్రీన్ టెక్నాలజీ లీడర్‌గా మారుస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యాన్ని అందించడంలో కూడా సౌరశక్తి వంటివి ఎంతో ఉపయోగపడతాయి. 2025 మే నాటికి పెద్ద జల విద్యుత్ కేంద్రాలతో కలిపి మన దేశ మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 226.75 గిగావాట్లకు చేరుకుంది. ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదికల ప్రకారం, మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో చైనా, అమెరికా,బ్రెజిల్ తర్వాత మనం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉన్నాం. 2014-15లో కేవలం 81 గిగావాట్లు ఉన్న సామర్థ్యం ఇంతలా పెరగడం గమనించదగ్గ విషయం.సౌరశక్తి ఉత్పత్తిలో దేశం ప్రపంచంలోనే చైనా, అమెరికా తర్వాత మూడవ అతిపెద్ద దేశంగా అవతరించింది. 2025మే నాటికి మన మొత్తం సౌరశక్తి సామర్థ్యం 110 గిగావాట్లను దాటింది. పవనశక్తి (గాలి ద్వారావిద్యుత్)



సామర్థ్యంలోనూ భారతదేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచింది. దీని సామర్థ్యం 2025 మే నాటికి 51 గిగావాట్లకు పైగా ఉంది. భారత్ 2030 నాటికి శిలాజ ఇంధనేతర వనరుల నుంచి 500 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సాధిస్తామని, మొత్తం విద్యుత్ అవసరాల్లో 50 శాతం పునరుత్పాదక వనరుల నుంచే పొందుతామని ప్రకటించింది. 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను చేరుకోవాలనే సంకల్పం మన దీర్ఘకాలిక విజన్‌ను చూపుతుంది. దేశంలో పునరుత్పాదక ఇంధన విప్లవం రాష్ట్రాల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతోంది. సౌరశక్తి ఉత్పత్తిలో రాజస్థాన్ అగ్రస్థానంలో ఉంది. 2025 మే నాటికి దాని సామర్థ్యం 27.64 గిగావాట్లను దాటింది. భద్లా సోలార్ పార్కు వంటి ప్రపంచంలోనే అతిపెద్ద సౌర పార్కులు ఇక్కడే ఉన్నాయి. సౌర (18.13 గిగావాట్లకు పైగా) పవనశక్తి రెండింటిలోనూ గుజరాత్ అగ్రశ్రేణి రాష్ట్రాల్లో స్థిరంగా నిలుస్తోంది. పవనశక్తిలో తమిళనాడు మార్గదర్శిగా ఉంది. ప్రస్తుతం దాని సామర్థ్యం 10గిగావాట్లకు పైగా ఉంది. సౌరశక్తి సామర్థ్యం కూడా 9.77 గిగావాట్లకు పైగా పెరుగుతోంది. సౌరశక్తి (9.31 గిగావాట్లకు పైగా)పవనశక్తి రెండింటిలోనూ బలమైన స్థానంలో ఉంది. మహారాష్ట్ర ముఖ్యంగా సౌరశక్తిలో (9.88 గిగావాట్లకు పైగా) తన పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులు (5 గిగావాట్లకు పైగా), బయోమాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి (దాదాపు 10.74 గిగావాట్లు) కూడా దేశ శక్తి అవసరాలను తీర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ వంటి సరికొత్త సాంకేతికతలపై భారీ పెట్టుబడులు పెడుతున్నాం. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భారతదేశం పునరుత్పాదక ఇంధన రంగంలో సాధిస్తున్న ప్రగతి అద్భుతం. 2030 లక్ష్యాలు బలమైన విధానాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల (169 గిగావాట్లకు పైగా నిర్మాణంలో, 65 గిగావాట్ల ప్రాజెక్టులు టెండర్ దశలో) ద్వారా సాధ్యమయ్యేవే. దేశీయ తయారీని ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం (ముఖ్యంగా చైనా నుంచి మే 2025లో 74.8 సౌర మాడ్యూల్స్ దిగుమతయ్యాయి) మన దీర్ఘకాలిక ఆర్థిక, శక్తి భద్రతకు కీలకం. ఈ ప్రయాణంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సౌర, పవనశక్తి వంటివి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి వాటిని పెద్ద మొత్తంలో జాతీయ విద్యుత్ గ్రిడ్‌లోకి అనుసంధానించడం సవాలుతో కూడుకున్నది. దీనికి స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు, భారీ ఎత్తున శక్తినిల్వ చేసే వ్యవస్థలు (బ్యాటరీలు,పంప్డ్ హైడ్రో) అవసరం. పెద్ద ప్రాజెక్టులకు భూసేకరణ ఒక క్లిష్టమైన సమస్య. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక నిధులు లభించడం, పెట్టుబడిదారులకు నష్టభయం తగ్గించడం కూడాముఖ్యమే. అంతేకాదుఈ అధునాతన వ్యవస్థలను నిర్మించడానికి, నిర్వహించడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశ సంకల్పం, అపారమైన పునరుత్పాదక ఇంధన వనరులు మనకు భవిష్యత్తుపై నమ్మకాన్ని ఇస్తున్నాయి. ప్రపంచ స్థాయిలో మనం సాధిస్తున్న ప్రగతి, మన లక్ష్యాలు, సుస్థిర భవిష్యత్తుకోసం మన దేశం చూపుతున్న దార్శనికతను స్పష్టం చేస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనానికి మారడం అనేది కేవలం శక్తి అవసరాలను తీర్చడమే కాదు.ఇది మరింత బలంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా పురోగమించే భారతదేశాన్ని నిర్మించడం. •

# ప్రజావాక్కు



## కల్తీ కల్లు మీద ఉక్కుపాదం మోపాలి

హైదరాబాద్‌లో కల్తీ కల్లుతాగి ఆరుగురు మృత్యువాత పడడం, అనేకమంది ఆసుపత్రుల పాలుకావడం బాధాకరం. తాటి చెట్లు లేకున్నా కొంత మంది కల్లు కాంపౌండ్ యజమానులు నీళ్లలో క్లోరల్ హైడ్రేడ్ డిజీ ఫామ్ అల్ఫీజోలంకలిపి కల్తీకల్లు విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. చాలా మంది ఈ కల్లుతాగి ఊపిరి తిత్తులు, కిడ్నీ, గుండె నాడీ వ్యవస్థ దెబ్బతిని ప్రాణాలు కోల్పోవుతూ వున్నారు. హైదర్ నగర్, ఇందిరా నగర్, షంషీ గూడ కల్లు కాంపౌండ్ లలో కల్తీ కల్లు తాగి ఆరుగురు చనిపోవడం అందరినీ కలచివేసింది. హైదరాబాద్ అన్ని జిల్లాల్లో కల్తీ కల్లు డిపోలను మూసివేయాలి.చనిపోయిన వారికిఎక్స్రేషియాచెల్లించాలి. మృతుల కుటుంబాలని అన్ని విధాల ఆదుకోవాలి. కల్తీ కల్లు విక్రయదారుల మీద ఉక్కు పాదం మోపాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## రాజకీయ వైవిధ్యం

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనుకు కల పడింది ఎన్నికల లిస్ట్ సవరణ చేపట్టాలి అని. మరి ఈ కొత్త ఆలోచన భారత దేశపు వైవిధ్యాన్ని రాజకీయా వైవిధ్యాన్ని దెబ్బ కొట్టదుగా. ఒకవేళ ఈ నిర్ణయం అమలు అయితే భారత దేశంలో నష్టపోయేది దళితులు, ముస్లిం, ఆదివాసులనే పరిస్థితిఉన్నది అంతకంటే ముఖ్యంగా ప్రజలు ఈ దేశ పౌరులు అని నిరూపించుకోవాల్సిన దుస్థితిలోకి నెట్టబడుతారు. అదే ఇప్పటి విడ్డురం మరి. ముఖ్యంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిన సందర్భం. ఇప్పుడు ఎందుకు వచ్చింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ నిర్ణయం వల్ల దేశ పౌరుల ఆయుధం ఆయిన ఓటును తొలగిస్తే దేశ ప్రజాస్వామిక దృక్పథాన్ని కాలరాసినట్టే.

-భారత అవినాష్, జనగామ

## బాధ్యతలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ గురుకులలోని హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో ప్రతి విద్యాసంస్థలలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు వేరు వేరు చేసి నియామకాలు చేయాలి. ఈ విధానం వలన పని విభజన జరుగుతుంది. ఎప్పటి కప్పుడు పనులు పూర్తి అవుతాయి.

-రాపాక రవీందర్, జనగాం

## పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

భారతదేశంలో మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగా లభించడం, యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత,మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాల వైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. హృదయ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కేన్సర్, మానసిక రుగ్మతలు, ఎయిడ్స్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి, యువత విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కాలమే తీర్పు చెప్పాలి

తెలంగాణా రాష్ట్రానికి కొత్త అధ్యక్షునిగా ఎవరిని నియమించాలని అనేక తర్జన భర్జనలు చేసిన తదుపరి మాజీ ఎమ్.ఎల్.సి. ఎప్పటి నుండో రాష్ట్ర స్వయంసేవక్‌లో సేవలందించి, న్యాయవాది వృత్తి చేసిన అకుంఠిత దీక్షా దక్షతలు కలిగిన ఎన్. రాంచందర్ రావును ఏ పోటీ లేకుండా ఎన్నుకోవడం బిజెపి పార్టీ క్రమశిక్షణకు ప్రత్యక్ష నిదర్శనం. ఈయన బాధ్యతలు చేపట్టిన వెంటనే కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం పైనా బీఆర్ఎస్ పార్టీపైన ఆరోపణలు చేస్తూ విరుచుకుపడ్డారు.రాష్ట్ర ముఖ్యమంత్రికి అప్పుడే సమస్యలను ఎత్తి చూపుతూ ఒక బహిరంగ లేఖను రాయడం కూడా జరిగింది. రాబోయే 2029 ఎన్నికలలో తమ పార్టీకి వంద అసెంబ్లీ సీట్లు పదిహేను ఎమ్.పి. సీట్లు వస్తాయని చెప్పి వార్తల కెక్కారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లల జీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరక జడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రూ.40వేలకు పెరిగిన వీసా ఫీజులు

## ట్రంప్ 'బ్యూటిఫుల్ బిల్' భారతీయులకు పెంచిన భారం



**న్యూఢిల్లీ, జూలై 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమలుకు తెచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్‌బిల్ తో ఇపుడు వీసా సమీకృత ఫీజు 250 డాలర్లుగా ఖర్చవుతున్నది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా కేటగిరీలకు ఈ ఫీజులు వర్తిస్తాయి. భారత్ నుంచి ఎక్కువగా పర్యాటక వీసాలకే దరఖాస్తులు వస్తున్నాయి. టూరిస్టు, ఉన్నత విద్య, ఉద్యోగం వంటి వాటికి వచ్చే దరఖాస్తులకు 2026నుంచి మరింత భారం అవుతున్నాయి. 16వేల ఫీజు కట్టే వీసా ఇపుడు 40 వేల రూపాయలకు పెరిగింది. ప్రస్తుత వీసా ఫీజులకు అదనంగా 21,400 రీఫండ్‌కు వీలుకాని సర్‌ఛార్జిగా ఉంటుంది. ఇక ప్రతి వీసా జారీ సమయంలో ఈమొత్తం చెల్లించాల్సిందే. 2026నుంచి అమలులోకి వస్తుంది. ఈ ఫీజును ద్రవ్యోల్బణం ఆధారంగా నిర్ణయిస్తారు. వినియోగరంగ ధరలసూచీ ఆధారంగా ఈ ఫీజు నిర్ణయం అవుతుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలు అంటే బి-1/బి-2 అంటే టూరిస్టు, బిజినెస్ వీసాలు, ఎఫ్ అండ్ఎం స్టూడెంట్ వీసాలు, హెచ్1బి వర్క్ వీసాలు, జె అంటే ఎక్చేంజి విజిటర్ వీసాలకు ఈ మొత్తం అన్వయిస్తారు. కేవలం దౌత్యపరమైన వీసా హోల్డర్లు మాత్రమే అంటే కేటగిరి ఎ, కేటగిరి జిలకు మినహాయింపు ఉంది. టెక్ నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్లకు ఈ అదనపు మొత్తం విధిగా చెల్లించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ప్రస్తుతం యుఎస్ బి-1/బి వీసాకు 185 డాలర్లు అంటే 15,800 ఖర్చువుతోంది. వీసా ఇంటిగ్రిటీ ఫీజుకింద ఇతర మైనర్‌ఫీజులు అంటే -94 ఫీజు 24 డాలర్లు, ఇఎస్‌టిఎ ఫీజు 13 డాలర్లు మొత్తం వ్యయం 472 డాలర్లు అంటే భారత కరెన్సీలో 40,502 రూపాయలు చెల్లించుకోవాలి. ప్రస్తుత వీసా వ్యయంకంటే రెండున్నర రెట్లు ఎక్కువ భరించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు విఈసాలు ఎఫ్ లేదా హెచ్1బి వ్యయాలు కూడా భారీగాపెరుగుతున్నాయి. కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో మినహా ఈ ఫీజు రద్దుకాదు, తగ్గింపు ఉండదు. అన్ని వీసా నిబంధనలు భర్తీచేయాలి. వీసా గడువుకు ఐదురోజులుముందే అమెరికాను విడిచి వెళుతున్నట్లు ప్రకటించాలి. లేదా చట్టపరంగా వారి బసను పొడిగించుకున్నట్లు స్పష్టం చేయాలి. అప్పుడే రీఫండ్‌కు అర్హులవుతారు. యుఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ ఈ విధానాలను పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా ఈ కొత్తబిల్లులు విదేశీ జమలు అంటే అమెరికాలో ఉన్న విదేశీయులు వారి సొంతదేశాలకు పంపించే జమలపై ఒకటిశాతం సుంకం చెల్లించాలన్న నిబంధనను కూడా అమలుకు వచ్చింది.



## కొత్త పార్టీ పెట్టిన లాలూ పెద్దకుమారుడు తేజ్‌ప్రతాప్

**పాట్నా,జూలై 11:** బీహార్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సొంత పార్టీ ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తేజ్‌ప్రతాప్ యాదవ్ తండ్రి లాలు ప్రసాద్ యాదవ్‌కు షాకిచ్చారు. కొత్త పార్టీ బ్యానర్‌పై మహువాలో ర్యాలీ నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయబోతున్నట్టు సంకేతాలిచ్చారు. పార్టీతో విభేదాల అనంతరం తొలిసారి నిర్వహించిన ఈ ర్యాలీలో తేజ్ ప్రతాప్ మద్దతుదారులు ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో ఉన్న జెండాను పట్టుకున్నారు. దానిపై 'టీమ్ తేజ్ ప్రతాప్' అని రాసి ఉంది. తన మాజీ నియోజకవర్గమైన మహువాలో రోడ్‌షోకు నాయకత్వం వహించిన తేజ్ ప్రతాప్ తన సిగ్నేచర్ గ్రీన్ క్యాప్ ధరించారు. అక్కడ మద్దతుదారుల నుంచి ఆయనకు హృదయపూర్వక స్వాగతం లభించింది. తాను ఒకరి నియంత్రణ కింద పనిచేయబోనని చెప్పిన తేజ్ ప్రతాప్ ప్రజల నిర్ణయానికి అనుగుణంగా తన తర్వాతి నిర్ణయం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఏది కోరితే అదే చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలని ప్రజలు కోరితే అక్కడి నుంచి పోటీ చేస్తానని వివరించారు. తేజ్ ప్రతాప్ 2015 అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తాజాగా ఆయనను ఆరేళ్లపాటు పార్టీనుంచి బహిష్కరిస్తూ ఆయన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, అనుష్క యాదవ్ అనే మహిళతో ఉన్న ఫొటోలను షేర్ చేసిన తేజ్‌ప్రతాప్ ఆమెతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ తర్వాత ఆ ఫొటోలను డిలీట్ చేశారు. తన ఫేస్‌బుక్ హ్యాక్ అయిందని పేర్కొన్నారు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీనిని తీవ్రంగా పరిగణించిన లాలుప్రసాద్ తన పెద్దకొడుకుతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకున్నట్టు ప్రకటించారు.



## 9 నెలలుగా ఇంట్లోనే శవంగా.. నటి మృతి కేసులో సంచలనం!

**ఇస్లామాబాద్, జూలై 11:** దయనీయస్థితిలో శవమై కనిపించిన పాకిస్థాన్ నటి కేసులో కీలక విషయం వెల్లడైంది. ఆమె తొమ్మిది నెలల క్రితమే ఇంట్లో చనిపోయి ఉండొచ్చని తెలుస్తోంది. గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిన ఆమె మృతదేహాన్ని కరాచీలోని అపార్ట్‌మెంట్‌లో మంగళవారం పోలీసులు గుర్తించారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం పాక్‌కు చెందిన ఆ నటి పేరు హుమైరా అస్గర్ అలీ. లాహోర్‌కు చెందిన ఆమె ఏడేళ్ల క్రితం కరాచీకి వచ్చి, ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. చాలా అరుదుగా మాత్రమే ఆమె కుటుంబసభ్యుల వద్దకు వెళ్లేవారు. కొన్ని నెలలుగా ఆమె అద్దె కట్టడం లేదని ఆ ఇంటి యజమాని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా ఆమె మృతి చెందిన విషయం బయటపడింది. పూర్తిగా కుళ్లిపోయి, ఎముకలు బయటపడిన స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఆమె తొమ్మిది నెలల క్రితమే ప్రాణాలు కోల్పోయి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 'ఆమె గతేడాది అక్టోబరులో చివరి ఫోన్ కాల్ చేసింది. అద్దె ఇంటికి దగ్గర్లోని వారు ఆ సమయంలోనే ఆమెను చూశామని చెప్పారు' అని పోలీసు అధికారులు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఆమె ఫ్లాట్‌కు ఆ నెలలోనే ఎలక్ట్రిసిటీ నిలిపేసి ఉండొచ్చన్నారు. ఆ ఇంట్లో ఆహారమంతా పాడైపోయింది. కొన్ని వస్తువులు తుప్పుపట్టాయి. నటి ఉంటున్న అంతస్తులో ఉన్న మరో ఫ్లాట్ కూడా ఖాళీగా ఉండటంతో మృతదేహం నుంచి వచ్చిన దుర్వాసనను ఎవరూ గుర్తించలేకపోయారు. కొంతమంది ఫిబ్రవరిలో ఆ అంతస్తుకు వచ్చినా.. అప్పటికే కొన్ని నెలలు కావడంతో ఎవరికీ దుర్వాసన రాలేదు. మూడు రోజు క్రితం ఆమె మృతదేహాన్ని గుర్తిస్తే దానిని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించడం గమనార్హం. చివరకు ఆమె సోదరుడు అందుకు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఒక యేడాదిన్నరగా ఆమె తమ వద్దకు రాలేదని నటి సోదరుడు చెప్పారు. కాగా.. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లాహోర్ చెందిన హుమైరా 2015లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. పలు టెలివిజన్ షోల్లో కనిపించారు. జలేబి (2015), లవ్ వ్యాక్సిన్ (2021)చిత్రాలు చేశారు. 2022లో వచ్చిన తమాషా రియాల్టీ షోతో పాపులరయ్యారు.

## కుమార్తెపై దీపక్ ఎందుకు కాల్పులు జరిపినట్లు?

### టెన్నిస్ అకాడమీయే కాల్పులకు మూలకారణమా?

### నేరం అంగీకరించిన టెన్నిస్‌స్టార్ తండ్రి దీపక్‌యాదవ్



**గురుగ్రామ్, జూలై 12:** లగ్జరీ ఫామ్‌హౌస్, నెలకు 17లక్షలకుపైగా ఆదాయం ఉన్న వ్యక్తి తన కుమార్తెను తానే స్వయంగా ఎందుకు కాల్చి చంపారన్న వార్తలు ఇపుడు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి. 25 ఏళ్ల టెన్నిస్‌ప్లేయర్ రాధికా యాదవ్‌ను కన్నతండ్రే కాల్చిచంపేసిన ఉదంతం అందరినీ కలవరపరిచింది. గురుగ్రామ్‌లోని సుశాంత్‌లోక్ ప్రాంతంలో అత్యంత లగ్జరీ ఇంటిలో రాధికా కుటుంబం నివసిస్తోంది. దీపక యాదవ్(49) తానే హత్యచేసినట్లు అంగీకరించాడు. ఐదు రౌండ్లు కాల్చాడు. కిందిఅంతస్తులో ఉన్న రాధిక మేనమామ వెంటనే పైకి చేరుకునే సరికి కిచెన్‌లో రక్తపుమడుగులో ఉన్న రాధికాను తన కారులో పక్కనే ఉన్న ఆసియా మారింగో ఆసుపత్రికి తరలించారు. కాని వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని ధృవీకరించడంతో వంర్ధమాన టెన్నిస్ తార ఒకటి రాలిపోయి నట్లయింది. దీనికంతటికి సొంతవూరు వజీరా బాద్‌లో ఆయనకు లెక్కకుమించిన ఆస్తులున్నాయి. లగ్జరీ ఫామ్‌హౌస్‌కూడా ఉంది. నెలకు 18 లక్షల వరకూ ఆదాయం వస్తున్నా తాను కూతురు సంపాదనపైనే ఆధారపడి బతుకుతున్నట్లు చెడు ప్రచారం జరగడంతో భరించలేకపోయినట్లు పోలీసులకు తెలిపాడు. అయితే ఇది నిజం కాదని ఆయనకు అంతకుమించిన ఆస్తులే ఉన్నా యని గ్రామస్తులు చెపుతున్నారు. అలాగే తాను సొంతంగా ఉంచుకున్న తుపాకి సంపన్నులు మాత్రమే వినియోగించగలరని దాని లైసెన్స్ కూడా ఆషామాషీగా ఏమీ రాదని చెపుతున్నారు. రాధికా సెక్టార్ 57లో ఒక టెన్నిస్ అకడామీని కూడా నిర్వహిస్తోంది. ఈ అకాడమినీ, టెన్నిస్‌కు వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని దీపక్ రాధికపై ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు. ఇదేక్రమంలో ఇద్దరిమధ్య జరిగిన వాగ్వాదంలో కోపం పట్టలేక కాల్పులు జరిపినట్లు ఒప్పుకున్నాడు. అయితే కూతురు అంటే అమితమైన ప్రేమ. రెండులక్షల విలువైన టెన్నిస్ రాకెట్లు కూడా కొనితెచ్చాడు. ఆమె కోసం ఏదైనా చేసేందుకు వెనుకాడని దీపక్ స్వయంగా ఈపనికి ఎలా పాల్పడ్డారన్నది అంతుబట్టకుండా ఉంది. ఈ పరిణామాల క్రమంలోనే దీపక్ కూతురిపై కాల్పులు జరిపినట్లు తేలింది. ప్రస్తుతం 14రోజుల జ్యుడిషియల్ కస్టడీలో కొనసాగుతున్నాడు.

## పాకిస్థాన్ దాడుల్లో భారత్‌కు ఎలాంటి నష్టం జరగలేదు

### అందుకు ఒక్క ఆధారమైనా చూపాలి

### విదేశీ మీడియాకు సవాల్ విసిరిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, జులై 11:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాల్ విసిరారు. చెన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన దోవల్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తా సంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను దోవల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది, ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అత్యంత ఖచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ భారత్‌కు నష్టం జరి గినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానిం చారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్న గీతకూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య లను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్బర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని దోవల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్ -30 ఎంకెఐ యుద్ధవిమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు.
పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలి స్టిక్ క్షిపణులను భారత బలగాలు గగనతల రక్ష ణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థవం తంగా పేల్చివేశాయని తెలిపారు.

## కిట్టీపార్టీలతో కోట్లు కొల్లగొట్టిన మహిళ



**బెంగళూరు, జూలై 11:** బెంగళూరులో కిట్టీ పార్టీల పేరుతో ఓ మహిళ తన సోషల్ మీడియా స్నేహితులను రూ. 5 కోట్లు మోసం చేసింది. 49 ఏళ్ల సవిత అనే మహిళ బంగారు దిగుమతులు, అధిక రాబడి పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయమైన వల విసిరి తన స్నేహితుల నుండి రూ. 5 కోట్లకు పైగా మోసం చేసిందని ఆరోపణలు రావడంతో ఆమెను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, నగరంలోని బసవేశ్వరనగర్ ప్రాంతంలోని కిర్లోస్కర్ కాలనీకి చెందిన సవిత అనే ఈ మహిళ తన స్నేహితురాళ్లతో తరచూ కిట్టీ పార్టీలు నిర్వహించేది. ఈ పార్టీలలో ఆమె తాను విదేశాల నుంచి తక్కువ ధరకు బంగారం దిగుమతి చేసుకుంటా నని చెప్పేది. అంతేకాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే వారి డబ్బును రెట్టింపు చేస్తానని ఆకర్షణీయమైన పథకాలను వారికి వివరించేది. ఆమె మాటలను నమ్మిన చాలామంది మహిళలు పెద్ద మొత్తంలో డబ్బును సవితకు ఇచ్చారు. మొదట్లో కొందరికి కొద్ది మొత్తంలో లాభాలు కూడా చూపించడంతో ఆమె మాటలను అందరూ గుడ్డిగా నమ్మారు. అయితే, కొంతకాలం తర్వాత సవిత ఎవరికీ డబ్బు తిరిగి ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో సవిత చాలా మందిని ఇదే తరహాలో మోసం చేసిందని తేలింది. ఆమె కేవలం కిట్టీ పార్టీలలో పాల్గొనే మహిళలనే కాకుండా, తన ఇతర స్నేహితులు మరియు బంధువులను కూడా నమ్మించి మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, పోలీసులు సవితను మరియు ఈ మోసంలో ఆమెకు సహకరించిన మరొక వ్యక్తిని అరెస్టు చేశారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. పోలీసులు ప్రస్తుతం వారి నుండి మరింత సమాచారం రాబట్టే ప్రయత్నంలో ఉన్నారు. మోసపోయిన వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

### ప్రైవేట్‌రూమ్‌లో ఎమ్మెల్యే.. పక్కనే క్యాష్‌తో బ్యాగ్

## శివసేన వైరల్ చేసిన విడియో



**ముంబయి,జూలై 12:** మహారాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సత్ వివాదంలో చిక్కుకున్నారు. ఒక ప్రైవేటురూమ్‌లో ధూమపానంచేస్తూ హాఫ్ డ్రెస్‌లో ఉన్న ఆతడి విడియో బైటకివచ్చింది. అంతేకాకుండా అదే ప్రైవేటు రూమ్‌లో ఒక బ్యాగ్ నిండా క్యాష్ కూడా ఉందన్న ప్రచారం హోరెత్తింది. అంతకు ఒకరోజుముందే ఆయనకు ఆదాయపు పన్ను శాఖనోటీసులు జారీచేసారని చెప్పారు. తన ఆస్తులు ఒక్కసారిగా పెరగడంలో ఉన్న మూలాలు చెప్పాలని, 2019నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికలనాటికి ఆస్తులు భారీగా కూడబెట్టారని రాబడులకు మూలం చెప్పాలని ఐటిశాఖ నోటీసులు పంపించింది. థాకరే శివసేన నేత సంజయ్‌రౌత్ ఈ విడియోను పోస్టు చేసారు. అసహాయతకు చిరునామా ఫడ్నవిస్ అని ఆపోస్టుకు ట్యాగ్‌లైన్‌జోడించారు. ఇంకెలా ఎంతమంది కూటమిలో ఉన్నారో పాపం ఫడ్నవిస్ అని సానుభూతిని ప్రకటించారు. సామాజిక న్యాయశాఖమంత్రి సంజయ్ శిర్సత్ తన బెడ్‌కు పక్కనే ఉన్న బ్యాగ్‌నిండా దస్తులే ఉన్నాయని, రౌత్ చెపుతున్నట్లు క్యాష్‌లేదని అన్నారు. ఔరంగాబాద్ వెస్ట్‌స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శిర్సత్ డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే వర్గానికి ఎందినవారు. ఈ సోషల్‌మీడియా వైరల్‌కావడానికి ఒకరోజు ముందే ఆయనకు ఆదాయపుపన్నుశాఖ నోటీసులు జారీచేసిందని ఆయనే స్వయంగా ప్రకటించారు. తన వ్యక్తిగత ఆస్తులు గడచిన ఐదేళ్లలో ఒక్కసారిగా భారీ వృద్ధిని ఎలాసాధించాయో చెప్పాలంటే ఐటి నోటీసులు జారీచేసారు. కొందరు వ్యక్తులు ఆదాయపు పన్ను శాఖకు తనపై ఫిర్యాదులు చేసారని అందువల్లనే తనకు నోటీసు వచ్చిందని ఆయన అన్నారు. తానేమీ భయపడనని నోటీసులకు స్పందిస్తానని, అయితే కొంత గడువు కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తానేమీ తప్పులు చేయలేదని, సరైన స్పందనే ఇస్తానని శిర్సత్ చెప్పుకొచ్చారు.

## బీహార్ ఎన్నికలు హైజాక్‌కు బిజెపి కుట్ర

### ఒడిశాలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీ



**భువనేశ్వర్,జూలై 11:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వంలో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, బిజెపికి ప్రయోజనాలు చేకూర్చేందుకు పని చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐదుగురు పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందేకానీ నిరుపేద ప్రజల కోసం పనిచేయట్లేదు. జల్, జమీన్, జంగల్ (నీరు, భూమి, అడవి) ఎప్పటికీ గిరిజనులకు సొంతం. అటవీ హక్కు పట్టాలను గిరిజనులకు ఒడిశా ప్రభుత్వం ఇవ్వడం లేదు. పెసా, ట్రైబల్ బిల్లులను గిరిజనుల కోసం కాంగ్రెస్ తీసుకువచ్చింది. వాటిని అమలు చేసి గిరిజనుల భూమి వారికే దక్కేలా చేస్తాం. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం, గత పాలకులైన బిజెడి వారిలాగే ఒడిశాను దోచుకుంటున్నదని రాహుల్ గాంధీ, ఆరోపించారు. మేం ప్రభుత్వ సంస్థల్ని స్థాపిస్తే బిజెపి ప్రైవేటు పరం చేస్తోందని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు.

### యువ ప్రేమజంటపై గ్రామస్తుల కర్కశం

## నాగలికట్టి కొడుతూ పొలం దున్నించిన వైనం



**రాయగడ,(ఒడిశా), జూలై 11:** ప్రేమ వివాహం చేసుకున్న ఒక యువ జంటపై ఆగ్రామ పెద్దలు అమానుషంగా ప్రవర్తించారు. నాగలికి ఎద్దుల్లాగా కట్టి కర్రలతో కొడుతూ వాళ్లతో పొలం దున్నిస్తూ వారిని చితక బాదారు. ఆపై పాప పరిహారం అంటూ గుడిలోను చిత్రహింసలకు గురిచేసారు. ఇందుకు సంబంధించిన విడియో వైరల్ కావడంతో పోలీసులు రంగప్రవేశం చేసారు. రాయగడజిల్లాలోని కంజమజ్జిరా గ్రామంలో జరిగిన ఈసంఘటనలో గ్రామానికి చెందిన యువకుడు యువతి చాలాకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలను ఒప్పించి ఇటీవలే వివాహం చేసుకున్నారు. అయితే ఈ వివాహానికి ఊరిపెద్దలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేసారు. అయితే ఈ ఇద్దరూ వరుసకు బంధువులే అయినప్పటికీ గ్రామ ఆచారం ప్రకారం ఈ తరహా వివాహం అపచారమని చెపుతూ ఈ శిక్షను విధించారు. తొలుత వీళ్లతో పొలం దున్నడం పేరిట హింసించిన కొందరు ఆపై గుడికి తీసుకెళ్లి పాపపరిహారంపేరిట ప్రత్యేక పూజలు చేయించారు. ఈమొత్తం ఉదం తాన్ని గ్రామయువకులు విడియోతీసి సోషల్ మీడియాలో పోస్టుచేసారు. పోలీస్ సూపరిం టెండెంట్ ఎస్.స్వాతికుమార్ మాట్లాడుతూ శుక్రవారం ఒక బృందం గ్రామానికి వెళ్లిందని, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### వంతెన ప్రమాదంలో 20కి పెరిగిన మృతులు



**అహ్మదాబాద్, జూలై 11:** ఆనంద్‌జిల్లాలోని పద్రా తాలూకాలో మహిసాగర్‌నదిపై ఉన్న గంభీర వంతెన కూలిన సంఘటనలోమ ృతుల సంఖ్య 20కి పెరిగింది. ఈ ప్రమాదంలో ఐదునుంచి ఏడు వాహనాలు నదిలోకి పడిపోవడంతో నదిలో కొట్టుకునిపోయారు. ఇప్పటికీ ఇద్దరి ఆచూకీ తెలియడంలేదని సహాయక బృందాలు తెలిపాయి. ఇప్పటికే చనిపోయిన వారిగ్రామాల్లో విషాదఛాయలు కొనసాగుతున్నాయి. పార్టీల వారీగా ఈ సంఘటన రాజకీయ రంగుపులుముకుంది. అయితే పురజనులు మాత్రం పార్టీల వైఖరిని తూర్పారబడుతున్నారు. ప్రజాపనుల శాఖకు చెందిననలుగురు ఇంజినీర్లను ప్రాథమిక నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసారు. ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ స్వయంగా ప్రజాపనుల శాఖను నిర్వహిస్తున్నారు. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. 30రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసారు.

### కోయంబత్తూరు పేలుళ్ల ఉగ్రవాది 27యేళ్ల తరువాత పట్టివేత




**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** తమిళనాడులోని కోయంబత్తూరులో 1998లో జరిగిన పేలుళ్ల ఘటనలో నిందితుడుగా వున్న ఐఎస్ఐ ఉగ్రవాది 27ఏళ్ల తరువాత పోలీసులకు చిక్కాడు. నాటి ఘటనలో 58 మంది మరణించగా 250 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు. బిజెపి అగ్రనే తలు పాల్గొన్న ఈ సభను ఐఎస్ఐ ఉగ్రవాదులు టార్గెట్ చేయడంతో జరిగిన పేలుళ్లు దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ పేలుళ్ల కేసులో దాదా పు అందరు నిందితులు పట్టుబడగా సీరియల్ కిల్లర్‌గా పేరుగాంచిన సాదిక్ రాజా అలియాస్ టైలర్ రాజా (48)ను బెంగళూరులోని విజయపురలో తమిళనాడు ఉగ్రవాద వ్యతిరేక బృందం, కోయంబత్తూరు పోలీసులు, కర్ణాటక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి శుక్రవారం అరెస్టు చేశారు.

### హిందూస్థాన్ యూనిలీవర్‌కు తొలిసారి మహిళా సిఇఒగా ప్రియా నాయర్

**ముంబయి,జూలై 11:** హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్‌కు తొలిసారి మహిళ నాయకత్వం వహించబోతున్నారు. ప్రస్తుతం కంపెనీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియా నాయర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన విషయం తెలి సిందే. ఈ నియామకం ఆగస్టు 1 నుంచి అమ ల్లోకి రానున్నది. ప్రస్తుతం సీఈఓగా ఉన్న రోహిత్ జావా వ్యక్తిగత కారణాలరీత్యా జులై 31తో తనబాధ్యతల నుంచితప్పుకొంటున్నారు. ఆపై ప్రియా నాయర్ సంస్థను నడిపించనున్నారు. ఈ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారు. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి.

### హోటల్ సిబ్బందిని కొట్టిన ఎమ్మెల్యేపై కేసు నమోదు



**ముంబయి, జూలై 11:** మహారాష్ట్రలో శివసేన షిండేవర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కేసు నమోదైంది. ఓ హోటల్ కార్మికుడిపై దాడి కేసులో ముంబై పోలీసులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ముంబై చర్చిగేట్‌లోని ఎమ్మెల్యేల క్యాంటీన్‌లో తనకు వడ్డించిన ఆహారం రుచిగా లేదని, కుళ్లిపోయిందని ఆరోపిస్తూ క్యాంటిన్ కార్మికుడు, మేనేజర్, ఇతర సిబ్బందిపై పిడిగుద్దులు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ కాగా ఎమ్మెల్యే తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. మహారాష్ట్ర అసెంబ్లీ, విధాన సభలో ఈ అంశాన్నిప్రతిపక్షాలు, శివసేన (ఉద్ధవ్) వర్గం లేవనెత్తాయి. ఇక ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఎమ్మెల్యేపై పోలీసులు చర్యలు చేపట్టారు.

### పాక్‌లో పంజా విసిరిన బలోచ్ తిరుగుబాటుదారులు!

**ఇస్లామాబాద్, జూలై 11:** పాకిస్థాన్‌లో బలోచ్ రెబల్స్ చెలరేగిపోతున్నారు. తాజాగా దక్షిణ బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పలు వాహనాలపై దాడి చేసి తొమ్మిదిమందిని కాల్చి చంపారు. ముందుగా గురువారం సాయంత్రం పలు బస్సులను ఆపి వీరిని కిడ్నాప్‌చేశారు. తర్వాత సమీపంలోని పర్వతాల్లోకి వారిని తీసుకెళ్లి హత్య చేసినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. అర్థరాత్రి వారి మృతదేహాలు బయటపడినట్లు గవర్నమెంట్ అధికారి ఒకరు తెలిపారు.

# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం



## 2024-25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం

### కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం

### యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి

### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజి నీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండి యాలో నెక్స్ట్ జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్ మెంట్స్ ఇన్ కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్) అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం.

ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్‌సిసి) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్‌కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడ్డారు. కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవనం పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా పునర్వి నియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుంది అని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. భావితరాల కోసం కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం.

ఇందుకు నగరవాసులకు అందు బాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదా హరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమ తుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందిం చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు. కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బిఐఎస్)తో కలిసి పని చేస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జిఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మద, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మరో 18 దత్తత కేంద్రాలు

### రెండు బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

### ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు (ఎస్ఏఏఎస్), 2 బాలల సంరక్షణ కేంద్రాలు (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతి పాదనలు పూర్తి కాగా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆ ఫైల్‌పై శుక్రవారం నాడు సంతకం చేశారు. సీఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కి చేరనుంది. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాని తెలంగాణ ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసింది. అందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని నిరాశ్రయ పిల్లల భద్రతకు, దత్తత ప్రక్రియ పారదర్శకతకు మరింత బలాన్ని చేకూర్చనుంది.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు

## సంక్షేమానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

### మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు

**రంగారెడ్డి అర్బన్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాలు, సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో రూ. 12.70 కోట్లతో నిర్మించనున్న 30 పడకల ఆసుపత్రి భవనానికి, మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డునకు శంకుస్థాపన చేశారు. అంబేద్కర్, జ్యోతిరావుఫూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు, మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించిన మంత్రులు, స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబుల్‌లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. అనంతరం మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 281

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 11, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 67 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 58 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు 24, పౌర సరఫరాల శాఖకు 9, ఇందిరమ్మ ఇళ్ల కోసం 44 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియ జేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

## పురుగులమందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

**వర్గల్, జూలై 11, ప్రభాతవార్త:** పురుగులమందు తాగి తల్లీ, కూతురు ఆత్మ హత్యకు చేసుకున్న సంఘటన వర్గల్ మండలం గౌరారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన వెల్దుర్తి మంజునాథ్ భార్య వెల్దుర్తి కవిత(32) పుట్టుకతోనే దివ్యాంగురాలు కాగా అత్త వెల్దుర్తి భారతమ్మ(60) కొంతకాలంగా నరాలవ్యాధితో బాధపడుతున్నది. వారి బాగోగులను మంజునాథ్ చూసు కుంటున్నాడు. అయితే నెల రోజుల నుండి మంజునాథ్ పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7న చికిత్స నిమిత్తం మంజునాథ్ హైదరాబాద్‌కు వెళ్లగా మంజునాథ్‌కు ఏమైనా అయితే తమ బాగోగులు చూసుకునేవారు ఉండరని ఆందోళనతో మనస్తాపానికి గురై 10వ తేదీ గురువారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మంజునాథ్ హైదరాబాద్ నుండి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మంజునాథ్‌కు కూతురు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

## ప్రజల ఆదరణ పొందిన ఎల్ఐసి అమ్మకం తగదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఖండన

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం బంగారు బాతు వంటి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (ఎల్ఐసి)ని విక్రయించడాన్ని ఏఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ తీవ్రంగా ఖండించారు. 1965లో కేవలం 5 కోట్లతో ప్రారంభించిన ఎల్ఐసి అంచెలంచెలుగా 70 యేళ్ల కాలంలో లక్షల కోట్లు ఆదాయాన్ని, వ్యాపారాన్ని తన సొంతం చేసుకున్నదన్నారు. ఎల్ఐసి సేవలతో భారతదేశ ప్రజల మన్నలను పొందిందని, ఎల్ఐసి రంగంలో ప్రజలను ఆకర్షించి తన శక్తి మేరకు ప్రజలకు సేవ చేస్తున్నదని ఆయన వివరించారు. ఇలాంటి ఎల్ఐసిని దురాశపరులు, అవినీతి పరులు, అక్రమార్కులు, దోపిడీదారులు అయిన ప్రైవేటు వారికి ఎల్ఐసి వాటాలను అమ్మడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి వాటాల అమ్మకాల విరమించుకుంటే మంచిదని, లేకపోతే దేశవ్యాప్తంగా ఎల్ఐసి ఉద్యోగులు, వాటాదారులైన పాలసీదారులుగా ఉన్న ప్రజలు తిరగబడతారని వి.ఎస్.బోస్ హెచ్చరించారు.



అంబేద్కర విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## రిజర్వేషన్‌లపై ప్రభుత్వ నిర్ణయం బిసి బిడ్డలు, జాగృతి విజయం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లపై ఆర్డినెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఇది బిసి బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తాము ప్రజా ఉద్యమాల ద్వారా వత్తిడీ తీసుకురావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. తాను ఢిల్లీలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కాంగ్రెస్, బిజెపి పార్టీల వైఖరిని ఎండగట్టడం వల్లనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని, తాము రైల్‌రోకో కార్యక్రమాన్ని ప్రకటించగానే ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చిందని ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన రైల్‌రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని చెప్పారు. అయితే తమకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. శుక్రవారం బంజారా హిల్స్‌లోని కవిత నివాసం నుంచి ఆనేక మంది జాగృతి కార్యకర్తలు ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో న్యాయస్థానంలో ఏలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి రిజర్వేషన్‌ల చుట్టు రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నదని, అనుకుంటే ఒకే నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదన్నారు. బిసి బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.

## బిసి రిజర్వేషన్లపై 'ఆర్డినెన్స్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** కేబినెట్ సమావేశంలో బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లా డుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని గత 18 నెలలుగా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన, ఇది ముమ్మాటికి బీసీల విజయంగా భావిస్తున్నామన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మొదటగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగనన చేపట్టాలని, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశామని తమ డిమాండ్‌ను గౌరవించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును రాష్ట్ర గవర్నర్ ద్వారా గత ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రపతికి పంపించడం జరిగిందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన బిల్లు జూలై 11 నాటికి మూడు నెలలు పూర్తయిందని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ల విషయంలో కనీసం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 11:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు కలిశారు.

## కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలు తెలంగాణ, యుపి

### ఉత్తరప్రదేశ్ ఎంఎస్ఎంఇ, ఖాదీ, గ్రామీణ, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పరిశ్రమల మంత్రి రాకేష్‌సచన్

### ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో యుపిఐటిఎస్-2025పై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 11, ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు పరిశ్రమలు, ఐటి, హ్యాండీక్రాఫ్ట్స్, ఫార్మా తదితర రంగాలు, కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలని, ఈ రెండు రాష్ట్రాలు కలిస్తే అనేక సామాన్యతలతో ఎన్నో అద్భుతాలు సంభవిస్తాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు, సిరికల్చర్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి రాకేష్ సచన్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, భారత ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సంయుక్త నిర్వ హణలో సెప్టెంబరు 25 నుండి 29వరకు జాతీయ అంతర్జా తీయస్థాయిలో 5రోజుల పాటు ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్, గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో-2025 (యుపిఐటిఎస్)పై అవగాహన పెంపొందించడమే, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆయా పారిశ్రామిక వాణిజ్య సంస్థలను ఆహ్వా నించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐ, సురానా ఆడిటోరియంలో శుక్ర వారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి రాకేష్ సచన్‌పాటు గౌరవ అతిథులుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ అదనపు కమిషనర్ రాజ్‌కమల్ యాదవ్ ఐఎఎస్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్, ఎఫ్‌టిసిసిఐ సీనియర్ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సిఈఓ సుదీప్ సర్కార్‌లు పాల్గొన్నారు. మంత్రి రాకేష్ సచన్ మాట్లాడుతూ దేశంలో మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యుపిఐటిఎస్ అంతర్జాతీయ ట్రేడ్‌షో నిర్వహిస్తున్న తొలిరాష్ట్రం ఉత్తరప్రదేశ్ అన్నారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఈ ట్రేడ్‌షోకై రోడ్‌షో కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీ తర్వాత రెండవది హైదరాబాద్‌లో నిర్వహి స్తున్నట్లు, దేశవ్యాప్తంగా పరిచయం చేయడం లక్ష్యంగా సాగుతున్నామని చెప్పారు. యుపిఐటిఎస్ ప్లాట్ ఫామ్ ద్వారా ఓడిఓపి ఉత్పత్తులు, హ్యాండ్లూమ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవిలు, రిన్యూవబుల్ ఎనర్జీ వంటి పలురంగాలలో ఉన్న సామర్థ్యాన్ని ప్రదర్శి స్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఉత్పత్తి, విమాన, రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు, శాంతి భద్రతల పరిరక్షణ, అన్ని రంగాలకు ప్రభుత్వ ఇతోధిక ప్రోత్సాహం తోడుగా నిలు స్తుందని, ఈ ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన వాణిజ్య వ్యాపారసంస్థలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. చివరిగా దేశ విదేశాల్లో భారతదేశ గొప్పదనం, ప్రాముఖ్యతను చాటుదామని పిలుపునిచ్చారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రాకేష్ సచన్, రాజ్‌కమల్ యాదవ్, సురేష్‌కుమార్ సింఘాల్, రవికుమార్, సుదీప్‌సర్కార్

## గ్రేటర్‌లో ఇళ్ల నిర్మాణదారులకు తీపికబురు

### అందుబాటులోకి నాలుగు ఇసుక రీచ్‌లు

### ఇక కొరత ఉండదంటున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఇసుక కొరత తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిఎస్ఎం డిసి) కొత్తగా నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించింది. సన్న ఇసుక టన్ను రూ. 1800, దొడ్డు ఇసుక రూ. 1600 చొప్పున విక్రయిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని వట్టినాగులపల్లి, అబ్దుల్లాపూర్ మెట్, ఆదిభట్ల, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో ఇవి అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి ఇసుక వస్తుండగా.. వర్షాకాల కొరతను ఈ బజార్లు తీరుస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే వారికి నిజంగా ఇది శుభవార్తే. ఇసుక కొరతను తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిఎస్ఎండిసి) కీలక చర్యలు చేపట్టింది. భారీ నిర్మాణదారులకు, వ్యక్తిగత వినియోగదారులకు ఇసుకను సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు నాలుగు కొత్త ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. ఇది నిర్మాణ రంగంలో ఎదురవుతున్న ఇసుక కొరత సమస్యకు ఒక పరిష్కారంగా మారనుందని అధికారులు తెలిపారు.

ఈ నూతన ఇసుక బజార్లలో సన్న ఇసుకను టన్ను రూ. 1800కు, దొడ్డు ఇసుకను రూ. 1600కు విక్రయిస్తున్నట్లు గిళీలీదిది ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఇసుక బజార్లు రంగారెడ్డి జిల్లాలోని వట్టి నాగులపల్లి, అబ్దుల్లా పూర్‌మెట్, ఆదిభట్ల, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో అందుబాటులో ఉన్నాయి. ఈ అన్ని ఇసుక బజార్లలో నాణ్యమైన నదీ ఇసుక సరిపడా నిల్వ ఉందని, వ్యక్తిగత వినియోగదారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల అవసరాలను తీర్చగలిగేలా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో హైదరాబాద్ నగరంలో పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత నిర్మాణ రంగంలో పెద్ద సమస్యగా మారింది. ఇసుక సరఫరాలో జాప్యం, అధిక ధరలు, అక్రమ రవాణా వంటి సమస్యల వల్ల నిర్మాణ ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయి. దీనివల్ల నిర్మాణ వ్యయం పెరిగి, వినియోగదారులపై భారం పడుతోంది. నగరానికి ఇసుక ప్రధానంగా కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి వస్తుంది. వర్షాకాలంలో నదీ రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోవడం కూడా కొరతకు ఒక కారణం. ఈ నేపథ్యంలో ఇసుక బజార్ల ఏర్పాటు నిర్మాణ రంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుం దని అధికారులు భావిస్తున్నారు.

వినియోగ దారులు టిఎస్ఎండిసి సాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం విని యోగదారులు టిఎస్ఎండిసి, హెల్ప్‌లైన్ నంబర్ 155242ను సంప్రదించవచ్చు.. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు, నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇది ఇసుక లభ్యతను మెరుగుపరచి, నిర్మాణ రంగానికి ఊతమిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

## ఇది బిసిల పోరాట విజయం

### రిజర్వేషన్‌లకు ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటించడం అభినందనీయం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఆర్డినెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం ఇది బిసిల పోరాట విజయమని, ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పలు బిసి సంఘాల నేతలు అభినం దనలు తెలిపారు. బిసిలు ఎన్నో సంవత్సరాలుగా రిజర్వేషన్‌లు పెంచాలని పోరాటాలు చేస్తున్నారని, గత మార్చి నెలలో ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును జారీ చేసినప్పుడే జివో జారీ చేసి ఎన్నికలు నోటిఫికేషన్ జారీ చేసి ఉంటే ఇప్పటికే ఎన్నికలు జరిగిఉండేవని చెప్పారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఇక ముందు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు జరిగేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. బిసిలకు వ్యతిరేకంగా కోర్టులకు ఎవరూ వెళ్లరని, రిజర్వే షన్‌లు పెంచు కోవడానికి న్యాయ పరమైన, చట్టపరమైన, రాజ్యాంగ పరమైన అవరోధాలు ఏమి లేవని స్పష్టం చేశారు. బిసిలందరూ ఈ 42 శాతం రిజర్వేషన్‌లను కాపాడు కోవడానికి ఐక్యంగా ఉండాలని, వీటిని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. బిసిలకు ప్రజాస్వామ్యంగా, రాజ్యాంగంబద్ధమైన వాటా రాకుండా 76 సంవత్సరాలుగా అన్యాయం జరిగిందని, కనీసం స్థానిక సంస్థల్లో బిసిలకు వాటా ఇస్తుంటే కొంత మంది ఓర్వలేకపోతున్నారని, ఇది న్యాయం కాదన్నారు. సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేష్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, అనంత య్య, అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యతను చాటుతున్న బిసి సంఘాల నేతలు

## హిందూమతంపై భక్తి, చిత్తశుద్ధి ఉన్నవారికే ఉద్యోగాలు కల్పించాలి

### తిరుమలలో కేంద్రమంత్రి బండి సంజయ్

**తిరుమల,జూలై 11(ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేని, అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టిటిడి పాలకమండలి వెంటనే వారందరినీ బయటకు సాగనంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన ఆయన ఒకరిని తొలగిస్తే సరిపోదని, అన్యమత ఉద్యోగులందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని టిటిడికి అల్టిమేటమ్ ఇచ్చారు. టిటిడిలో ఉన్న అన్యమతస్తులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.శ్రీవారి సేవలో నిజమైన భక్తి,నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. అన్ని మతాల వారిని ఆదరించడానికి టిటిడి సిద్ధం కాదని కేంద్రమంత్రి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టిటిడి ఒక్కరి ఆస్తి కాదని,హిందువులు అందరిదీ అని అన్నారు. సనాతన ధర్మంకోసం అందరూ ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోపాటు పురాతన ఆలయాలను టిటిడి అభివృద్ధిచేయాలని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి హోదాలో పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. పుట్టినరోజున శ్రీవారి దర్శనం తో మనసు సంతోషం వ్యక్తం చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రి వెంట బిజెపి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, డిప్యూటీ ఇఇ. భాస్కర్ ఉన్నారు.



## దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం వికలాంగుల పెన్షన్ 6000, ఇతర ఆసరా పెన్షన్లు 4000, కండరాల క్షీణత వికలాంగులకు 15000/లు వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణమాదిగ అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి మందకృష్ణ ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్నికల హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ ఆదేశాలు జారీ చేయాన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలలో చట్ట ప్రకారం క్యాడర్ స్ట్రేంత్ ప్రకారం4 శాతం ఉద్యోగాల భర్తీ చేసి వికలాంగుల రోస్టర్ సంఖ్యను 10లోపు సవరించాలన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎందుకు మాట్లాడటం లేదు?

### భద్రాచలం దేవస్థానం భూముల వ్యవహారంపై కెటిఆర్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 11:** భద్రాచలం రామ చంద్రస్వామి దేవస్థానం భూముల వ్యవహారంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి రామయ్య భూములు కబ్జా అయితే బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 889 ఎకరాల భూమి ఆంధ్రప్రదేశ్‌లో కబ్జా అయినా బీజేపీ నుంచి ఒక్క మాటా లేదని మండిపడ్డారు. ఈ అంశంలో మాట్లాడడానికి బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావుకు సమయం లేదా.. లేక కేవలం రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవడం కోసమే మౌనంగా ఉంటున్నారా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ పొత్తులు పక్కన పెట్టి భద్రాచలం దేవస్థానం భూములను కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. దేవస్థానం భూముల వ్యవహారంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా చూడాలంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## కల్లు దుకాణ నిర్వాహకులపై గట్టినిఘా పెట్టండి

### ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్

**హైదరఆబాద్, జూలై 11, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ యంత్రాంగం కల్లు నిర్వాహకులపై గట్టి నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్ అదేశించారు.శుక్రవారం సాయంత్రం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లతో పలు అంశాలపై కమిషనర్ సమీక్షా నిర్వహించారు.కల్తీ కల్లు కంపౌండుల నిర్వాహణ, కల్లును వినియోగం, అమ్మకాల్లో జరుగుతున్న తప్పిదాలపై ఎప్పటి కప్పుడు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని అదేశించారు.కల్లు కంపౌండులపై ఎక్సైజ్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతోఇబ్బందులు ఏర్పడడంతో బాలనగర్ ఎస్‌హెచ్‌ఓ పై సస్పెండ్ వేటు వేయాల్సి వచ్చిందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అన్ని జి ల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు.అన్ని జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణపై ఉక్కుపాదం మోపాలని, నాటుసారా అనేది ఎక్కడ కనిపించకుండా ఉండాలన్నారు.జి ల్లాలో ఎక్సైజ్ క్రైమ్‌పై కూడ అధికారులతో కమిషనర్ సమీక్షా నిర్వహించారు. యంత్రాంగం దాడులను ముమ్మరం చేసి నాటు సారాను, కల్తీ కల్లును అరికట్టాలని సూచించారు.కొత్తగా ఏర్పాటు అయ్యే 14 ఎక్సైజ్ స్టేషన్లకు అవసరమైన భవనాలు,అద్దెభవనాలు సమకూర్చు కోవాలని సూచించారు. కానిస్టేబుల్స్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ ప్రమోషన్ల కొరకు జోన్లవారిగా జాబితాలను సిద్ధం చేసుకొని ప్రమోషన్లు ఇవ్వాలని ఆదేశించారు.

## అల్జీమర్స్‌కు 'ఎల్వీయే సర్జరీ'పై చైనా బ్యాన్!

**బీజింగ్, జూలై 22:** అల్జీమర్స్ వ్యాధికి చైనాలో అమలులో ఉన్న ఎల్వీయే సర్జరీవిదానంపై చైనా నిషేధం ప్రకటించింది. అన్నిరాష్ట్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు విచ్చలవిడిగా చికిత్సలుచేయడం ప్రారంభించాయి. దీనిపైఫోకస్‌పెంచిన జిన్‌పింగ్‌ప్రభుత్వం ఎల్వీయే సర్జరీపై నిషేధం విధించింది. ఈ విధానం సురక్షితం, సమర్థతకు సంబంధించి ఆధారాలులేవని వెల్లడించింది. దీనితో నాలుగేళ్లుగా సుమారు 400 ఆసుపత్రుల్లో చేపట్టిన శస్త్రచికిత్స విధానానికి బ్రేక్‌వడినట్లయింది.



ఝిజియాంగ్‌ప్రావిన్స్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి చెందినొక మైక్రోసర్జరీ నిపుణులు అల్జీమర్స్‌కు 2021లో తొలిసారి 'లింఫాటిక్ వేనస్ అనస్టోమోసిస్' విధానంలో చికిత్సచేసాడు. తర్వాత ఏడాదిలోనే ప్రాచుర్యంలో కి వచ్చింది. నాలుగేళ్లలో 382 ఆసుపత్రుల్లో చికిత్సచేసారు. 60-80శాతం రోగుల్లో సమర్థవంతంగాపనిచేసిందని వైద్యులుచెప్పిన విడియోలు వైరల్ అయ్యాయి. దీనిపై నిపుణులు ఆందోళన వ్యక్తంచేయడంతోప్రభుత్వం దృష్టిసారించింది. చైనా నేషనల్‌హెల్త్‌కమిషన్ ఈ చికిత్సవిధానాన్ని విశ్లేషించామని, సమర్థతకు సంబంధించి ఎలాంటి ఆధారాలులేవని వెల్లడించింది. ఈ చికిత్సను నిలిపివేయాలని స్థానిక వైద్యాధికారులకు ఆదేశాలు జారీచేసింది. అల్జీమర్స్ అనేది నాడీ క్షీణత రుగ్మత, క్రమంగా జ్ఞాపకశక్తిని ఆలోచన, అభ్యాసన సామర్థ్యాన్ని నిర్వహణ నైపుణ్యాలను కోల్పోవడం వంటి లక్షణాలుంటాయి. దీనికి చికిత్సలేదు.కొన్నిరకాలమందులతో వ్యాధి లక్షణాలను అదుపులో

# భూతాపాన్ని తగ్గించేందుకు త్రిముఖ వ్యూహం

### అడవుల పెంపకానికి చర్యలు

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** పెరుగుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో భూ తాపాన్ని తగ్గించేందుకు త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపునిచ్చారు. బ్యూరో అఫ్ ఎనర్జీ, ఈఈఎస్‌ఎల్ సీనియర్ అధికారులు హైదరాబాద్‌లో శక్రవారం గవర్నర్‌ను కలిసి ఇంధన సామర్థ్య రంగంలో కీలక పరిణామాలపై వివరించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విధానం ఆర్థిక, పర్యావరణంతోపాటు సమాజానికి గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని నొక్కి చెప్పారు. వాతావరణ చర్యలపై ప్రపంచ సమాజాన్ని ఏకం చేసే దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రయత్నాలకు సహకరించాలన్నారు. ఇందులో భాగంగా పలు కీలక రంగాలలో సమన్వయంతో కూడిన ప్రయత్నాల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. అన్ని విభాగాల ప్రత్యక్ష ప్రమేయం పునరుత్పాదక విద్యుత్‌ని ప్రోత్సహించడం, ఇంధన సామర్థ్య చర్యలను వేగవంతం చేయడంలో విద్యుత్, రవాణా, భవనాలు, గ్రామీణ మరియు పట్టణాభివృద్ధి, పరిశ్రమలు మరియు చిన్న మరియు మధ్య తరహా సంస్థలు సహా అన్ని సంబంధిత విభాగాల ప్రమేయం అవసరమని పేర్కొన్నారు. వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడంలో ఇంధన సామర్థ్యం మాత్రమే 40 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈరంగంలో ప్రపంచ ఉత్తమ పద్ధతులతోపాటు క్లీన్ టెక్నాలజీలను అమలు చేయడంలో పూర్తిస్థాయి మద్దతు ఇచ్చినందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ), ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్), పర్యావరణ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖల సమిష్టి ప్రయత్నాలు చేస్తున్నాయని సోలార్ ఎనర్జీని వినియోగించడంలో మహిళలను భాగస్వామ్యం చేయడానికి తెలంగాణ ప్రభుత్వ చొరవలను ప్రస్తావించారు.



## కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది

### 14న జరిగే సిఎం సభను విజయవంతం చేయాలి

### మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్



**తిరుమలగిరి, జూలై 11, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈనెల 14న జరిగే సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం నాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 14 న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడానికి సభ పెట్టడం ఇదొక చారిత్రాత్మక కార్యక్రమం అని పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, మంత్రి వర్గం లో అన్ని వర్గాలకు అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించ్చిని అందులో భాగంగానే అడ్లూరి లక్ష్మణ్ కు మంత్రి పదవి ఇచ్చిందని చెప్పారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని సంక్షేమ శాఖ నిధులు లక్ష్మణ్ వద్దనే ఉన్నాయని చెప్పారు. ఆయన ఇప్పుడు మన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మంత్రిగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. మన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి యువజన నాయకులు గా పార్లమెంటులో సమస్యల పైన పోరాడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మందుల సామేలు గురించి నాకంటే మీకే బాగా తెలుసని తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తన జీవితాన్నిప్రజలకోసమే పనిచేస్తున్నారని చెప్పారు. శంకర్ నాయక్ ను ఎమ్మెల్సీ చేయమని ఎవరు అడగలేదు కాంగ్రెస్ పార్టీ చేస్నిదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తాటిపాముల గ్రామంలో పుట్టి పెరిగిన, నేను ప్రజాప్రతినిధిగా కోదాడ హుజూర్నగర్ లోని ఉంటున్నానని, తుంగతుర్తిలో రెండు గ్రూపులు ఉన్నాయని నేను వచ్చి మరో గ్రూపు కట్టడం బాగుండదని రావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇంత అభివృద్ధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏనాడు జరగలేదని, బిఆర్ఎస్ పార్టీ ఉన్న పదేళ్లలో ఏనాడు జరగలేదని, ఈనాడు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎన్నికలల్లో 42 శాతం చేయాలని ఇచ్చిన మాట నిలబెట్టుకొని క్యాబినెట్లో తీర్మానం చేసి లోకల్ బాడీ ఎలక్షన్స్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ తో ఎలక్షన్స్ జరుగుతాయని చెప్పారు. బీసీల కులగనన స్వాతంత్రం తరువాత ఇప్పుడు జరిగిందని, బీసీ కులగనన ర్నాష్టలో మొదటిసారి బీసీ కుల గణన చేయడమే కాకుండా, బీసీలకు వెనుకబడిన తరగతులకు 42!! రిజర్వేషన్ ఏర్పాటు చేసే చట్టం తీసుకొచ్చి క్యాబినెట్ లో తీర్మానం చేశామని, దానికి నేనే చైర్మన్ గా ఉండి ఆర్డినెన్స్ చేశామని, ఆయన చెప్పారు స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం రిజర్వేషన్ తోనే ముందుకు వెళ్తమన్నారు. బీసీల కులగల 100 సంవత్సరాల తర్వాత చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం గాని ఆయన చెప్పారు 1,4, 0000 ఎనిమినేటర్లతో కులగనన చేయించామని ఆయన అన్నారు గతంలో బ్రిటిష్ వాళ్ళు చేసిన కులగలనే తప్ప మిగతా వాళ్ళు ఎవరూ చేయలేదని తమ ప్రభుత్వమే ఈ కులగలను చేసిందని చెప్పారు మందితోఎస్సీ కేటగిరి కొన్ని దశాబ్దాల పాటు వర్గీకరణ చేయలేదని, తానే చైర్మన్ గా ఉండి క్యాబినెట్ ద్వారా ఎస్సీ వర్గీకరణ జరిగిందని చెప్పారు. సన్న బియ్యం కార్యక్రమం హుజూర్నగర్ లో మొదలుపెట్టి రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమం తుంగతుర్తి నుండి మొదలు పెడుతున్నామని తెలిపారు. తాను సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గా ఉన్న, ఈసారి మంత్రిగా ఉన్న నాకు ఎక్కువ సంతోషం సంతృప్తి ఇచ్చిన విషయం జనానికి అందరికీ సన్నబియ్యం ఇవ్వడం అర్హులైన వాళ్లందరికీ కూడా రేషన్ కార్డులు ఇవ్వడం ఇంతకంటే గొప్ప కార్యక్రమం ఏముంటుందని చెప్పారు.

## ప్రభాకర్‌రావు మధ్యంతర బెయిల్ రద్దు కోసం సుప్రీంకోర్టులో పిటిషన్

### ఢిల్లీలో మకాం వేసిన సిట్ అధికారులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయించేందుకు సిట్ అధికారులు ప్రయత్నాలు వేగవంతం చేశారు. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టులో ప్రత్యేకంగా ఒక పిటిషన్ వేసేందుకోసం సిట్‌కు నాయకత్వం వహిస్తున్న పశ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్, జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి మూడు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడుగా వున్న ప్రభాకర్ రావును ఆగస్టు ఐదవ తేదీ వరకు అరెస్టు చేయరాదని సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం తెలిసిందే. అంతకు ముందు నాంపల్లి కోర్టుతో పాటు హైకోర్టులోనూ ప్రభాకర్ రావుకు చుక్కెదురవడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించి మధ్యంతర బెయిల్ పొందడం విదితమే. దీని తరువాతే ఆయన అమెరికా నుంచి భారత్‌కు వచ్చారు. అనంతరం ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలుమార్లు విచారణకు హాజరయ్యారు. అయితే పోలీసుల విచారణలో ప్రభాకర్ రావు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో పాటు ఎదురు ప్రశ్నలు వేస్తుండడం సిట్ అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. ఫోన్ ట్యాపింగ్ గురించి అప్పట్లో డిజిపిలు, నిఘా విభాగం బాస్‌లుగా వున్న వారికి తెలుసునని, వారి ఆదేశాల మేరకే తాను ఇదంతా చేశారని ప్రభాకర్ రావు మొదట్లో అంగీకరించి ఆ తరువాత ఇందులో తనకెలాంటి సంబంధం లేదని, ఒకవేళ వుంటే ఆధారాలు చూపాలని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఇప్పటికే అరెస్టయిన నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలంలోని వివరాలను ముందుంచి ప్రశ్నించినా ప్రభాకర్ రావు ఇదంతా అబద్ధం అంటూ బుకాయించారు. దీంతో ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే తప్ప ఫోన్ ట్యాపింగ్‌లో అసలు నిజాలు, అసలైన దోషులు ఎవరనేది తెలిసే అవకాశం లేదని సిట్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే ప్రభాకర్ రావుకు అరెస్టు నుంచి సుప్రీం కోర్టు రక్షణ వుండడంతో దీనిని రద్దు చేయించేందుకు సిట్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి సుప్రీం కోర్టులో ప్రత్యేకంగా పిటిషన్ వేసేందుకు పశ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్, జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి ఢిల్లీ వెళ్లారు. వీరి వెంట సీనియర్ న్యాయవాదులు కూడా వెళ్లారు. ప్రభాకర్ రావు మధ్యంతర బెయిల్ రద్దు కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడంతో పాటు దీనికి సంబంధించిన ఉత్తర్వులు పొందేందుకు సుప్రీం కోర్టుకు చెందిన సీనియర్ న్యాయవాదులతో సిట్ అధికారులు ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ పిటిషన్ దాఖలయ్యే వీలుంది.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తవుతుందని ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హామీల అమలులో కొంతమేరకు మాత్రమే చేసినట్లు చూపిస్తూ పూర్తిస్థాయి అమలు తీరును వదిలేయడం మంచిది కాదన్నారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, కొన్ని హామీల అమలును మొదలుపెట్టి మిగతావన్నీ నిర్లక్ష్యం చేయడం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అలవాటైపోయిన వ్యవహారంగా మారిపోయిందన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకటించి బిసిలను ఉద్ధరిస్తాం, న్యాయం చేస్తాం, ప్రతి బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు కేటాయిస్తాం అంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యని ప్రత్యేకంగా ఆహ్వానించి, గొప్ప మాటలు చెప్పాం న్నారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఘనంగా హామీ ఇచ్చారు. తెలంగాణను దేశానికి ఒక ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, రాజకీయ ప్రయోగశాలగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చర్చల్లోకి తెచ్చిందన్నారు. ఈ నమ్మకంతో బిసి వర్గాలన్నీ విశ్వాసపూర్వకంగా ఓటేసి కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించాయి. రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినపుడు ప్రజలకు వివరణ ఇచ్చామని, రాజీనామ అంశం పూర్తిగా కేంద్ర పార్టీ పరిధిలోకి వస్తుందన్నారు.

**రాజాసింగ్‌తో పార్టీకి, కార్యకర్తలకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవు: రాణి రుద్రమ**

బిజెపి జాతీయ నాయకత్వం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను ఆమోదిస్తూ లేఖను పంపిందని అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాజాసింగ్ పట్ల భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని అన్నారు. కేవలం క్రమశిక్షణా రాహిత్యం కారణంగా బిజెపి ఈ రాజీనామాను ఆమోదించిందని తెలిపారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జూన్ 30వ తేదీన బిజెపి సభ్యత్వానికి రాజీనామా చేశారని, అయితే, ఆయన శాసనసభ్యుడిగా ఉన్న నేపథ్యంలో రాజాసింగ్ రాజీనామా లేఖను అప్పటి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి జాతీయ పార్టీకి పంపించారన్నారు.

## ప్రతి మండలానికి 46 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

### ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఓ

### 27న అర్హతపరీక్ష.. ఐదు నక్షాగ్రామాల్లో రీసర్వే పూర్తి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతంచేసి భూ సమస్యలపై సామాన్యులకు మెరుగైన సేవలందించడానికి వీలుగా సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి జీపీవో,ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి4 నుంచి 6మంది వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ..ఇందుకు సంబంధించి ఈనెల 27న శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని ఆ తర్వాత 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని, ఆగస్టు 12వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని తెలిపారు.భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావలన్న లక్ష్యంతో లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని ఇందులో తొలివిడతలో 7వేల మందికి 33 కేంద్రాల్లో మే 26వ తేదీనుంచి శిక్షణ ప్రారంభించామని ఈనెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తవుతుందని తెలిపారు.మిగిలిన 3వేల మందికి ఆగస్టు 2వ వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు.రెవెన్యూ,సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని, సర్వేవిభాగం బలోపేతంతో రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగు తామని దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్థన మేరకు ఈనెల 27న మరోసారి వీరికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలలో ప్రయోగాత్మకంగా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

## సాంగింగ్ బౌద్ధాశ్రమంపై వైమానిక దాడి

### 23 మంది మృతి, 30 మందికి గాయాలు

**మాండలే(మైన్మార్), జూలై 11:** మయన్మార్‌లోని సెంట్రల్ సాగింగ్ ప్రాంతంలోని బౌద్ధ ఆశ్రమంపై జరిగిన వైమానిక దాడిలో 23 మంది మరణించారు. మరో 30 మంది గాయపడగా, వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సాగింగ్ టౌన్‌షిప్‌లోని లిన్ టాలు గ్రామంలోని ఒక ఆశ్రమ భవనంపై తెల్లవారుజామున 1 గంటల ప్రాంతంలో జెట్ ఫైటర్ బాంబు దాడి చేసింది. ఈ ప్రమాదంలో నలుగురు పిల్లలు సహా 23 మంది పౌరులు మరణించారు. దేశంలోనే రెండో అతిపెద్ద నగరమైన మాండలేకు వాయువ్యంగా 35 కిలోమీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. అయితే ఆశ్రమంపై జరిగిన దాడిపై సైన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. మయన్మార్‌లో ఆంగ్ సాన్ సూచీ ప్రభుత్వాన్ని 2021 ఫిబ్రవరిలో కూలదోసి అధికార పగ్గాలు చేపట్టింది సైన్యం. నాటి నుంచి ఆ దేశం రాజకీయ కల్లోలాలతో అంతర్యుద్ధం సాగుతుంది. శాంతియుత ప్రదర్శనలను అణచివేయడంతో సైనిక పాలనను వ్యతిరేకించే చాలా మంది ఆయుధాలను అందుకున్నారు. దీంతో ఇప్పుడు దేశంలోని చాలా ప్రాంతాల్లో ఘర్షణలు నెలకొన్నాయి. ముఖ్యంగా అల్పసంఖ్యాకులు నివసించే సరిహద్దు ప్రాంతాలు రావణకాష్టంలా రగులుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఈ సాయుధ ప్రతిఘటనకు బలమైన కోటగా సాగింగ్ ఉంది. ఈ ప్రాంతంలో సాయుధ దళాలను ఎదుర్కోవడానికి సైన్యం వైమానిక దాడులను ఎక్కువగా ఉపయోగించింది. ఈ క్రమంలోనే సమీపం ప్రాంతంలోని గ్రామాలాకు చెందిన 150 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు.



## దేశానికి తలవంపులు తెచ్చేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గులాంలా వ్యవహారం

### చంద్రబాబు ఓవర్‌యాక్షన్ వల్లే బనకచర్ల వివాదం

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

### కాళేశ్వరం, బనకచర్లపై కెసిఆర్ అసెంబ్లీలో చర్చించాలి

### రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** దేశానికి తలవంపులు తెచ్చేలా ప్రధాని నరేంద్ర మోడి వ్యవహరిస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి గులాం లాగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. ఇజ్రాయిల్ మద్ధతు ఇవ్వాలని, పాకిస్తాన్ టెర్రరిస్టులను ఎగదొస్తున్న అడ్డుకోవద్దని ట్రంప్ చేస్తున్న ఒత్తిళ్లకు మోడీ తలొగ్గారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనపక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేణి శంకర్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఎం బాల్ నర్సింగ్‌తో కలిసి నారాయణ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక దేశం సంక్షోభంలో పడిందన్నారు. బ్యాంకులను లూటిచేసిన 28 మంది ఫారిన్‌లో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా, ఇరాన్ తక్కువ ధరకు ఆయిల్ విక్రయిస్తామంటే కొనుగోలు చేయనివ్వడం లేదన్నారు. పాడిచ్చేరి ప్రభుత్వం బిజెపికి అనుకూలంగా ఉన్నా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అక్కడ ముఖ్యమంత్రికి కనీసం క్లర్క్‌ని కూడా బదలీ చేసే అధికారం లేదన్నారు. తమిళనాడు, కేరళలో గవర్నర్లు కేబినెట్ నిర్ణయాలను అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తమ తాబేదర్ల ప్రభుత్వం ఉండాలి తప్ప ఇతరులు ఉండొద్దనే విధంగా కేంద్ర ప్రభుత్వ తీరు ఉందన్నారు. వాళ్ల చెప్పిన వాళ్లే ఓట్లు వేసేవిధంగా బిహార్‌లో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బిజెపి పప్పేట్‌గా మారిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓవర్ యాక్షన్ వల్లే బనకచర్ల వివాదం తలెత్తిందని నారాయణ అన్నారు. రూ.8 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టారని, అది పూర్తయ్యే నాటికి రూ.2 లక్షల కోట్ల వ్యయం అవుతుం దన్నారు. ఈ ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి మీ భావాలు అక్కడ చెప్పాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సూచించారు. బిఆర్ఎస్ స్కూల్ నడుపుతుందని, ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలు తామే పడింతుల మన్నట్లుగా విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.

## వైద్య, ఆరోగ్య శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

### 20 నుంచి 27 వరకు అవకాశం

హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్తః తెలంగాణ రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా డిఎంఈ అధ్వర్యంలో కొనసాగుతున్న సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగిస్తున్నట్టు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ శుక్రవారం వెబ్ నోటిస్ జారీ చేశారు. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ నంబర్ 03/2025ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఆసక్తి గల అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించిన బోర్డు.. దరఖాస్తులను జూలై 10 నుంచి స్వీకరించబోతున్నట్టు వెల్లడించింది. అయితే దరఖాస్తులను ఈ నెల 20 నుంచి స్వీకరించనున్నట్టు తెలిపిన బోర్డు గడువును కాస్త 27 వరకు పొడిగించినట్టు తెలిపింది. జూలై 27 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. అభ్యర్థులు వారి దరఖాస్తులను జూలై 28, 29 తేదిల్లో ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు వేర్వేరుగా ఒక్కో పోస్టుకు దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో మల్టీ జోన్-1లో 379 పోస్టులు ఉండగా.. మల్టీ జోన్-2లో 228 పోస్టులు ఉన్నాయి. పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ జీతం యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యుజిసి) నిబంధనల మేరకు రూ.68,900 నుంచి రూ.2,05,500 ఉంటుందని నోటిఫికేషన్‌లో బోర్డు ప్రకటించింది.

# తెర



## పెళ్లంటే భయమేస్తోంది

పెళ్లి చేసుకోవాలంటేనే భయమేస్తుందని ప్రముఖ నటి శృతి చెప్పుకొచ్చింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె పెళ్లి గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. నాకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకోవడం కోసం నేనెంతో కష్టపడ్డాను. కానీ, ఆ బాధ్యతలను ఒక చిన్న కాగితం మీద పెట్టాలంటే భయమేస్తుంది. పెళ్లి చేసుకోవాలని లేదు. పెళ్లి చేసుకొని తల్లిఅయ్యాకా.. విడిపోయి ఒక సింగిల్ మదర్ గా ఉండాలనుకోవడం లేదు. ఎందుకంటే సింగిల్ మదర్ కష్టాలు నాకు తెలుసు. నా లైఫ్ లో ఒకసారి పెళ్లి దగ్గరవరకు వెళ్లి వచ్చాను. చేసుకోవాలనుకున్నాను. కానీ, ముడిపడలేదు. పెళ్లి అనేది ఇద్దరు మనుషులకు సంబంధించిన విషయం కాదు. రెండు జీవితాల బాధ్యత. ఇద్దరిలోనూ విధేయత ఉండాలి. నిబద్ధత ఉండాలి. ఒకరిలో ఉంటే అది నిలవదు. ఒంటరిగా ఉండడం నాకు కొత్తేమి కాదు. ఎన్నో విషయాలను ఒంటరిగా ఉన్నప్పుడే నేర్చుకున్నాను.. అంటూ చెప్పుకొచ్చింది. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే శృతి ప్రేమ అనే మాయలో పడింది. లండన్ యాక్టర్ మైఖేల్ కోర్సలేతో పీకల్లోతు ప్రేమలో పడింది. ఇక వీరిద్దరూ చెట్టాపట్టాలేసుకొని అన్నిచోట్లా కెమెరా కంటికి కనిపించారు. త్వరలోనే ఈ జంట పెళ్లి చేసుకుంటుంది అనుకొనేలోపు ఇద్దరు బ్రేకప్ చెప్పుకొని విడిపోయారు.

### గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమా


## జీవన విధానాన్ని తీర్చిదిద్దే అస్త్రం

**చిత్ర నిర్మాత, కథానాయకుడు సిద్ధార్థ్ రాజశేఖర్**





గేమ్ ఆఫ్ చేంజ్ సినిమా ఒక శక్తివంతమైన జీవన విధానాన్ని తీర్చిదిద్దే అస్త్రం అని నమ్ముతున్నాను. సాధారణమైన క్షణాలు అసాధారణమైన మార్పులను రేకెత్తించిన పలు వ్యక్తుల ఆకర్షణీయమైన వ్యక్తిగత నిజ జీవిత కథనాలను మిళితం చేసి రూపొందించిన చిత్రమిది అని చిత్ర నిర్మాత కథానాయకుడు సిద్ధార్థ్ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మూవీని మీడియాకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కుమార గుప్తుడు శా.శ 427లో నిర్మించిన నలందా విశ్వవిద్యాలయం బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగిన కొన్ని నిజ జీవితాల కథనాలతో ఈ చిత్రం రూపొందించాము. మా మూవీ ప్రతి ప్రేక్షకుడిలో స్ఫూర్తి నింపుతుంది. ఈ సినిమా చూస్తున్నంతసేపు మనం ఎందుకు జీవితంలో సాధించలేము అనే పట్టుదల మొదలవుతుంది. కష్టాన్ని ఎదుర్కొన్నప్పుడే మనం జీవితంలో ఎదుగుతామని చెప్పే చిత్రమిది. ఈ సినిమాతో ఫిలింమేకింగ్ ఎంత కష్టమో తెలిసింది. ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీగా గేమ్ ఆఫ్ ఛేంజ్..ఫిల్మ్ ఇండస్ట్రీలో ఒక రివల్యూషన్ తీసుకొస్తుందని ఆశిస్తున్నాం అన్నారు. మరో నిర్మాత మీనా చాబ్రియా మాట్లాడుతూ ఇండియాలో ఇప్పటివరకు ఎవరూ చేయని సాహసం చేసాం. నేను మార్కెటింగ్ విభాగంలో 2 వేలకు పైగా సినిమాలకు పనిచేశాను. గేమ్ ఆఫ్ ఛేంజ్‌తో ప్రొడ్యూసర్ గా పనిచేసే అవకాశాన్ని సిద్ధార్థ్ రాజశేఖర్ కల్పించారు. సినిమా అంటే ఎంత హంగామా, ఎంత ఖర్చుతో కూడుకున్నదో మనం చూస్తున్నాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీ. ఈ రోజుల్లో థియేటర్స్‌కు ప్రేక్షకుల్ని రప్పించడం ఎంత కష్టమో మనకు తెలుసు. కానీ నేటి మీడియా షోకు హౌస్ ఫుల్ అయ్యింది. ఇది మా మూవీకి ప్రేక్షకులు ఇవ్వబోయే సక్సెస్ కు చిన్న శాంపిల్. దేశవ్యాప్తంగా మేము ప్రమోషన్ చేస్తున్నాం. త్వరలోనే మా చిత్రాన్ని థియేట్రికల్, ఓటీటీ ద్వారా రిలీజ్ చేయబోతున్నాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమాకు సీక్వెల్స్ కూడా ఉంటాయి. నెక్స్ట్ మూవీ మరింత గ్రాండ్‌గా రూపొందిస్తాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమాను దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు రీచ్ చేయాలన్నదే మా లక్ష్యం. ఈ ప్రయత్నంలో మీ సహకారం మాకు ఉంటుందని ఆశిస్తున్నాం.. అన్నారు. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో వస్తున్న చిత్రం గేమ్ అఫ్ చేంజ్. జాతీయ, అంతర్జాతీయ నటి నటులతో సిద్ధార్థ్ రాజశేఖర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మలయాళ దర్శకుడు సిధిన్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మించిన అంతర్జాతీయ చిత్రం గేమ్ అఫ్ చేంజ్. ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీగా తెరకెక్కిన గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమా త్వరలో థియేటర్స్‌తో పాటు ఓటీటీలోనూ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## లా విద్యార్థి లౌ ఫలించిందా?



ఇషాన్ ఖట్టర్ మరియు అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ నటీనటులుగా వచ్చిన సైరట్ చిత్రం హిందీలో మంచి విజయం అందుకుంది. తాజాగా ఈ సినిమాకు ధడక్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, యానిమల్ భామ త్రిప్తి డిమ్రి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించబోతుండగా.. ధర్మ ప్రొడక్షన్స్ సమర్పణలో జీ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్ క్లౌడ్ 9 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగష్టు 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిలేష్ (సిద్ధాంత్ చతుర్వేది) విధి (త్రిప్తి డిమ్రీ) అనే ఇద్దరు ప్రేమికుల చుట్టూ తిరుగుతుంది. నిలేష్ అనే అణగారిన కులానికి చెందిన యువకుడు లా చదువుదామని న్యాయ కళాశాలలో జాయిన్ అవ్వగా.. అతడికి విధి అనే ఉన్నత కులానికి చెందిన యువతి పరిచయమవుతుంది. వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారాగా.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఏంటి అనేది ఈ సినిమా కథ.



## భాగ్యనగరంలో ఆంధ్రా కింగ్ షూటింగ్

రామ్ పోతినేని, ఉపేంద్ర, మహేష్ బాబు పి, మైత్రి మూవీ మేకర్స్ ఆంధ్రా కింగ్ తాలూకా నెల రోజులు పాటు జరిగే కీలకమైన షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో షురూ అయింది. ప్రస్తుతం, రామ్, భాగ్యశ్రీ బోర్సే పై ప్రేమ సన్నివేశాలను నైట్ బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ నైట్ షెడ్యూల్ 10 రోజుల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత క్లైమాక్స్, ఇతర కీలక సన్నివేశాలను చిత్రీకరించడానికి 20 రోజులు డే టైంకి షూటింగ్ షిఫ్ట్ అవుతుంది. ఈ చివరి షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పూర్తవుతుంది. ఈ సినిమాలో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సినిమాపై అంచనాలని పెంచింది. టాప్ టెక్నిషియన్స్‌తో ఈ ప్రాజెక్ట్ అత్యున్నత స్థాయి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. సిద్ధార్థ నుని సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. వివేక్‌మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. ఆంధ్రా కింగ్ తాలూకా షూటింగ్ పూర్తయిన తర్వాత మేకర్స్ ప్రమోషన్స్ జోరుని మరింతగా పెంచనున్నారు. తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్ .

## 25న సార్ మేడమ్..

వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి, వెరీ ట్యాలెంటెడ్ నిత్యా మేనన్ జంటగా నటిస్తున్న రోమ్ కామ్ ఫ్యామిలీ డ్రామా సార్ మేడమ్.. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ సార్ మేడమ్ టైటిల్ విడుదల చేశారు. ఈ టీజర్ పెళ్లికి ముందు ఓ అమ్మాయికి మెట్టినింటి వాళ్లు చెప్పే మాటలతో మొదలై.. భార్యభర్తల మధ్య జరిగే ఫన్నీ గొడవతో ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ మధ్య సాగే సంభాషణలు ప్రేక్షకుల్ని అలరించాయి. టీజర్ ప్రారంభంలో వంట మాస్టర్‌లా కనిపించిన విజయ్ సేతుపతి చివర్లో గన్ పట్టుకొని మాస్ యాక్షన్ లుక్ కనిపించడం చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. టీజర్ విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ పెర్ఫార్మెన్స్ హైలెట్‌గా నిలిచింది. డైరెక్టర్ పాండిరాజ్ ఫ్యామిలీ జానర్ లో ఒక యూనిక్ స్టోరీతో వస్తున్నారని టీజర్ చూస్తే అర్థమోతోంది. టైటిల్ టీజర్‌కి సంతోష్ నారాయణన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సార్ మేడమ్ ఈ నెల 25న థియేటర్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో యోగి బాబు, శిరీ సురేష్, చెంబన్ వినోద్ జోస్, శర్వణన్, దీప ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపి ఎం సుకుమార్, ఎడిటర్ ప్రదీప్.



## నిర్మాతగా రీఎంట్రీ



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోగా ఎదిగిన వడ్డే నవీన్ వడ్డే క్రియేషన్స్ పేరుతో నిర్మాణ సంస్థ ప్రారంభించారని తెలుస్తోంది. దీంతో నిర్మాతగా రీఎంట్రీ ఇస్తున్నారని ఆయన ఫ్యాన్స్ భావి స్తున్నారు. నటుడిగా తిరిగి వస్తారంటూ వార్తలు వచ్చినప్పటికీ, వడ్డే నవీన్ నిర్మాతగా ఇప్పుడు పరిచయం కానున్నారు. 1990లలో కోరుకున్న ప్రియుడు సినిమాతో తెలుగు సినిమాలో అడుగు పెట్టిన వడ్డే నవీన్, తర్వాత పెళ్లి చిత్రంతో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆ చిత్రం ఆయనకు ఫ్యామిలీ ఆడి యన్స్‌ని దగ్గర చేసింది. వడ్డే నవీన్ దశాబ్దం పాటు అనేక సక్సెస్‌ఫుల్ సినిమాలతో ఫ్యామిలీ హీరోగా తన క్రేజ్‌ను పెంచుకున్నారు. మనసిచ్చి చూడు, చెప్పాలని ఉంది, ప్రేమించే మనసు, స్నేహి తు లు వంటి సినిమాలు మరిం త ఫ్యామిలీ ఆడియన్‌ను ఆకట్టుకున్నాయి.

## కేంద్రం కోర్టులోకి ఉదయ్ పూర్ ఫైల్స్

మొదటి నుంచి వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఉదయ్ పూర్ ఫైల్స్ సినిమాకు మళ్లీ ఢిల్లీ హైకోర్ట్ బ్రేక్ వేసింది. శుక్రవారం విడుదల కావాల్సిన సినిమా హైకోర్ట్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ సినిమాను వీక్షించి, ఇది విడుదలకు అర్హమైంది అవునా? కాదా? అనే నిర్ణయం తీసుకోవాలి తెలిపింది. దాంతో ఉదయ్ పూర్ ఫైల్స్ బాల్... కేంద్ర ప్రభుత్వం కోర్టులో పడినట్టు అయ్యింది. టైలర్‌ను ముస్లిం యువకులు హత్య చేయడాన్ని ఖండిస్తూ అప్పట్లో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ కథాంశాన్నే దర్శకుడు భరత్ ఎస్ శ్రీనాథే సినిమాగా తీశాడు. అయితే ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుపట్టడమే కాకుండా పూర్తి దీనిని నిషేధించాలంటూ జమాయత్ ఉలేమా ఇ హింద్ సంస్థ, జర్నలిస్ట్ ప్రశాంత్ టాండన్ కోర్టు కెక్కారు. ఢిల్లీ హైకోర్ట్‌లో దాఖలైన రెండు పిటీషన్లను చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ అనీశ్ దయాల్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. పిటీషనర్ల తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ వాదించారు. కేవలం టైలర్ కన్హయా లాల్ హత్య గురించి మాత్రమే కాకుండా ఇతర సున్నితమైన అంశాలను సైతం ఈ చిత్రంలో చర్చించారని, ఈ సినిమా విడుదలైతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని వాదించారు. అయితే ఒకసారి సెన్సార్ అయిన సినిమాను ఆపడం సమంజసం కాదని మేకర్స్ తరఫున లాయర్ వాదించినా... కోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. సి.బి.ఎఫ్.సి. సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కూడా తమ చిత్రంపై కోర్టుకు వెళ్ళడాన్ని ఆ చిత్ర దర్శకుడు భరత్ ఎస్ శ్రీనాథే తప్పుపట్టాడు. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు ఢిల్లీ హైకోర్టు తలుపుతట్టి తమ చిత్రాన్ని ఆపుతారని ఊహించలేదని అన్నాడు. న్యాయస్థానాలంటే గౌరవం ఉన్న వ్యక్తిగా సుప్రీమ్ కోర్టును తాము ఆశ్రయిస్తామని చెప్పాడు. రిలయన్స్ ఎంటర్ టైన్ మెంట్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయడానికి ముందుకొచ్చింది. విజయ్ రాజ్,




## అసభ్యత లేని సెంటిమెంట్‌తో ..

### ఓ భామ.. అయ్యో రామ



కలర్ ఫొటో ఫేం సుహాస్ ఎంచుకునే పాత్రలు భిన్నంగా ఉంటాయి. మినిమం గ్యారెంటీ అనేలా ఆయన సినిమాలు ఉంటాయి. తాజాగా ఆయన నటించిన చిత్రం ఓ భామ.. అయ్యో రామ మాళవిక మనోజ్ కథానాయిక. రామ్ గోదల దర్శకత్వంలో హర్ష నల్ల నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లి (అనిత)ను కోల్పోతాడు. తండ్రికి (రవీంద్ర విజయ్) రామ్ అంటే గిట్టదు. అతన్ని దూరం పెడతాడు. తల్లే అతని బాగోగులు చూసుకుంటుంది. అకస్మాత్తుగా తల్లి మరణించడంతో మేనమామ (అలీ) అతని బాధ్యత తీసుకుంటాడు. అక్కడి నుంచి రామ్‌కి ఏ లోటు లేకుండా చూసుకుంటాడు. రామ్ దర్శకుడు కావాలనేది అతని తల్లి కల. కానీ అతను సినిమాలకు దూరంగా ఉంటూ పెద్ద చదువుల కోసం ఫారెన్ వెళ్లానుకుంటాడు. అతని జీవితంలోకి సత్యభామ (మాళవిక మనోజ్) అనే అమ్మాయి రావడంతో తన జీవితం మారిపోతుంది. అమ్మ లేని లోటును సత్యభామ తీరుస్తుంది. ఆమె రాక అతనిలో ఎలాంటి మార్పు తీసుకొచ్చింది. సినిమాలకు దూరంగా ఉండే అతను ఆ దిశగా అడుగులు వేయడానికి కారణమేంటి? సినిమా డైరెక్టర్ కావాలానే తల్లి కోరికకు అతను ఎందుకు దూరంగా ఉన్నాడు? రామ్, సత్యభామల ప్రేమ కథ కంచెకు చేరిందా లేదా? అన్నది కథ. కెరీర్, మదర్ సెంటిమెంట్‌తో కూడిన లవ్‌స్టోరీ ఇది. సింపుల్ కాలేజీ కుర్రాడి కథగా మొదలై ప్రేమ, భావోద్వేగాల వైపు నడుస్తుంది. కథగా చూసినప్పుడు ఫస్టాఫ్‌లో హీరోయిన్ యాక్సిడెంట్, దాని నుంచి కాపాడటం, ఆమె హీరోకి ఫిదా కావడం, అతని వెంట పడటం, అతనికి దగ్గరై సరదాగా బయటకు తిరగడం వంటి సన్నివేశాలు కాస్త విసుగు తెప్పిస్తాయి. అందుకు కారణం అవన్నీ ఎన్నో సినిమాల్లో చూసినవే. హీరోహీరోయిన్, స్నేహితుల మధ్య సాగే ప్రతి సన్నివేశం రొటీన్‌గా సాగుతాయి. ఇంటర్వెల్‌లో ట్విస్ట్ కొంత వరకూ ఫర్వాలేదు. సెకెండాఫ్ నుంచి కథ సీరియస్ ట్రాక్‌లోకి వెళ్తుంది. మేనల్లుడి మీద బాధ్యతగా వ్యవహరించే అలీ పాత్ర ఎమోషన్‌గా సాగుతుంది. హీరో తల్లికి ఎలా దూరమయ్యాడు, తన తండ్రి వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు అనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కూడా బావుంది. చివర్లో ట్విస్ట్ సస్పెన్స్‌ని క్రియేట్ చేస్తుంది. క్లైమాక్స్‌లో రూట్ మార్చినట్టి మార్చి అసలు విషయం రివీల్ చేసిన తీరు బాగుంది. ముగింపు రొటీన్‌గా కాకుండా ట్విస్ట్‌తో ముగించారు. అయితే లాజిక్‌లో వెతికే వారికి ఆ సీన్స్ అంతగా ఎక్కవు. యూత్‌ని ఎట్రాక్ట్ చేసే ప్రయత్నం చేశారు. కానీ అది ఇంకాస్త డీప్‌గా చేసుంటే రిజల్ట్ మెరుగుగా ఉండేది. నటీనటుల విషయానికొస్తే.. సుహాస్ ఎంచుకునే పాత్రలన్నీ పక్కింటి కుర్రాడిలాగా ఉంటాయి. ఇందులో రామ్ పాత్రలో ఒదిగిపోయాడు. నటుడిగా ఇప్పటిదాకా అతను ఎక్కడా ఫెయిల్ కాలేదు. ఇందులో కూడా పాత్రకు న్యాం చేశాడు. ఎమోషన్స్ బాగా క్యారీ చేశాడు. సత్యభామ పాత్రకు మాళవిక మనోజ్ కరెక్ట్‌గా యాప్ట్ అయింది. అందంగా, చక్కని అభినయంతో అలరించింది. నటన పరంగా సుహాస్‌ని డామినేట్ చేసిందని చెప్పొచ్చు. హీరోయిన్ తండ్రి పాత్రలో పృథ్వీ నటన బాగుంది. చాలా కాలం తర్వాత అలీకి నిడివి ఎక్కువున్న పాత్ర దక్కింది. నవ్వులతో పాటు భావోద్వేగాన్ని పంచాడు. సుహాస్ ఫ్రెండ్స్‌గా సాత్విక్ నవ్వించారు.

నయని పావనికి మంచి పాత్రే దక్కింది. అన్నపూర్ణ ఎప్పటిలాగే బాగానే చేశారు. దర్శకుడు హరీష్ శంకర్, మారుతి అతిథి పాత్రల్లో మెరిశారు. మణికందన్ సినిమాటోగ్రఫీ సినిమాకి హైలైట్‌గా నిలిచింది. విజువల్స్ కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. బ్రహ్మకడలి ఆర్ట్ వర్క్‌లో తన మార్క్ చూపించాడు. భవిన్ ఎం షా ఎడిటింగ్ కూడా ఓకే. నేపథ్య సంగీతం పరంగా రథన్ మ్యూజిక్ సినిమాకి మరో ప్లస్. పాటలు అంతగా గుర్తు పెట్టుకునేలా లేవు. నిర్మాణ విలువలు బావున్నాయి. ఓవరాల్‌గా చూస్తే కథలో ఉన్న బలానికి తగ్గ ఎమోషన్స్ తెరపై కనిపించలేదు. ముఖ్యంగా చిన్న చిన్న పొరపాట్లను పక్కన పెడితే ఎలాంటి అసభ్యత లేని సెంటిమెంట్ సినిమా ఇది.



## సరదాగా వింటారా

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ నుంచి వచ్చే సినిమాలకు ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంటుంది. ఈ బ్యానర్ నుంచి వచ్చే సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాలను అందుకుంటాయని ప్రేక్షకులు భావిస్తారు. అందుకు తగ్గట్టుగానే ఈ బ్యానర్ వైవిధ్యమైన సినిమాలను అందిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇక తాజాగా ఈ బ్యానర్ ఓ సరికొత్త రొమాంటిక్ చిత్రాన్ని అందించేందుకు సిద్ధమైంది. అశోక్ గల్లా, శ్రీగౌరి ప్రియ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వింటారా సరదాగా అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను వారు తాజాగా రిలీజ్ చేశారు. రాహుల్ విజయ్, శివాత్మిక ఈ సినిమాలో ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఉద్భవ్ డైరెక్ట్ చేస్తున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను కూడా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ చిత్ర టీజర్‌ను జూలై 12న ఉదయం 10.53 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

# రాష్ట్రపతి మెచ్చిన రైతు బిడ్డ !




గ్రామీణ నేపథ్యం... వ్యవసాయ కుటుంబం... చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల రెక్క చూసి పెరిగింది. వారిని ఉన్నత స్థాయిలో చూడాల్సి ఉంది. అందుకే ఆత్మవిశ్వాసం చదివి సీఎంఏలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేత మీదుగా పట్టా అందుకుంది. ఆమె కొత్తపేట తేజస్విని. తన విజయాన్ని మనతో పంచుపందిలా.

అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లెలోని కన్నెమడుగు మా స్వస్థలం. అమ్మానాన్నలు నాగవేణి. రఘురామిరెడ్డి, వారికి మేం ముగ్గురం సంతానం అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయం చేస్తా సాగులో కంటే లాభాలు రావాలంటే ఎక్కువ చూశారు నాన్న అయినా మా చదువుల్ని ఆపని ప్రాథమిక విద్య స్థానిక పాఠశాలలోనే సాగింది. హైస్కూలు విద్యను మదనపల్లెలోని వలస జవహర్ నవోదయలో చదివాను.

తిరుపతిలో సీఏ పూర్తి చేశాను. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలన్న లక్ష్యంతో ఎన్ని ఇబ్బందులు వచ్చినా రోజుకు 12-14 కష్టపడి చదివేదాన్ని, 2024 జులైలో ఐసీఐఏ (ఇన్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియాలో 14వ స్థానం సాధించాను. 2024 ఆగస్టులో ఐఎంఏ (ఇన్ డిగ్రీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్) ఆధ్వర్యంలో విడుదలైన సీఎం ఏ (సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్) ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సొంతం చేసుకున్నాను. ఇందుకుగానూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ఢిల్లీలో పట్టా అందుకున్నారు. అమ్మానాన్నల కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఇది. ప్రస్తుతం బెంగళూరు లోని ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తున్నాను. అమ్మానాన్నలను బాగా చూసుకోవడం, చెల్లితమ్ముళ్లను ఉన్నత చదువులకు వెళ్లేలా చూడటంతోపాటు ఊరికి మంచి పేరు తీసుకురావాలి.

ఇవే నా ముందున్న ప్రధాన లక్ష్యాలు. □

## వాడేసిన బ్యాగు ధర రూ.85 కోట్లు



బ్రిటన్‌కు చెందిన దివంగత నటి, గాయని జానే బర్కిన్ (జేన్ బిట్‌కిన్) కోసం ఫ్రాన్స్ లగ్జరీ బ్రాండ్ హార్మీస్ (హార్మ్స్) గతంలో ఓ అరుదైన బ్యాగ్‌ను తయారు చేసింది. ఆ బ్యాగును ఇప్పుడు వేలం వేయగా అది రికార్డు ధర పలికింది. పారిస్లో సోథిబే ఆక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో జపాన్కు చెందిన ఓ ప్రైవేట్ కలెక్టర్ ఈ ఒరిజినల్ బర్కిన్ బ్యాగ్ను 8.58 మిలియన్ యూరోలకు సొంతం చేసుకున్నారు. అంటే భారత కరెన్సీలో ఆ ధర దాదాపు రూ.8.5 కోట్ల పైమాటే..

నటి పేరే బ్రాండ్‌గా మారి... 1980లో నటి జానే బర్కిన్ ఓసారి పారిష్ నుంచి లండన్ వెళ్తుండగా విమానంలో ఆమె పక్క సీట్లో హార్మీష్ ఇప్పటి యజమాని జీన్ లూయిస్ డ్యూమస్ కూర్చున్నారు. ఆయనతో మాట్లాడిన ఆమె.. ఓ బిడ్డకు తల్లిగా తనకు కావాల్సిన రీతిలో మంచి బ్యాగు దొరకడం లేదని చెప్పారు. అనంతరం 1984లో హార్మీస్ సంస్థ పిల్లలను వెంట తీసుకెళ్లి తల్లుల అవసరాలకు ఉపయోగపడేలా ప్రత్యేకమైన బ్యాగ్‌ను రూపొందించి నటికి అందించింది. ఆ బ్రాండ్‌కు 'బర్కిన్' అని పేరు పెట్టింది. తొలి నాళ్లలో ఆ బ్యాగ్ నటి బర్కిన్ తరచూ వెంట తీసుకెళ్లేవారు దానిపై జె.బి అనే అక్షరాలతో ప్రత్యేకంగా రూపొందించారు. ఇక లోపల లోహంతో చేసిన రంగులు, భుజం నుంచి జారిపోకుండా ఉండేలా స్ట్రాప్, నెయిల్ క్లిప్పర్ వంటివి ఉంచారు. కొన్నేళ్ల పాటు ఆ బ్యాగ్‌ను వినియోగించిన నటి ఈ తర్వాత హార్మీస్ ఇచ్చేశారు. అనంతరం 1994లో దాన్ని వేలం వేసి వచ్చిన డబ్బును ఎయిడ్స్ ఛారిటీకి అంద జేశారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పారిస్‌కు చెదిన కేథరీన్ బెనియర్ అనే మహిళ వేలంలో దాన్ని సొంతం చేసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు సోథిబే సంస్థ ఈ బ్యాగ్‌కు వేలం నిర్వహించింది. మిలియన్ యూరోలతో వేలం మొదల వగా, జపాన్‌కు చెందిన ఓ వ్యక్తి దీన్ని 8.58 మిలియన్ యూరోలకు దక్కించు కున్నారు. కొన్ని కారణాల రీత్యా ఆ వ్యక్తి వివరాలను సోథిబే బయట పెట్టలేదు. ఓ హ్యాండ్‌బ్యాగ్‌కు ఇంత ఎక్కువ ధర పలకడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. అంతకుముందు 2021లో హాంకాంగ్‌లో నిర్వహిన ఓ వేలంలో మొసలి చర్మంతో చేసిన వజ్రాలు పొదిగిప ఓ బ్యాగు 5,13,00 డాలర్లకు అమ్ముడైంది. □

# ఒత్తిడి లేని భారత్ లక్ష్యంగా..




అన్నీ బాగున్నాయి అనుకున్నప్పుడు వచ్చే కష్టాల్లోనే జీవితం ఉంటుంది. అని ఓ చిత్రంలో చెప్పినట్లుగా.. నిజంగా కష్టాలు వచ్చినప్పుడే జీవితం మలుపు తిరుగుతుంది. కొంతమంది వాటికి దాసోహమైతే..మరికొంతమంది ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు మార్గదర్శకులుగా మారుతుంటారు. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ అనూజా లునియా రెండో కోవకు చెందుతుంది. సాఫీగా సాగుతోన్న ఆమె జీవితంలో అనుకోకుండా వచ్చిన ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. వాటన్నిటికీ ఒత్తిడి కూడా కారణమని తెలుసుకున్న ఆమె.. దానిననుంచి బయటపడేందుకు తీవ్రంగా శ్రమించ డమే కాకుండా సానుకూల ఫలితాన్ని రాబట్టింది. అంతేకాదు ఆ ఫలాలను ఇతరులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని స్ట్రెస్ స్ట్రాటజిస్ట్‌గా మారింది. ఆ తర్వాత రచయిత్రిగానూ మారిన ఆమె వేలమంది జీవితాలను ప్రభావితం చేస్తోంది. అవి తాత్కాలికమే.. మహారాష్ట్రలోని థానేకు చెందిన అనూజ తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే. దాంతో తమ కూడా వైద్య రంగంలోనే ప్రవేశించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే ఫిజియోథెరపీలో డిగ్రీ పట్టా అందుకుని అదే విభాగంలో కెరీర్ ప్రారంభించింది. అయితే అదే సమయంలో ఆమె ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబిడి) అనే సమస్యకు లోనైంది. దాదాపు ఐదేళ్ల పాటు మందులు వాడినా తాత్కాలిక ఉపశమనం లభించడమే కానీ, సమస్య నయం కాలేదు. ఈ క్రమంలో ఎలాగైనా సరే దీన్నుంచి బయటపడాలని ఒక ప్రణాళిక రూపొందించుకున్న ఆమె.. ఒకవైపు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమిస్తూనే మరోవైపు జీవనశైలిలో మార్పులు చేయాలని నిర్ణయించుకుంది. విపరీతంగా బరువు కోల్పోయి.. ఎప్పుడైతే అనూజ తన జీవనశైలిలో మార్పులు చేయడం మొదలు పెట్టిందో.. అప్పట్నుంచీ క్రమంగా ఆమె శరీరంలో సాను కూల మార్పులు మొదలవడం గమనించిందట. క్రమంగా తన ఆరోగ్యం మెరుగుపడడంతో 2008లో ఫిట్‌నెస్ స్టూడియో, పాలీక్లినిక్‌లను ప్రారంభించింది. అలా ఒకవైపు తన ఆరోగ్యాన్ని కాపాడుంటూనే మరోవైపు కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టింది. అలా కొన్నేళ్ల పాటు ఆమె ప్రయాణం సంతోషంగా సాగింది. కనీసం ఆహారం కూడా తీసుకోలేని స్థాయికి చేరుకుంది. దానివల్ల విపరీతంగా బరువు కోల్పోయింది. పని చేయడానికి కూడా శక్తి లేకపోవడంతో ఫిట్‌నెస్ స్టూడియోని మూసేసింది.

**ఒత్తిడి లేని భారత్ లక్ష్యంగా..** పరిస్థితులు ఎంత దయనీయంగా మారినా అనూజ మాత్రం కుంగిపోలేదు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను అన్వేశించాలనుకుంది ఈ విధంగానే తన సమస్యకు ఒత్తిడి కూడా ఓ ప్రధాన కారణం అని తెలుసుకుంది. అందుకే ఒత్తిడిని తగ్గించేందుకు 1 నెలల పకడ్బందీ ప్రణాళికను రూపొందించుకుంది. అది తిరిగి సాధారణ జీవితాన్ని గడపడానికి ఉపయోగ పడింది. ఈ ఒత్తిడి ఒత్తిడి వల్ల తనలాగా ఇతరులు ఇబ్బందులు ఎదుర్కోకూడదని ఒత్తిడి 'స్ట్రెస్ స్ట్రాటజిస్ట్'గా మారింది. భారతదేశాన్ని ఒత్తిడి లేని దేశంగా తన వంతుగా కృషి చేయడానికి సంకల్పించుకుంది. ఇందులో భాగంగానే రచయిత్రిగా మారిన ఆమె 'రిలాక్స్ ప్లే త్రివే' అనే బుక్‌ని రాసింది. ఇందులో ఒత్తిడి తగ్గించడానికి 111 యాక్టివిటీలను చేర్చింది. అలాగే దీనికి సంబంధించిన సంస్థలలో కూడా వర్క్‌షాప్‌లు కొనసాగుతు న్నాయి. అలా ఇప్పటివరకు దాదాపు 18 వేల మందికి పైగా జీవితాలను ప్రభావితం చేసింది. ఇతర ఇతరులకు మార్గదర్శకులుగానూ మారింది. □

## పదార్థాలు పాడవకుండా..




తీరిక లేని జీవితం లో ఏరోజు కారోజు వెళ్లి.. తాజా కూరగాయలు కొనుక్కోవడం కొంచెం కష్టమైన సంగతి. అందుకు బదులుగా కవర్లలో పెట్టి ఫ్రిజ్‌లో భద్రం చేయడం మామూలే. మరి అవి వారం పదిరోజుల వరకూ తాజాగానే ఉండాలంటే. సిలికాన్ వెజిటబుల్ ఫుడ్ స్టోరేజ్ బ్యాగ్స్ వాడితే సరి. ఈ జిప్ లాక్ కవర్లు గాలి చొరబడనివ్వవు, మందంగా ఉంటాయి. సీల్ వేసినట్లుగా ఉండి. కాయలు, పండ్లను మరింత తాజాగా ఉంచుతాయి. నాణ్యమైన మెటీరియల్‌తో చేయడం వల్ల మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. ఒకదాని మీద ఒకటి కాకుండా పక్కపక్కన నిలబెట్టొచ్చు. ఈ స్టోరేజ్ కంటెయినర్ ఫ్రీజర్ సంచుల్లో లంచ్‌తో సహా చిరుతిళ్లు, పానీయాలను కూడా భద్రం చేసేయొచ్చు. వీటిల్లో ఉంచిన పదార్థాల్ని మరో పాత్రలోకి తీయ కుండా.. తిన్నగా కవర్‌తోనే అవెన్‌లో వేడిచేయొచ్చు. ఫ్రిజ్‌లో ఎక్కువ స్థలం ఆక్రమించదు, డిష్‌వాషర్‌తో శుభ్రం చేయడమూ తేలికే. నాణ్యమైన సిలికాన్ కనుక పదార్థాల రుచి తగ్గదు, విషతుల్యం కాదు. □

## బ్లౌజుకు అందమైన అల్లిక


ఫ్యాషన్ ఫ్యాషన్








చీర ఎంత ఇష్టంగా కొన్నా.. తరవాత మన దృష్టంతా బ్లవుజు మీదే. దాన్ని ఎలా కుట్టించాలనే! అవును మరి చీర అందం మొత్తాన్నీ నిర్ణయించేది అదే కదా. ఆ మాత్రం శ్రద్ధే కాదు. ఖర్చూ పెడతాం. ఎప్పటికప్పుడు నయా ట్రెండ్ ఏంటా అని తెలుసుకోవడమూ ఇందులో భాగమే. ఇందుకు పట్టు, రోజువారీ చీరలన్న తేడా ఉండదు. ఇప్పుడు కాబోయే వధువుల దగ్గర్నుంచి, గృహిణుల వరకూ ఆకర్షిస్తున్నవేంటో తెలుసా? పిన్ టక్ డిజైన్లు, పేరు మాత్రం కొత్తదేం కాదు. ఒకప్పుడు బ్లవుజులపై సన్నని ప్లీట్స్‌ను పక్కపక్కనే నిలువుగా కుట్టేవారు. ఇప్పుడు కాస్త ట్రెండ్ మారింది. ఆ ప్లీట్స్‌నే డైమండ్ ఆకారంలోకి మార్చేస్తున్నారు. పూసలు, అద్దాలు, ఆరీ వర్క్ జతతో భలే ఆకట్టుకుంటున్నాయి కదూ! కాటన్, లినెన్, సిల్క్, షిఫాన్.. అన్ని వస్త్రాలకూ ఈ అల్లిక నప్పుతోంది. పట్టు వాటికైతే నెటెడ్ వస్త్రంపై వీటిని జోడిస్తున్నారు. ఆరీ వర్క్, అందమైన పిన్ టక్ అల్లికలపై ఆసక్తి చూపుతున్నారు. మదువులైతే ఈ కాంబినేషన్‌ని ఏరి కోరి కుట్టించుకుంటున్నారు. పైగా ఆధునిక లుక్ అదనం. మనసు దోచకుండా ఉంటాయా? మరీ మీ సంగతేంటి? మీకూ నచ్చిందా.. ఈ అందమైన అల్లిక? ఇంకేం ప్రయత్నంచేయండి మరి.







ఆరోగ్య భాగ్యం

## ఆకుకూరల ప్రయోజనాలు -2




డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆకు కూరల్లోని పిండి పదార్థాలు, ప్రోటీన్స్ డయాబెటిక్స్, ప్రీడయాబెటిక్స్‌లోని చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తాయి. ఆకుకూరల్లోని సోడియం, పొటాషియం, మాంగనీస్‌లు అధిక రక్తపోటుని నియంత్రించి గుండెజబ్బులు, పక్షవాతం, ఆల్జీమర్స్ వంటివి రాకుండా కాపాడుతాయి. ఆకుకూరల్లోని బి కాంప్లెక్స్ విటమిన్ పిండి పదార్థాల్ని గ్లూకోజ్‌గా మార్చి శరీరానికి శక్తినిచ్చే ఇంధనాలుగా పనిచేస్తాయి. విటమిన్ ఇ హార్మోన్ల అసమానతకి, వంధ్యత్వానికి చర్మానికి ఉపయోగపడతాయి. విటమిన్ కె వల్ల రక్తం గడ్డకట్టడానికి ఉపయోగపడేది, గుండె, రక్తనాళాల జబ్బులు, ఎముకలు గుల్లబారడం, కిడ్నీస్టోన్స్‌ని నియంత్రించే శక్తిని కల్గి రక్తనాళాల స్థితి స్థాపకతని కాపాడుతుంది. అంతేకాకుండా బాడీ ఫిట్‌నెస్‌కి శరీరంలో వేడిని తగ్గించి చలువ చేయడానికి శీతాకాలంలో వేడిని కల్గించడానికి ఉపయోగపడి శరీర ఉష్ణోగ్రతని క్రమబద్ధీకరిస్తుంది. **జాగ్రత్తలు :** పచ్చి ఆకుకూరల్ని ఎక్కువగా తీసుకోరాదు. వీటిలోని రసాయనాల స్ప్రే వల్ల ఆక్సలేట్స్, ఫైటిక్ ఆసిడ్స్ వల్ల కాల్షియం, ఐరన్ ఖనిజాల పోషణకి ఆటంకం కల్గి పోషకాహార లోపం కల్గుతుంది. చాలా మందిలో ఆకుకూరలు తినే అలవాటు లేకపోవడం వల్ల అధిక ఫైబర్ వల్ల కడుపులో అసిడీ,గ్యాస్ ట్రబుల్ కాబట్టి అలవాటు అయ్యేంతవరకు మితంగా తీసుకోవాలి. ఆకుకూరల వల్ల ఎటువంటి హాని జరగదు. అంతేకాకుండా చాలా మంది విరేచనాలు కల్గిస్తాయని తినరు. పిల్లలకి పెట్టరు. వీటిని రాత్రిపూట తినకూడదని వీటిని ఎక్కువగా తింటే మలం పరిమాణం ఎక్కువుగా ఉంటుందని మలంలో ఆకులు అరగక తిన్నది తిన్నట్లే వస్తుందని రకరకాల అపోహలతో ఆకుకూరల్ని తినడానికి విముఖత చూపిస్తారు. నేల, నీరు ద్వారా ఆకుకూరలు సూక్ష్మక్రిములు, కీటకాలతో కలుషితం కావడం వల్ల, రసాయనాల స్ప్రే వల్ల వీటిని సరిగా కడగకపోవడం వల్ల విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ వస్తాయి. అంతేగాకుండా ఆకుకూరల్లోని అధిక ఫైబర్ వల్ల ఒకేసారి అధిక మోతాదులో కాని, తరుచుగా లేదా కంటిన్యూగా ఒకే రకం ఆకుకూరల్ని తిన్నా, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ఆకుకూరల్ని తిన్నా విరేచనాలు వస్తాయి. కొందరిలో రోజుకి 2-3 సార్లు తింటే ఆహారం తిన్న వెంటనే మల విసర్జనకి పోవాల్సి ఉంటుంది. అంతేకాని ఆకుకూరలు తినడం మానివేయడం మంచిది కాదు. ఇవి ఆరోగ్యానికి అన్ని విధాల మేలు చేస్తాయి. ఎలర్జీ ఉన్నవారిలో కొంతమంది సున్నితంగా ఉంటారు. **ఉదా :** పాలకూర, కాలే, తోటకూరవల్ల ఎలర్జీరాష్ వచ్చే అవకాశముంది. ఇలాంటివారు పాలక్‌ని ఇతర ప్రోటీన్స్‌తో కలిపి తినడం మంచిది. ఇరిటబుల్ బవల్ సింన్‌డ్రోమ్, జీర్ణకోశ సమస్యలున్నప్పుడు దీర్ఘకాలిక రోగాలతో బాధపడేటప్పుడు, ఆపరేషన్స్ జరిగిన తర్వాత, అంటువ్యాధుల నుండి కోలుకుంటున్నాప్పుడు ఆకుకూరల్ని మితంగా తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆకుకూరల్లోని విటమిన్ కె ఎక్కువగా ఉండి ఫోటో సింథసిస్ వల్ల కొన్ని రకాల మందులు, ఆంటీ కోయాగ్యులెంట్స్ (బ్లడ్ థిన్నర్స్) వాడేవారు మానివేయకుండా మితంగా తీసుకోవాలి. అలాగే ఆకుకూరల్లోని ఆక్సలేట్స్, ఫైటిక్ ఆసిడ్స్ వల్ల కాల్షియం ఐరన్ పోషణకి ఆటంకం ఏర్పడి కిడ్నీలో స్టోన్స్ వచ్చే అవకాశముంది. అలాగే కిడ్నీస్టోన్స్‌తో బాదపడేవారు తక్కువగా తీసుకోవాలి లేదా నీళ్ళతో ఉడికించి లేదా ఉడికిన తర్వాత వచ్చే నీళ్ళని పారబోయడం మంచిది. ముఖ్యంగా పాలకూరని తగ్గించాలి. ఆకుకూరల్లోని గ్లూకోసినోలేట్ వల్ల అయోడిన్ పోషన జరగక గాయిటర్ వచ్చే అవకాశముంది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని నేలల్లో పెరిగే వీటికి వాడే క్రిమిసంహారం వల్ల, బాక్టీరియల్ కాలుష్యం (ఈ కోలై, సాల్మొనెల్లా) వల్ల ఫుడ్ పాయిజనింగ్ లేదా కడుపు నొప్పి, విరేచనాలు రాకుండా వీటిని ఉప్పునీటిలో 10-15 నిమిషాలుంచి బాగా శుభ్రపర్చిన తర్వాతనే వాడుకోవాలి. పచ్చి ఆకుకూరలు జీర్ణ కావడానికి టైమ్ పడుతుంది పసరువాసన వల్ల తినలేనప్పుడు ఉడికించి కాని లేదా వివిధ వంటకాల్లో, వివిధ పదార్థాలతో చేర్చి తీసుకోవడం మంచిది. ఎక్కువ ఉడికిస్తే ఎ,బి,సి, విటమిన్లు ఆవిరై పోతాయి. ఆకుకూరల్లో పిండిపదార్థాలు 20 గ్రా దాకా ఉండడం వల్ల ఉడికించి తినడం షుగర్ రోగులకి మంచిది. అలాగే నైట్రేట్ రూపంలో నత్రజని చేరడం వల్ల హోమ్‌గ్లోబిన్‌ని ఆక్సీకరణం చేసి మిథో మోగ్లోబినేమియాకు దారి తీస్తుంది. □

ఆకుకూరలు హైపో థైరాయిడిజమ్‌ని ఎఫెక్ట్ చేస్తాయి. కాని మలబద్ధకం సమస్య ఉన్నవారు మితంగా తీసుకోవడం అన్ని విధాలా మంచిది. ఇది థైరాయిడ్ పని తీరుకి ఆటంకం కల్గిస్తాయి. సంప్రదాయేతర ఆకుకూరల్ని ఎక్కువగా వాడరాదు. మధ్య మధ్యలో సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరల్ని వాడడం మంచిది.


## ఉద్యోగం పట్ల ఆసక్తి తగ్గుతోందా?

వృత్తిగత జీవితంలో నిరాశానిస్పృహాలు ఆవరి స్తున్నాయా..? రోజురోజుకీ ఉద్యో గం జీవితంలో ఆసక్తి తగ్గిపోతోందా..? అనుకున్నంత ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయలేకపోతున్నారా..? తెలియని ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారా..? అయితే ఈ సమస్యల నుంచి బయటపడేందుకు కొన్ని చిట్కాలు మీకోసమే.. ఆఫీసులో చేస్తున్న పని మీద ఆసక్తి తగ్గిపోవడానికి మీరు ఏదో విషయంలో ఒత్తిడికి గురవడమో లేక మీరు పని చేస్తున్న రంగం మీద కాకుండా వేరే రంగం మీద ఆసక్తి ఉండడమో. కారణం కావచ్చు. మీరు ఆలోచించి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మంచిది. లేదంటే మీ కెరీరే ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. రోజూ రొటీన్ జాబ్ చేస్తున్నామనే భావన కలుగుతోందా? పనిలో ఆసక్తి తగ్గడానికి అదే కారణమని అనుకుంటున్నారా.. అయితే, అలాంటి సమయంలోనే మీ పనిని మీకు తగ్గేలా మలచుకోండి. రోజూ చేసే పనినే విభిన్నంగా చేయడానికి



ప్రయత్నించండి. అంతకు మించి మీరు చేస్తున్న పనిలోనే రోజుకో కొత్త అధ్యయనం నేర్చుకోవడానికి సంకల్పిం చండి. మీ సహచర ఉద్యోగులతో విభేదాలే మీకు ఆఫీసు పనిలో నిరాసక్తతను, నిస్పృహను కలిగిస్తున్నాయని అనుకుంటున్నారా? అయితే, అలాంటి విభేదాలను వీలైనంత వరకు పరిష్కరించు కోవడానికి ప్రయత్నించండి స్నేహపూర్వక ‘మైన వాతావరణంలో అందరినీ గౌర విస్తూ, నిబద్ధతతో పని చేయండి. □

## వాస్తవం



ఒక రాజ్యంలో మహారాజు బీదసాదలకు నిత్యం అన్నదానం చేయించే వాడు. ఓ రోజు భోజన వితరణ చేయిస్తుండగా, ఓ గద్ద పామును నోట కరచుకొని పోతోంది. పాము గద్ద పట్టు నుంచి తప్పించు కోవటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయాసలో దాని కోరల నుంచి జారిన విషం భోజన పదార్థాల్లో పడింది. అదెవరూ గమనించలేదు. కొంతసేపటికి ఆ ఆహారం తినన పేదలు చనిపోగా రాజు దిగ్భ్రాంతి చెందాడు. ఈ పాపానికి కారణం యమలోకంలోచర్చనీయాంశమైంది. గద్ద ఆహార సేకరణలో పామును పట్టుకుంది,. సర్పం ప్రాణభయంతో విషం చిమ్మింది. ఈ పొరపాటు రాజుకు తెలియదు. ఆ పాపం ఎవరి ఖాతాలో వేయాలని చిత్ర గుప్తుడు అడిగితే-ముందు భూలోకానికి పదమన్నాడు. దారిలో కొందరిని కదిలించాడు. మహారాజు అన్నదానం పేరుతో విషం పెట్టి చంపుతున్నాడు అని కొందరు, జనాభాను తగ్గించేదుకు విష ప్రయోగం చేయిస్తున్నాడు అని మరికొందరు మాట్లాడుకుం టున్నారు. నిజం తెలుసుకోకుండా తమ కాలాన్ని వృథా చేసుకుంటూ గాలివార్తలు, వదంతులను వ్యాపింప చేస్తున్న వీళ్లందరి ఖాతాలో వేయిండి.ఆ పాపమంతా అంటూ చిత్రగుప్తుడికి ఆజ్ఞ జారీచేశాడు యమధర్మరాజు. ప్రచారంలో ఉన్న ఈకథలో వాస్తవం ఎంతో కానీ.. అసత్యాలను ప్రచారం చేయడం మాత్రం మహా పాపమని అర్థం చేసుకోవాలి. □

ఆధ్యాత్మికం

## మేలు చేసే ద్రాక్ష గింజలు

తియ్యటి ద్రాక్షపండ్లను ఇష్టపడని వాళ్లు సామాన్యంగా ఉండరు. ఇప్పుడు సీన్‌లెస్ వస్తోంది. గింజలుంటే కూడా వాటిని తీస్తాం కదూ! నిజానికి అవి కూడా చాలా మంచిదని సర్వేల్లో తేలింది. ద్రాక్ష గింజలను యథాతథంగా కాదు గానీ.. వాటి సారాన్ని అనేక విధాల ఉపయోగిస్తున్నారు. ఇంతకీ దానివల్ల లాభాలేంటో చూద్దాం...

✦ గ్రేప్ సీడ్ ఎక్స్‌ట్రా ట్రాక్ట్ బీపీని క్రమబద్ధం చేస్తుంది. గుండెజబ్బులను దూరంగా ఉంచుతుంది. ✦ ఎముకలకు దృఢత్వాన్ని తెచ్చిపెడుతుంది. ✦ పుండ్లను తగ్గించడంలో తోడ్పడుతుంది. ✦ . టాబ్లెట్లు, క్యాప్స్యూల్స్ అధిక శాతం ద్రాక్షగింజల సారాన్నే వినియోగిస్తున్నారు. హైకొలెస్ట్రాల్, అథెరోస్క్లెరోసిస్, రక్తసరఫరా సరిగా లేకపోవడం వంటి జబ్బులను ఇది కొంతవరకూ నయం చేస్తుంది. ఇంకా పరిశోధనలు చేయాల్సి ఉంది.

✦ ద్రాక్ష విత్తనాలు అనేక విధాల మేలు చేసే మాట నిజమే అయినా.. అది సరిపడకపోతాతే కడుపు నొప్పి,వాంతులు, వికారం, విరేచనాలు, బలహీనత లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల గ్రేప్‌సీడ్ ఎక్స్‌ట్రాక్ట్‌ను వైద్యుల సలహాతో మాత్రమే వాడాలి. □



# ఫిఫా ర్యాంకింగ్స్‌లో..భారత్ పరిస్థితి దారుణం



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో భారత్ ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లలో ఒకటిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇదే సమయంలో భారత్ ఫుట్‌బాల్ జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో టీమిండియాకు పెద్ద నష్టం వాటిల్లింది. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఫిఫా) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ 133వ స్థానానికి పడిపోయింది. ఇది భారత ఫుట్‌బాల్ జట్టుకు గత 8 ఏళ్లలో అత్యంత చెత్త ర్యాంకింగ్. అంతకు ముందు భారత జట్టు 2016

## 8 యేళ్లలో అత్యంత చెత్త రికార్డు

-2017 సీజన్‌లో 130వ స్థానం కంటే దిగువకు వచ్చింది. ఈ ర్యాంకింగ్స్‌లో నష్టానికి ఒక ప్రధాన కారణం. భారత్ 2025లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడం. భారత ఫుట్‌బాల్ జట్టు ఇంతకుముందు 127వ స్థానంలో ఉంది. కానీ ఇప్పుడు 2025లో పేలవమైన ప్రదర్శనకు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. టీమిండియా 7 స్థానాలు కిందకు పడిపోయి 133వ స్థానానికి చేరుకుంది. 2025లో భారత్ ఇప్పటివరకు మొత్తం 4 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. వాటిలో మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలైంది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది.

దురదృష్టవశాత్తు ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా భారత్ కంటే తక్కువ ర్యాంకింగ్‌లో ఉన్న జట్లతోనే ఆడటం గమనార్హం. దీంతో భారత జట్టుపై ఎక్కువగా ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసినప్పుడు జట్టు ఫామ్‌పై విమర్శలు మొదలయ్యాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. భారత జట్టు తన అత్యుత్తమ ర్యాంకింగ్‌ను 1996లో సాధించింది. అప్పుడు అది 94వ స్థానానికి చేరుకుంది. మరోపక్క పాకిస్థాన్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 133వ స్థానంలో ఉండగా, పొరుగు దేశమైన పాకిస్థాన్ పరిస్థితి మరింతదిగజారింది. పాకిస్థాన్ టాప్200 ర్యాంకింగ్స్‌లో కూడా లేదు. తాజా ర్యాంకింగ్స్‌లో పాక్ జట్టు మూడు స్థానాలు కిందకు పడిపోయి 201వ స్థానానికి చేరుకుంది. భారత మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ ప్రస్తుతం 184వ స్థానంలో ఉంది.



# ఆస్ట్రేలియా మల్టీ ఫార్మాట్ టూర్
## టీమిండియా కెప్టెన్‌గా రాధ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో తలపడే భారత్ క్రికెట్ ఎ జట్టు కెప్టెన్‌గా రాధా యాదవ్ నియమితులైంది. ఆగస్టు 7 నుండి 24 వరకు జరగనున్న ఆస్ట్రేలియాలో జరగనున్న బహుళ ఫార్మాట్ పర్యటన కోసం భారత ఎ మహిళా జట్టుకు స్పిన్నర్ రాధా యాదవ్ నాయకత్వం వహిస్తారు. భారత మహిళలు మూడు టి20లు మరియు 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడనున్నారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా-ఎ తో 4 రోజుల మ్యాచ్ ఆడనున్నారు. ఈ పర్యటన ఆగస్టు 7 నుండి మూడు టి 20 మాకేలో ప్రారంభమవుతుంది. తదుపరి మూడు 50 ఓవర్ల మ్యాచ్‌ల కోసం బ్రిస్బేన్‌లోని నార్త్‌కు టీమిండియా వెళుతుంది, భారత మహిళల సీనియర్ జట్టు తరపున ఏడు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడిన మిన్ను మణి ఈ పర్యటనకు డిప్యూటీ కెప్టెన్‌గా ఎంపికయింది. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో టి20 జట్టులోకి తిరిగి వచ్చిన ఓపెనర్ షఫాలి వర్మ అన్ని ఫార్మాట్ స్క్వాడ్‌లలో చోటు దక్కించుకుంది. అలాగే సజన సజీవన్, ఉమా చెత్రీ, టైటాస్ సాధు, షబ్నమ్ షకీల్ టి20 జట్టులో స్థానం లభించగా, శ్రేయాంక పాటిల్ అతి తక్కువ ఫార్మాట్ మ్యాచ్‌లలో పాల్గొనుంది. ప్రియా మిశ్రా ఫిట్‌నెస్‌కు లోబడి వన్డే, మల్టీడే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటుంది. టి20 జట్టు: రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలి వర్మ, డి. వృందా, సజన సజీవన్, ఉమా చెత్రీ (డబ్ల్యుకె), రాఘవి బిస్త్, శ్రేయాంక పాటిల్, ప్రేమ రావత్, నందిని కశ్యప్ (డబ్ల్యుకె), తనూజా కన్వెర్, జోషిత విజె, సహూామ షకీల్, షబ్నా విజె ఉండగా, వన్డే మరియు బహుళ ఫార్మాట్ జట్టులో రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలీ వర్మ, తేజల్ హసబ్నిస్, రఘ్వీ బిస్త్, తనుశ్రీ సర్కార్, ఉమా చెత్రీ (జూరీ), ప్రియా మిశ్రా, తనుజా కన్వర్, నందిని కశ్యప్ (డబ్ల్యూకె, షబ్, షబ్‌గుజ్‌కే, సాబ్ గుజ్జార్ ఠాకోర్, టిటాస్ సాధు).

## మహిళల ప్రపంచ కప్ మూడవ రౌండ్‌కు
# దివ్య, హంపి, హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ చెస్ కప్-2025 టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన నలుగురు క్రీడాకారిణిలు మూడవ రౌండ్‌కు చేరుకున్నారు. అగ్రస్థానంలో ఉన్న గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తమ మినీ మ్యాచ్‌లోని రెండవ గేమ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అఫ్రుజా ఖమ్‌దమోవాతో డ్రా చేసుకుని 1.5-0.5 తేడాతో విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడుతున్న హంపి నియంత్రణలో ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేసి టైబ్రేక్ అవసరం లేకుండానే దూసుకెళ్లింది.

ఈ ఈవెంట్‌లో రెండుసార్లు కాంస్య పతక విజేత అయిన ద్రోణవల్లి హారిక, తన స్వదేశీయురాలు పివి నందిదాను ఓడించి చివరి 32లోకి ప్రవేశించింది. రెండవ గేమ్‌లో హారిక ఎలాంటి దాడి అవకాశాలను తటస్థీకరించి 2-0 తేడాతో విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌లలో, ఆర్ వైశాలి కెనడాకు చెందిన మైలీజాడే ఔలెట్‌ను ఓడించగా, దివ్య దేశ్‌ముఖ్ జార్జియాకు చెందిన కేసరియా మ్గెలాడ్జేను ఓడించి, ఇద్దరూ తమ తమ మినీమ్యాచ్‌లను వరుస గేమ్‌లలో గెలిచారు.

తొలి రౌండ్‌లో నిరాశపరిచిన కె. ప్రియాంక, పోలాండ్‌కు చెందిన క్లాడియా కులోన్‌తో జరిగిన రెండు గేమ్‌లను డ్రా చేసుకుని టైబ్రేక్‌ను సాధించింది. మొదటి గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ అన్నా ఉషెనినాపై అద్భుతమైన విజయం సాధించిన తర్వాత, వంటికా అగర్వాల్ రెండవ గేమ్‌లో ఓడిపోయింది. అలాగూ పద్మిని రౌట్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌ను 1-1తో డ్రాగా ముగించడంతో మ్యాచ్ కూడా టైబ్రేకర్‌కు దారితీసింది.

## యూరప్ టూర్‌లో..
# భారత్ హాకీ జట్టు రెండో విజయం
### 6-0 తేడాతో ఐర్లాండ్ ఓటమి



**న్యూఢిల్లీ:** యూరప్ టూర్‌లో భాగంగా జరుగుతున్న రెండో మ్యాచ్‌లో ఇండియా పురుషుల హాకీ జట్టు తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించింది. ఐర్లాండ్‌పై 6-0 తేడాతో రెండో ఘన విజయం సాధించింది. ఇండియా తరపున ఉత్తమ్ సింగ్ మరోసారి గోల్స్ నమోదు చేయగా, కెప్టెన్ సంజయ్ ఆ తర్వాత వరుస గోల్స్ చేశాడు. మిడ్‌ఫీల్డర్ మహ్మద్ రహీల్ మోసేన్ వరుసగా అద్భుతమైన గోల్స్ సాధించగా, అమన్‌దీప్ లక్రా, వరుణ్ కుమార్ ఒక్కొక్క గోల్ చేయడంతో ఇండియా తన రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో ఐర్లాండ్‌పై 6-1 తేడాతో ఆధిపత్య విజయంతో భారత్ తమ యూరప్ పర్యటనను ప్రారంభించింది. ఉత్తమ్ సింగ్ పురుషుల కోసం గోల్ చేయడం ప్రారంభించాడు. తరువాత అమన్‌దీప్ లక్రా తమ ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. దీని తర్వాత ఆదిత్య లాలేజ్ వరుసగా గోల్స్ చేయడంతో అద్భుతమైన బ్రేస్ సాధించాడు. ఫార్వర్డ్ ఆటగాళ్లు సెల్వం కార్తీ మరియు బాబీ సింగ్ ధామి కూడా ఒక్కొక్క గోల్ చేసి స్కోరు షీట్‌లో చోటు సంపాదించారు. భారత్ తమ డిఫెండింగ్‌లో పటిష్టంగా ఉండటంతో ఐర్లాండ్ ఒక ఓదార్పు గోల్ మాత్రమే చేయగలిగింది. భారత్ తదుపరి రెండు వారాల పాటు ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం మరియు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో ఆడుతుంది.

## ఆర్చరీ ప్రపంచ కప్..
# భారత్ రికర్వ్ జట్ల నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్- 2025 టోర్నమెంట్‌లో భారత రికర్వ్ జట్లు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయాయి. మాడ్రిడ్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ 4వ దశలో భారత జట్టు ప్రచారం నిరాశాజ నకంగా ప్రారంభమైంది, పురుషుల మరియు మహిళల రికర్వ్ జట్లురెండూ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించాయి. కొత్త కోచ్ రాహుల్ బెనర్జీ మార్గదర్శకత్వంలో దీపికాకుమారి, అంకితా భకత్ మరియు 15 ఏళ్ల అరంగేట్రం గాథా ఖడకేలతో కూడిన మహిళల రికర్వ్ జట్టు ఫ్రాన్స్‌పై తొలి విజయం సాధించింది. ఘనమైన అర్హత స్కోర్ల తర్వాత నాల్గవ సీడ్ అయిన ఈ త్రయం మొదటి సెట్‌ను 58-54తో కైవసం చేసుకుంది. తదుపరి రెండవ సెట్‌ను టైగా ముగించిన తర్వాత 3-1 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, ఎనిమిది పాయింట్ల తప్పుడు దాడితో భారత్ మూడో సెట్‌ను 54-56తో కోల్పోవడంతో ఆట వేగం మారిపోయింది. మ్యాచ్ స్థాయి 3-3తో ఉండటం, ఒత్తిడి పెరగడంతో, భారత మహిళలు కోలుకోలేకపోయారు. చివరి సెట్‌లో ఖరీదైన ఆరు పాయింట్ల స్కోరుతో వారి మొత్తం స్కోరు 53కి చేరుకుంది, దీనితో ఫ్రాన్స్ సెట్‌ను 54-53తో అధిగమించి అద్భుతమైన విజయాన్ని సాధించింది. కాగా బ్రెజిల్ చేతిలో ఓడిపోయిన పురుషుల జట్టు పురుషుల రికర్వ్ జట్టు ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్, నీరజ్ చౌహాన్ తమ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో బ్రెజిల్‌ను ఓడించలేకపోయారు. తొమ్మిదో సీడ్ అయినప్పటికీ, భారతదేశం ప్రారంభంలోనే వెనుకబడి, మొదటి రెండు సెట్‌లను 55-56 మరియు 54-57 తేడాతో కోల్పోయింది.

మూడవ సెట్‌లో 57-56 తేడాతో గెలిచిన కొద్దిపాటి పునరుజ్జీవనం సరిపోలేదు. నాల్గవ మరియు చివరి సెట్‌లో బ్రెజిల్ స్థిరంగాఉండి, 56-54, 6-2 తేడాతో విజయం సాధించి, భారత్‌ను పోటీనుండి తప్పించింది. అంతకు ముందు క్వాలిఫికేషన్ రౌండ్లలో పేలవమైన ప్రదర్శన కారణంగా ఈ తొలినిష్క్రమణలు జరిగాయి. పురుషులలో, ధీరజ్ బొమ్మదేవర భారతదేశం తరపున 13వ స్థానంలో అత్యధికంగా ర్యాంక్ సాధించగా, అరంగేట్రం చేసిన రాహుల్ సింగ్ మరియు చౌహాన్ 34వ మరియు 35వ స్థానాల్లో నిలిచారు, దీనితో భారతదేశానికి తొమ్మిదో సీడ్ జట్టు ర్యాంకింగ్ లభించింది. మహిళలవిభాగంలో, అంకితా భకత్, దీపికా కుమారి మరియు గతా ఖడకే వరుసగా 15, 18 మరియు 25వ స్థానాల్లో నిలిచారు.

# ఎన్‌ఆర్‌ఐ బిలియనీర్లలో 'జెడ్ స్కేలర్' టాప్

**వాషింగ్టన్, జులై 11:** విదేశాల్లో పుట్టి అమెరికాలో పర కుబేరులుగా ఎదిగిన వాళ్లలో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్ 2025 ర్యాంకింగ్స్‌లో 12మంది భారత సంతతి బిలియనీర్లు చోటు దక్కించుకోవడంతో అత్యధిక మంది విదేశీ అమెరికన్ కుబేరులకు జన్మస్థానంగా భారత్ నిలిచింది. 2022లో కేవలం ఏడుగురు భారత సంతతి బిలియనీర్లు ఉండగా ఇప్పుడు గణనీయంగా పెరిగారు. అమెరికాలో విదేశీ సంతతి సంపన్నుల తాజా జాబితాలో భారత్ ఇజ్రాయెల్, తైవాన్‌లను అధిగమించింది. ఈ రెండు దేశాలకు చెందినవారు చెరో 11 మంది ఈ జాబితాలో ఉన్నారు. స్వయం కృషితో ఎదిగిన ఈ భారత సంతతి కుబేరులు, విదేశాలలో జన్మించిన యుఎస్ బిలియనీర్ల మొత్తం 1.3 లక్షల కోట్ల డాలర్ల సంపద లో గణనీయ వాటాను అంది స్తున్నారు. ఆల్ఫాబెట్ అధినేత సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వంటి కొత్తవారు ఇటీవల ఈ జాబితాలో చేరినప్పటికీ అంతగా గుర్తింపులేని దిగ్గజాలతో పోలిస్తే వారు ఆశ్చర్యకరంగా తక్కువ ర్యాంకులో ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ దిగ్గజం జెడ్ స్కేలర్ వ్యవస్థాపకుడు జె చౌదరి 17.9 బిలియన్ డాలర్ల సంపదతో భారత సంతతి అమెరికన్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉన్నారు. విద్యుత్తు, నీరు లేని మారుమూల హిమాలయ గ్రామం పనోహ్‌లో జన్మించిన చౌదరి గ్రాడ్యుయేట్ చదువుల కోసం 1980లో తొలిసారి అమెరికా వెళ్లారు.



**భారత సంతతి అపర కుబేరులు వీళ్లే..**

జె చౌదరి 17.9 బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (జెడ్ స్కేలర్), వినోద్ ఖోస్లా 9.2 బిలియన్ డాలర్లు- సన్ మైక్రో సిస్టమ్స్, వెంచర్ కేపిటల్, రాకేష్ గంగ్వాల్ 6.6 బిలియన్ డాలర్లు -ఎయిర్‌లైన్స్ (ఇండిగో సహ వ్యవస్థాపకుడు), రోమేష్ టి.వాధ్వానీ 5.0బిలియన్ డాలర్లు- సాఫ్ట్‌వేర్- సింఫనీ టెక్నాలజీ గ్రూప్, రాజీవ్ జైన్ 4.8 బిలియన్ డాలర్లు -ఫైనాన్స్ (జీక్యూజీ పార్టనర్స్ చైర్మన్), కవితార్క్ రామ్ శ్రీరామ్ 3.0 బిలియన్ డాలర్లు-గూగుల్, వెంచర్ కేపిటల్, రాజ్ సర్దానా 2.0 బిలియన్ డాలర్లు- టెక్నాలజీ సేవలు (ఐటి సంస్థ టిసిజిఐ), డేవిడ్ పాల్ 1.5 బిలియన్ డాలర్లు - వైద్య పరికరాలు, నికేష్ అరోరా 1.4బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (పాలో ఆల్టో నెట్‌వర్క్స సిఇఒ).

## టాప్ 10లోకి రాని 'ఇంటెల్': సిఇఒ లిప్-బు టాన్

**వాషింగ్టన్, జులై 11:** టెక్‌దిగ్గజం ఇంటెల్ కృత్రిమ మేధ రేసులో చాలా వెనుకబడిందని ఆ సంస్థ కొత్త సిఇఒ లిప్-బు టాన్ అంగీకరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు విడియోలైవ్ టెలి కాస్ట్‌లో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితి నుంచి పుంజుకోవడానికి తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆయన గత సిఇఒ పాట్ గెల్సింగర్ నుంచి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్యోగులతో మాట్లాడారు. '30యేళ్ల క్రితం మనమే నిజమైన లీడర్లం. కానీ ఇప్పుడు ప్రపంచం మొత్తం మారిపోయింది. సెమీ కండక్టర్ కంపెనీల్లో మనం కనీసం టాప్-10లో కూడా లేం' అని స్పష్టం చేశారు. సంప్రదాయ మార్కెట్ నుంచి కీలకమైన కృత్రిమ మేధ రంగంలోకి మళ్లేందుకు కంపెనీ అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని అభిప్రాయపడ్డారు. ఈ రంగంలోని ఎన్విడియా ఎఐ చిప్ డెవలప్‌మెంట్‌లో చాలా బలంగా ఉందని, దానిని నేరుగా సవాలు చేసే స్థితిలో ఇంటెల్ పరిస్థితి లేదన్నారు. ఇక ఇంటెల్ త్వరలో విడుదల చేయనున్న 18ఎ మోడల్ తమ అంతర్గత వినియోగదారుల అవసరాలను బలంగా తీరుస్తుందన్నారు. సంస్థలో సమూల మార్పు తీసుకురావడం ఓ మారథాన్ అని పేర్కొన్నారు. కంపెనీ ఎఎండి, ఎన్విడియాలా మరింత దూకుడుగా ఉండాలని చెప్పారు. కష్టమర్లతో ఉద్యోగులు వినయంగా ఉండి, వారి అవసరాలకు తగినట్లు స్పందించాలన్నారు. వాస్తవానికి ఇంటెల్ ఆర్థికంగా కూడా ఇబ్బందుల్లో ఉంది. సంస్థ ఒరెగాన్ క్యాంపస్ నుంచే 529 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా మరిన్ని కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. మార్కెట్ విలువ కూడా బాగా తగ్గి 100 బిలియన్ డాలర్లకు చేరింది. దాదాపు 18 నెలల క్రితం ఇది రెట్టింపుగా ఉంది. మరోవైపె ఎన్విడియా మార్కెట్ విలువ ఇప్పుడు నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రపంచంలో ఈమార్క్‌కు చేరిన తొలి కంపెనీలుగా నిలిచింది. ఇక తాము టాప్-10లో కూడా లేమని ఇంటెల్‌సిఇఒ లిప్-బు టాన్ చేసిన కామెంట్‌పై కంపెనీ ప్రతినిధి వివరణ ఇచ్చారు. అది కేవలం మార్కెట్ విలువలో మాత్రమే అని, టెక్నాలజీ సామర్థ్యాల్లో కాదని స్పష్టం చేశారు.



## యుపిఐ చెల్లింపుల్లో మనమే ఫాస్ట్

**న్యూఢిల్లీ, జులై 11:** యుపిఐ దన్నుతో, మిగతా ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా భారత్ చెల్లింపుల విధానం అత్యంత వేగవంతంగా ఉంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన యుపిఐ విధానం చాలా వేగంగా వినియోగంలోకి వచ్చిందని పేర్కొంది. అదే సమయంలో నగదుకు ప్రత్యామ్నాయాలైన డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటి ఇతరత్రా సాధనాల వినియోగం గణనీయంగా తగ్గిందని వివరించింది. ప్రస్తుతం యుపిఐ ప్రతి నెలా 1,800 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ చేస్తోందని ఐఎంఎఫ్ పేర్కొంది. వివిధ పేమెంట్ ప్రొవైడర్స్ సేవలు ఉపయోగించుకునే యూజర్ల మధ్య నిరాటంకంగా చెల్లింపు లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు క్లోజ్డ్ లూప్ సిస్టమ్‌లతో పోలిస్తే యుపిఐ లాంటి ఇంటర్ ఆపరబుల్ పేమెంట్ సిస్టమ్‌లు సమర్థవంతంగా ఉంటాయని తెలిపింది. అయితే ఇది మరింత వినియోగంలోకి వచ్చే కొద్దీ ప్రైవేట్ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి కూడా దారి తీయొచ్చని, అలాంటిది జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



# ఐటి షేర్ల ఒత్తిడితోనే సెన్సెక్స్ డౌన్

## వాణిజ్యం

**ముంబై, జులై 11:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. ఓ వైపు టారిఫ్‌ల విషయంలో నెలకొన్న అనిశ్చితి, మరోవైపు ఐటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీంతో పాటు టిసిఎస్ ఫలితాలు కూడా ఇన్వెస్టర్లను మెప్పించకపోవడంతో ఐటి షేర్లు డీలాపడ్డాయి. ఆటోమొబైల్ షేర్లూ సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు మేర నష్టపోగా, నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. చివరికి సెన్సెక్స్ 689.81 పాయింట్లు నష్టపోయి 82,500.47 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 205.40 పాయింట్లు క్షీణించి 25,149.85 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.80గా ఉంది. టిసిఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టైటాన్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంకు, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి, ఎటర్నల్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధర 68.78 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,3522.10 డాలర్ల వద్ద నిలిచింది. త్రైమాసిక ఫలితాల్లో అంచనాలను అందుకోవడంలో టిసిఎస్ విఫలమైంది. గతేడాదితో పోలిస్తే 6శాతం వృద్ధితో రూ.12,760 కోట్ల లాభాన్ని నమోదు చేసినప్పటికీ, స్థిర కరెన్సీ వద్ద 3శాతం మేర క్షీణత నమోదైంది. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటిపై ఖర్చు తగ్గిస్తుండడంతో బ్రోకరేజీ సంస్థలు కూడా ఈ యేడాదికి ఐటి కంపెనీల ఆదాయ అంచనాలు తగ్గిస్తున్నాయి. దీంతో ప్రధాన ఐటి కంపెనీల షేర్లు 1-3 శాతం మేర క్షీణించగా, నిఫ్టీ ఐటి ఇండెక్స్ దాదాపు 2శాతం మేర నష్టపోయింది.అమెరికా అధ్యక్షుడుట్రంప్ తాజాగా కెనడాపై 35శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానవ్యాపార భాగస్వాములపై 15-20శాతం టారిఫ్ విధిస్తారని సంకేతాలు ఇచ్చారు.



# 'లూజ్ ఫాస్టాగ్'లపై కేంద్రం కఠిన కార్యాచరణ

**న్యూఢిల్లీ, జులై 11:** టోల్‌గేట్ల వద్ద సులభతర ప్రయాణం కోసం కొత్త టోల్‌పాస్ విధానాలను తీసుకొస్తోన్న కేంద్రం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'లూజ్ ఫాస్టాగ్'ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది. అలాంటి ఫాస్టాగ్ యూజర్లను ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాలి. అప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే లూజ్ ఫాస్టాగ్‌గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్‌ఎఐ తెలిపింది. అంతేకాకుండా కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. అందుకే వీటి కట్టడికి చర్యలు చేపట్టినట్లు జాతీయ రహదారుల సంస్థ తెలిపింది. లూజ్ ఫాస్టాగ్‌లను గుర్తించినప్పుడు సంబంధిత టోల్ కలెక్టింగ్ ఏజెన్సీలు వెంటనే దాన్ని రిపోర్ట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎఐ ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఇ-మెయిల్-ఐడిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఆ రిపోర్ట్‌లను పరిశీలించిన తర్వాత సదరు ఫాస్టాగ్ యూజర్లను బ్లాక్‌లిస్ట్ జాబితాలో చేరుస్తామని స్పష్టం చేసింది. ఇటీవల జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌లపై వార్షిక ఫాస్టాగ్ టోల్‌పాస్ విధానాన్ని కేంద్రం ప్రకటించిన విషయం విదితమే.




# టెస్లా తొలి షోరూమ్‌కి తేదీ ఖరారు

**వాషింగ్టన్, జులై 11:** చాలా కాలంగా భారతమార్కెట్లో ఎంట్రీకి చూస్తున్న గ్లోబల్ విద్యుత్ వాహనాల దిగ్గజం టెస్లా ఎట్టకేలకు మొదటి షోరూమ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ యేడాది 15వ తేదీన టెస్లా తమ తొలి 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో ప్రారంభిస్తుందని, ఇది భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు కీలక అడుగు అని పేర్కొంది. ఈ స్టోర్ కోసం టెస్లా కంపెనీ 4వేల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని లీజుకు తీసుకున్న విషయం విదితమే. గత కొన్ని వారాలుగా యూరప్, చైనా మార్కెట్లలో టెస్లా కార్లకు గిరాకీ తగ్గింది. దీన్ని భర్తీ చేసేందుకు గానూ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వాహన మార్కెట్‌గా ఉన్న మన దేశం మార్కెట్లోకి అడుగు పెట్టడం ముఖ్యమని టెస్లా భావించింది. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ కంపెనీ భారత్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. అందుకనుగుణంగా గడచిన నెలా, రెండు నెలల వ్యవధిలోనే భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించే ప్రక్రియను వేగవంతంచేసింది. ముంబైలో తొలి షోరూమ్ ఏర్పాటు అయ్యా క రోజుల వ్యవధిలోనే దేశరాజధాని ఢిల్లీ లోనూ స్టోర్ ఏర్పాటుకు టెస్లా ప్రయత్నిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ అభిప్రాయపడింది. ఇప్పటికే టెస్లా కంపెనీ చైనా, అమెరికా, నెదర్లాండ్స్ నుంచి ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం అవసరమైన సూపర్ ఛార్జర్స్ పరికరాలు, కార్ యాక్సె సరీస్, ఇతర విడిభాగాలను దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ముంబై షోరూమ్‌తో కలుపుకుని టెస్లా మొత్తం నాలుగు చోట్ల కమర్షియల్ స్థలాలను లీజుకు తీసుకుంది. పుణెలో ఇంజినీరింగ్ హబ్‌తో పాటు బెంగళూరులో రిజిస్టర్డ్ ఆఫీస్,ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ సమీపంలో తాత్కాలిక ఆఫీస్ ఉన్నాయి. కంపెనీకిచెందిన మోడల్ వైరేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యువి కార్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయని తెలుస్తోంది. మోడల్ వై ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న విద్యుత్ కారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.